ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 43 సంచిక : 10 అభివృద్ధి మాసపత్రిక ఆగస్టు 2015 ₹ 10

## సమ్మిళిత వృద్ధి మరియు సామాజిక మార్పు




**ఆర్థిక సమీకృతం - సాంఘిక పరిణామం**
చరణ్‌సింగ్, సి.ఎల్. దధీచ్, ఎస్. అనంత్

**భారతదేశంలో సమ్మిళిత వృద్ధి మరియు సామాజిక మార్పు**
ఎన్.ఆర్. భానుమూర్తి, వర్షాశివరాం

**సాధికారతకు డిజిటల్ సాంకేతికత దన్ను**
విజయ్‌కుమార్ కౌల్

**సమ్మిళితవృద్ధిలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల పాత్ర**
పి.ఎం. మాథ్యూ

# భారతరత్న అబ్దుల్ కలాంకు నివాళి









అబ్దుల్ కలాం భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న
రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ఉపరాష్ట్రపతి హామీద్ అన్సారీ, ప్రధానమంత్రి నరేంద్రమోడీ

ISSN : 0971-8729

సంపుటి : 43 సంచిక : 10

ఆగస్టు 2015


# యోజన

చీఫ్ ఎడిటర్ : దీపికా కచ్చల్
సీనియర్ ఎడిటర్ : విజయకుమార్ వేదగిరి
ఎడిటర్ : షఫీ మహమ్మద్
జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్): వి.కె. మీనా


e-mail : yojana_telugu@yahoo.co.in,
e-mail : yojana.telugu@nic.in


*ఆనోభద్రాః క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

1. సంపాదకీయం 4

2. ఆర్థిక సమీకృతం, సాంఘిక పరిణామం 5
చరణ్‌సింగ్, సి.ఎల్. దధీచ్, ఎస్. అనంత్

3. మన వృద్ధిరేటు సమ్మిళితమేనా?
సిద్ధాంతపరమైన అంశాలు – ఆధారాలు 11
శ్రీపాద మోతీరాం

4. సమ్మిళిత వృద్ధిలో చిన్న – మధ్యతరహా పరిశ్రమల పాత్ర 13
పి.ఎం. మాథ్యూ

5. సమ్మిళిత వృద్ధి మరియు సామాజిక మార్పు 18
ఎన్.ఆర్. భానుమూర్తి, వర్షాశివరాం

6. సాధికారతకు డిజిటల్ సాంకేతికత దన్ను 21
విజయ్‌కుమార్ కౌల్

7. సామాజిక భద్రతకు అటల్ పెన్షన్ యోజన 24
జితేంద్రసింగ్

8. విజ్ఞాన విపంచి
ప్రాతూరి పోతయ్యశర్మ 26

9. దర్పణం 29
యోజన సంపాదకవర్గం

10. నైపుణ్యభారతం 30
యోజన సంపాదకవర్గం

11. సమ్మిళిత వృద్ధికి ఉపకరణంగా వ్యవసాయం 32
భువన్ భాస్కర్

12. భారత ప్రజాపంపిణీ వ్యవస్థ – రాజకీయ ఆర్థికస్థితి 37
సి.ఎస్.సి. శేఖర్

13. భారతదేశంలో సామాజిక పరిణామక్రమం 42
సమ్మిళితవృద్ధి
పి. ఓంకార్

14. స్వతంత్ర సంగ్రామంలో మహిళా మణులు 49
సుసర్ల మాధవి

15. అభివృద్ధి మార్గసూచి 51


**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

**యోజన (తెలుగు) చందా వివరాలు**

**1 సంవత్సరానికి - రూ. 100/- 2 సంవత్సరాలకు - రూ. 180/- 3 సంవత్సరాలకు - రూ. 250/-**

**మరిన్ని వివరాలకోసం : 040-23310162**


**చందాను మనియార్డరు/డి.డి. ద్వారా పంపవలసిన చిరునామా :** ఎడిటర్, యోజన (తెలుగు), 10-2-1, ఎఫ్‌డిసి కాంప్లెక్స్, మహావీర్ హాస్పిటల్ ఎదురుగా, ఏ.సి. గార్డ్స్, హైదరాబాద్ – 500 028 ఫోన్ : 23315288, 23314823


యోజనలో ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరచిన భావాలు ఆయా రచయితలవే. వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం/సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు

చీఫ్ ఎడిటర్ డెస్క్

# యోజన

## అంతరాలను పూరిస్తూ ...




స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గత ఆరున్నర దశాబ్దాలలో వర్ధమాన దేశాల స్థాయి నుండి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా మనదేశం సాధించిన పురోగతి ఎంతో విశిష్టమైనది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ, గత మూడు నెలల కాలానికి మన దేశం 7.5శాతం వృద్ధిరేటును సాధించగలిగింది. ఇటీవలే వెలువడిన ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం మన దేశం రానున్న రెండు ఆర్థిక సంవత్సరాలలో వరుసగా 7.5శాతం, 7.8శాతం మరియు 2017-18లో ఎనిమిది శాతం వృద్ధి రేటును సాధించగలదని తెలుస్తున్నది.

రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలనూ ఉద్దేశించి ప్రసంగిస్తూ, దేశంలోని అత్యంత పేదవారిని సైతం చేరగలిగిన సమ్మిళిత వృద్ధే మనకు అత్యంత ప్రాధాన్యం అన్నారు. దీనివల్ల మనకు అభివృద్ధి ఫలాలు చేతికందినవి నోటికి అందడం లేదని అర్థం అవుతున్నది. అనేక రంగాలలో మనం సాధించిన ప్రగతి ఇంకా దేశంలోని అట్టడుగు వర్గాలకు చేరలేదు. ఐక్యరాజ్యసమితి వారి అభివృద్ధి నివేదిక ప్రకారం మన దేశం ఇంకా అభివృద్ధి సూచికలో 135వ స్థానంలో ఉండటమే దీనికి తార్కాణం. మన దేశంలో వృద్ధి అన్నివేళలా ఫలాలను అందరితో పంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెపుతున్నాయి. నిజానికి ఈ సమ్మిళిత వృద్ధి అన్న భావాన్ని మొట్టమొదటిసారిగా, పదకొండవ పంచవర్ష ప్రణాళిక విధాన పత్రంలో అన్ని రంగాలలో సంతులిత వృద్ధిని సాధించే లక్ష్యాలను నిర్దేశిస్తూ ఉపయోగించారు. పేదరిక నిర్మూలన విద్యా- ఆరోగ్య ప్రమాణాల పెంపుదల, జీవనాదాయ మార్గాల వృద్ధి వంటి అన్ని అవకాశాలనూ సమానంగా పెంపొందించాలని ఈ భావాన్ని వాడారు.

సమ్మిళిత లేదా సంతులిత వృద్ధి అంటే ఉపాధి అవకాశాలను మరిన్ని కల్పించి, పేదరిక నిర్మూలనకు తోడ్పడటం. అందరికీ సమానావకాశాలను అందచేసి విద్యా, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం వంటివి ఇందులో భాగంగా ఉంటాయి. సమాజంలో విస్మరింపబడిన వర్గాలను ప్రధాన జనజీవన స్రవంతిలోకి తేవడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రధానమంత్రి జనధన యోజన పథకమైతే, ప్రారంభించిన కేవలం పది నెలల కాలంలోనే 98శాతం కుటుంబాలకు బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించింది. ముద్రబ్యాంకు, ఎస్ఐటియు నైపుణ్యాభివృద్ధి సంస్థ వంటి బలమైన పథకాలు ఈ లక్ష్యాన్ని మరింత సుగమం చేశాయి. దీనివల్ల అత్యంత నిరుపేదలు సైతం మంచి నైపుణ్యంతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందే వీలు కలిగింది. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి జీవన సురక్ష యోజన మరియు అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సామాజిక సంరక్షణ దిశగా అమలు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజల జీవన ప్రమాణాలను కొంతమేర మెరుగుపరచి ఆర్థిక వలసలను ఆపగలిగింది. కిసాన్‌కార్డ్, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన అంటే రైతులకు సాగుబడికి తగిన నీటివసతిని అందించే పథకం, జాతీయ వ్యవసాయ మార్కెట్ వంటివి ప్రధానంగా వ్యవసాయ కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తూ, సమాజ సాంఘిక ఆర్థిక వృద్ధి చిహ్నంగా నిలుస్తున్నాయి.

ఏది ఏమైనప్పటికీ 1.2 బిలియన్ల జనాభా మొత్తానికి అభివృద్ధి ఫలాలు అందేటట్లు చూడటమే ఒక మహా యజ్ఞం. అన్ని వర్గాలవారినీ, సమాజంలోని అన్ని ప్రాంతాలవారినీ సమానంగా ఉద్ధరించడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపకరిస్తుంది. ఈనెలలోనే ప్రధానమంత్రి మోడీ ప్రారంభించిన "డిజిటల్ ఇండియా" పథకం దీనికి ఎంతగానో తోడ్పడుతుంది. ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాలు, కార్యక్రమాల ఫలాలను అందరికీ అందించడానికి ఈ సాంకేతికత ఎంతగానో తోడ్పడుతుంది. ఒక విధంగా చెప్పాలంటే విద్యా, ఆరోగ్యం, వ్యవసాయం,తయారీ వంటి రంగాలను ఈ సాంకేతికత సమూలంగా మార్చివేయగలదు. సమ్మిళిత వృద్ధి అనే ఒక విశాల దృక్పథంతో మన ఆర్థిక వ్యవస్థ నేడు ప్రజలందరికీ గౌరవనీయమైన స్థాయినీ, అవకాశాలనూ కల్పించడానికి ఎంతో ఉపకరిస్తున్నది.

# ఆర్థిక సమీకృతం, సాంఘిక పరిణామం

**భారత ప్రభుత్వం విధానపరమైన సమీక్ష నిర్వహించి సమీకృత ఆర్థిక కార్యకలాపాల్లో జాతి జనులను భాగస్వామ్యం చేయడానికి బ్యాంకు ఖాతాలను తెరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో అది విజయవంతమైంది. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) మంచి ఫలితాలను సాధిస్తూ దేశంలోని 98 శాతం కుటుంబాలకు బ్యాంకు ఖాతాలను కల్పించింది.**

సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు తేలికపాటి నియమాలతో రుణ సదుపాయం అందచేయడం ద్వారా దేశంలో ఆర్థిక వృద్ధి, పెట్టుబడులను పెంచడమే ఆర్థిక సమీకృతం ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా సమాన ప్రాతిపదికన మెరుగైన సాంఘికాభివృద్ధి సాధించడానికి ఆర్థిక సమీకృతానికి దోహదపడుతుంది. మహిళలతో సహా పేదలు, అట్టడుగున ఉన్న వర్గాలలో సాధికారతను పెంపొందించడం ద్వారా, ఆయా వర్గాలు స్వయం సమృద్ధితో, సరైన అవగాహనతో చక్కటి ఆర్థిక నిర్ణయాలను తీసుకొనడానికి ఆర్థిక సమీకృతం వెసులుబాటు కల్పిస్తుంది. పింఛన్లు, రుణ, బీమా, పొదుపు, చెల్లింపు ఖాతాలు వంటి విస్తారమైన ఆర్థిక సేవలను అందరికి అందుబాటులోకి తీసుకొని రావడానికి ఆర్థిక సమీకృతం సహాయపడుతుంది. దీంతోపాటు, అత్యవసర రుణాలతో సహా ప్రమాద సమయాల్లో ఆదుకొనే బీమా సౌకర్యం, వృత్తి విరమణ తరువాతి అవసరాల కోసం పొదుపు, విద్య, వ్యాపార అవకాశాల వంటి సేవలను కూడా అందరికీ ఆర్థిక సమీకృతం దగ్గర చేస్తుంది. ఆ విధంగా, దేశంలో అత్యధిక జనాభాకి మెరుగైన ఆదాయం, జీవన ప్రమాణాలను అందించే లక్ష్యంగా ఆర్థిక సమీకృతం పనిచేస్తుంది.

ఇప్పటికే ఉనికిలో ఉన్న సాధారణ ఆర్థిక రంగ సేవలను ఆర్థిక సమీకృతం మరింత విస్తృతం చేస్తూ ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తుంది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వం సంయుక్తంగా స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆర్థిక సమ్మిళితాన్ని సాధించడానికి అనేక చర్యలు తీసుకున్నాయి. అయితే గతంలో తీసుకున్న చర్యలు ఆశించిన ఫలితాలను సాధించలేకపోయాయి. ఇటీవల కాలంలో భారత ప్రభుత్వం విధానపరమైన సమీక్ష నిర్వహించి సమీకృత ఆర్థిక కార్యకలాపాల్లో జాతి జనులను భాగస్వామ్యం చేయడానికి బ్యాంకు ఖాతాలను తెరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో అది విజయవంతమైంది. ప్రధాన మంత్రి జన్‌ధన్‌యోజన (పీఎంజేడీవై) మంచి ఫలితాలను సాధిస్తూ దేశంలోని 98 శాతం కుటుంబాలకు బ్యాంకు ఖాతాలను కల్పించింది. దీనికి తోడుగా, ఈ కార్యక్రమాల ప్రభావం ఏ స్థాయిలో ఉన్నప్పటికీ భారత్‌ను మరో మెట్టుపైకి తీసుకెళుతూ సామాజిక,

**చరణ్‌సింగ్,** ఆచార్యుడు, ఐఐఎం, బెంగుళూరు. e-mail:charansingh@iimb.ernet.in
**సి.ఎల్. దధీచ్,** పూర్వ సంచాలకుడు, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంగుళూరు. E-mail:cldadhich@hotmail.com
**ఎస్. అనంత్,** స్వతంత్ర పరిశోధకుడు, విజయవాడ. e-mail: sananth99@gmail.com.

ఆర్థిక పరిస్థితుల్లో పెను మార్పులు తీసుకొస్తున్నాయి.

**ఆర్థిక సమీకృతంపై చారిత్రక మూల్యాంకనం**

బ్రిటీషు వారి వలస పాలనా కాలం నుంచి అసంఘటిత రంగాన్ని కుదించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. 1895లో నికల్సన్ నివేదిక ప్రకారం వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుంచి దేశీయులను రక్షించడానికి 'భూ బ్యాంకు'లను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. తత్ఫలితంగా, సహకార రుణ సంఘాల చట్టం, 1904, చట్ట రూపం దాల్చింది. ఇతర విషయాలతో పాటు ఈ చట్టం సహకార రుణ వ్యవస్థకి ఒక ఆధారంగా ఉంటూ వచ్చింది. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రుణ సదుపాయాన్ని అనేక వర్గాలకు విస్తరించడానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఆ తరువాతి కాలంలో అంటే 1951-54 మధ్య కాలంలో నిర్వహించిన అఖిల భారత గ్రామీణ రుణ సర్వేలో గుర్తించిన ముఖ్యమైన విషయం ఏమంటే 1950-51 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయదారులకు అందిన మొత్తం రుణాలలో అప్పట్లో ఉన్న వాణిజ్య బ్యాంకులది 0.9 శాతం, గ్రామీణ వడ్డీ వ్యాపారులది 24.9 శాతం, వృత్తిపరమైన వడ్డీ వ్యాపారులది 44.8 శాతం (ఆర్.బి.ఐ 2008, 2011) వాటాగా ఉన్నట్లు తేలింది. ఆర్థిక సమీకృతాన్ని సాధించడానికి తొలి రోజుల్లో జరిగిన ప్రయత్నాల్లో భాగంగా 1955లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాని, తరువాత అంటే 1969, 1980 సంవత్సరాల్లో మరిన్ని బ్యాంకులను జాతీయం చేయడం జరిగింది. జాతీయ గ్రామీణ వ్యవసాయాభివృద్ధి బ్యాంకును స్థాపించడం ద్వారా వ్యసాయ రంగం వంటి ప్రాధాన్యతా రంగాలకు రుణ సదుపాయాలకు ప్రాధాన్యత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆర్థిక సంస్థలను అనేక వర్గాలకు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 2005లో ఆర్.బి.ఐ. ఆర్థిక సమీకృతం సాధించడానికి అనేక కార్యక్రమాలను ప్రకటించగా అందులో వివిధ రకాల ఆర్థిక సేవలను పొందుపరిచింది. అందులో భాగంగా, బ్యాంకులు నిర్నిబంధంగా ఖాతాలను తెరవడానికి (దీన్నే 2012లో ప్రాథమిక పొదుపు బ్యాంకు ఖతాగా, అదే ఇప్పుడు జన్ ధన్ ఖాతాగా రూపాంతరం చెందింది) అనుమతించింది. పేద ప్రజల కోసం పొదుపు ఖాతాలు, రుణ సదుపాయం, సూక్ష్మ బీమా వంటి సేవలతో బ్యాంకింగ్ రంగాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని రంగరాజన్ కమిటీ చేసిన సిఫార్సుల కారణంగా ఆర్థిక సమీకృత భావన మరింత బలపడింది. పర్యావసానంగా, ప్రతి బ్యాంకు కూడా పైలెట్ ప్రాజెక్టు కింద కనీసంగా ఒక జిల్లాను ఎంచుకొని నూటి నూరు శాతం జనాభాకి బ్యాంకు ఖాతాలను కల్పించే బృహత్ ప్రయత్నానికి శ్రీకారం చుట్టాయి. అంతే కాకుండా మారు మూల గ్రామాలలో ఇంటింటికీ చౌకైన బ్యాంకింగ్ సేవలను అందించడానికి అనేక చర్యలు చేపట్టాలని రంగరాజన్ కమిటీ సిఫార్సు చేసింది. 2010 నుంచి మొదలయ్యే మూడు ఆర్థిక సంవత్సరాలకు గాను ఆర్థిక సమీకృత ప్రణాళికలను బ్యాంకులు ఆమోదించడంతో పాటు, 2012 నాటికి వేయి నుంచి రెండు వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలను విస్తృత పరచాల్సి ఉంటుంది. ఇందులో బ్యాంకులు కనీసంగా గ్రామీణ ప్రజానీకానికి నాలుగు రకాలైన ఆర్థిక సేవలను అందించడం, బ్యాంకు శాఖలు లేని గ్రామాల్లో కనీసంగా 25 శాతం కొత్త శాఖలను ప్రారంభించాల్సి ఉంటుంది.

గ్రామీణులు, వ్యవసాయదారులకు కిసాన్, సాధారణ క్రెడిట్ కార్డులను అందించడం కూడా బ్యాంకుల ముఖ్యమైన కర్తవ్యంగా రంగరాజన్ కమిటీ నిర్దేశించింది. ఇక ఇటీవల కాలంలో ప్రారంభించిన 'మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ రీఫైనాన్స్ ఏజెన్సీ' (ముద్ర) పది లక్షలకు మించని అవసరాలున్న చిన్న వ్యాపారులకు రుణ సదుపాయం కల్పించే దిశగా ఆర్థిక కార్యకలాపాలను ప్రారంభించింది. రూ.20,000 కోట్ల మూల ధనంతో, రూ.3000 కోట్ల రుణ గ్యారెంటీ పరపతితో మొదలైన 'ముద్ర' సంస్థ దేశంలోని చిన్న వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలకు రుణాలు అందించే ఆర్థిక సంస్థలకు ఆర్థికంగా అండగా ఉండబోతోంది. అయితే ఎన్ని ప్రయత్నాలు, ఎన్ని చర్యలు చేపట్టినా గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వ పరమైన ఆర్థిక సేవలు గణనీయ స్థాయిలో విస్తరించడం లేదు. అఖిల భారత రుణ, మదుపర్ల సర్వే (ఏఐడీఐఎస్, 2013) పేర్కొన్నదాని ప్రకారం, మొత్తం గ్రామీణ కుటుంబాల్లో 17.2 శాతమే సంఘటిత ఆర్థిక సంస్థల్లో రుణాలు తీసుకోగా, 19.0 శాతం అసంఘటిత ఆర్థిక వ్యవస్థల నుంచి అప్పు తీసుకున్నట్లుగా తేలింది. ఆ విధంగా, గ్రామీణ ప్రాంతాల్లో, రుణాలు ఇవ్వడంలో పైచేయి సాధిస్తున్న వడ్డీ వ్యాపారులను అధిగమించే విధంగా ఆర్థిక సేవలను అందించడానికి అనేక కార్యక్రమాలను తీసుకున్నా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. 2014 తొలినాళ్లలో నిర్వహించిన సర్వే ఫలితాల ప్రకారం ఆర్థిక సమీకృతాన్ని సాధించడంలో ఉన్న సవాళ్లను డిమాండ్, సప్లయి కోణంలో సింగ్, నాయక్ (2015)లో విస్పష్టమైన అధ్యయనాన్ని నిర్వహించారు.

సరిగ్గా ఈ నేపథ్యంలో, గత దృక్పథాలకు భిన్నంగా ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఆర్థిక సమీకృతాన్ని ఒక ఉద్యమంలాగా సాధించడమే లక్ష్యంగా కాకుండా, "రూపే డెబిట్" కార్డును, సూక్ష్మ బీమాను అందిస్తూ గ్రామాల స్థానంలో ప్రతి గృహానికి బ్యాకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొని రావడానికి ప్రాధాన్యత ఇచ్చింది. పీఎమ్‌జేడీవైని ప్రారంభించే సమయంలో జనవరి, 26, 2015 నాటికి 7.5 కోట్ల బ్యాంకు ఖాతాలను తెరవాలని లక్ష్యంగా పెట్టుకుంటే రికార్డు స్థాయిలో విజయం సాధించింది. (పట్టిక-1 చూడండి)

పట్టిక-1: ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (అంకెలు కోట్లలో)

| వ. సం. | | తెరిచిన ఖాతాల సంఖ్య | రుపే డెబిట్ కార్డుల సంఖ్య | ఖాతాలలో నిల్వ | సున్నా నిల్వ ఖాతాలు | గ్రామాలు మొత్తం | పట్టణాలు |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ప్రభుత్వ బ్యాంకులు | 6.9 | 5.8 | 12.7 | 11.9 | 14357.5 | 52.3 |
| 2. | ప్రైవేటు బ్యాంకులు | 2.5 | 0.4 | 2.9 | 2.1 | 3258.5 | 52.1 |
| 3. | ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు | 0.4 | 0.3 | 0.7 | 0.6 | 1068 | 49.3 |
| | మొత్తం | 9.79 | 6.5 | 16.3 | 14.5 | 18684.6 | 52.2 |

మూలం : భారత ప్రభుత్వం (2015ఏ)

**ఆర్థిక సమీకృతపు సాంఘిక, ఆర్థిక ప్రభావం**

కేవలం బ్యాంకింగ్ సేవలను అందించడమే కాకుండా సమీకృత కార్యకలాపంలో మరెన్నో అంశాలు మిళితమై ఉన్నాయి. గడిచిన రెండు దశాబ్దాల అనుభవాన్ని దృష్టిలోకి తీసుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించడానికి బ్యాంకింగ్ రంగం అత్యంత చలనశీలతతో విస్తరించాల్సి ఉంటుందని స్పష్టమవుతుంది. చారిత్రకంగా చూసినా, ఆర్థికపరమైన మార్పు అనివార్యంగా సాంఘిక పరిణామానికి దారి తీస్తుందని స్పష్టమవుతుంది. గ్రామీణ భారతంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. వ్యవసాయం యాంత్రీకరణ, రవాణా, సమాచార సాధనాల్లో మెరుగుదలతో పాటు ఇతరత్రా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. అందుకనే బ్యాంకుల లావాదేవీల్లో ఈ ఆర్థిక, సామాజిక మార్పు ఫలితాలు స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయి.

ఒక సమగ్రమైన సాంఘిక భద్రతను కల్పించడంలో జన్‌ధన్‌కి ఉన్న సామర్థ్యానికి తోడుగా అందరికీ అందుబాటులో ఉండే మరో మూడు పథకాలు: ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన కూడా సామాజిక ప్రభావాన్ని చూపిస్తున్నాయి. 10.4 కోట్ల మంది ప్రజలు ఈ మూడు పథకాల కిందకి రావడం జరిగింది. అసంఘటిత రంగంలో పని చేస్తున్నవారు, అసంఖ్యాక పేదలకు సామాజిక భద్రత కల్పించడానికి, దేశ పౌరులకు ఆర్థిక ప్రయోజనాలను అందచేయడానికి వీలుగా ఈ పథకాలను అవసరమైన మేరకు మార్పు చేసుకోవడానికీ పీఎంజేడీవై ఖాతా కీలకంగా మారింది.

2010 సంవత్సరం తరువాత ఆర్థిక సమీకృతానికి సాంకేతిక పరిజ్ఞానం ముందు భాగంలో నిలిచింది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందేకొద్దీ సాంకేతిక పరిష్కారాలపై వ్యయం తగ్గుతుండడంతో పీఎమ్‌జేడీవై పథకాన్ని మరింత విస్తారం చేసే అవకాశం ఏర్పడుతోంది. జన్ ధన్, ఆధార్, మొబైల్ (జేఏఎమ్)లను సంయుక్తంగా ఒక్క తాటిపైతీసుకొస్తూ క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించినందుకు ఆర్థిక తగ్గింపులను అందించడంతో మన దేశీయ ఆర్థిక, సామాజిక రంగాల్లో పెను మార్పులు తీసుకొని రావడానికి ఒక అసమానమైన అవకాశం ఆవిష్కృతమవుతోంది. సమాచార, సాంకేతిక రంగాల్లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడులకు తోడుగా శరవేగంగా విస్తరిస్తున్న బ్యాంకింగ్ రంగానికి యూనిక్ నెంబరున్న ఆధార్ తోడ్పాటుతో వివిధ ప్రభుత్వ ఆర్థిక సేవలు మరింతగా విస్తృతమవుతూ, అంతిమంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకి అవసరమైన నిర్మాణ సృష్టికి అనూహ్యమైన అవకాశాలు ఏర్పడనున్నాయి. మన క్షేత్రస్థాయి అధ్యయనాల్లో కూడా ఇలాంటి సాక్ష్యాలే లభించాయి. జన్‌ధన్‌పథకాన్ని విస్తరించడం కష్టతరం కాదని నిరూపిస్తున్నాయి. పైగా అత్యధిక గ్రామీణ గృహ వ్యయాలన్నీ దాదాపుగా 25 కిలోమీటర్ల వ్యాసార్థానికే పరిమితం అవుతున్నాయని తేలింది. భారతదేశ ఆర్థిక భౌగోళిక స్వరూపాన్ని పరిశీలిస్తే అధికాధిక గ్రామాలన్నీ కూడా పట్టణాలకు 5-25 కిలోమీటర్ల దూరంలో ఉన్నవనే అర్థమవుతుంది.

జన్‌ధన్ ఖాతాలు అందించే అవకాశాల్లో ప్రధానంగా ఈ ఖాతాల చుట్టూ అతి పెద్ద నెట్ వర్క్ ఏర్పడడంతో వినియోగ దారులు చిన్నపాటి వ్యాపారాలలో బ్యాంకింగ్ సేవలతో అనుసంధానమవుతున్నారు. తద్వారా అనేకులు ఇప్పటికే సంఘటిత రంగంలోని బ్యాంకింగ్ సేవల్లోకి రావడం జరిగింది. ఆధార్‌తో అనుసంధానమైన సూక్ష్మ స్థాయి ఏటీఎంలు ద్వారా బయో మెట్రిక్స్‌కి వీలైన 'రుపే' కార్డులను నగదు చెల్లింపులకు బదులుగా వినియోగించే అవకాశాలు ఏర్పడుతున్నాయి. అయితే, దీనికి మరికొన్ని

పట్టిక – 2: ఆర్థిక సమీకృతాభివృద్ధి: బ్యాంకులు, ఆర్ఆర్‌బీఎస్

| వివరాలు | 2010 చివరకే | 2011 చివరకు | 2012 చివరకు | 2013 చివరకు | 2015 చివరకు |
|---|---|---|---|---|---|
| గ్రామాల్లో బ్యాంకు శాఖలు | | | | | |
| ఎ) శాఖలు | 33,378 | 34,811 | 37,471 | 40,837 | 46,126 |
| బి) శాఖలు లేనివి | 34,316 | 81,397 | 1,44,282 | 2,27,617 | 3,37,678 |
| సి) మొత్తం | 67,694 | 1,16,208 | 1,81,753 | 2,68,454 | 3,83,804 |
| బీసీల ద్వారా పట్టణ ప్రాంతాలు | 447 | 3,771 | 5,831 | 27,143 | 60,730 |
| ప్రాథమిక పొదుపు బ్యాంకు డిపాజిట్ ఖాతాలు–శాఖలు | | | | | |
| ఎ) పది లక్షల సంఖ్య | 60.19 | 73.13 | 81.20 | 100.80 | 126.00 |
| బి) రూ.వంద కోట్లలో మొత్తం | 44.33 | 57.89 | 109.87 | 164.69 | 273.30 |
| ప్రాథమిక పొదుపు బ్యాంకు డిపాజిట్ ఖాతాలు–బీసీలు | | | | | |
| ఎ) పది లక్షల సంఖ్య | 13.27 | 31.63 | 57.30 | 81.27 | 116.90 |
| బి) రూ.వంద కోట్లలో మొత్తం | 10.69 | 18.23 | 10.54 | 18.22 | 39.00 |
| బీఎస్‌బీడీఏ ఖాతాల్లో ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం | | | | | |
| ఎ) పది లక్షల సంఖ్య | 0.18 | 0.61 | 2.71 | 3.92 | 5.90 |
| బి) రూ.వంద కోట్లలో మొత్తం | 0.10 | 0.26 | 1.08 | 1.55 | 16.00 |
| కేసీసీ | | | | | |
| ఎ) పది లక్షల సంఖ్య | 24.31 | 27.11 | 30.24 | 33.79 | 39.90 |
| బి) రూ.వంద కోట్లలో మొత్తం | 1240.10 | 1600.05 | 2068.39 | 2623.00 | 3684.50 |
| జీసీసీ | | | | | |
| ఎ) పది లక్షల సంఖ్య | 1.40 | 1.70 | 2.11 | 3.60 | 7.40 |
| బి) రూ.వంద కోట్లలో మొత్తం | 35.10 | 35.07 | 41.84 | 76.30 | 1096.90 |

**ఆధారం : జీవోఐ (2014సి), ఆర్‌బీఐ (2013, 2014, 2015).**

షరతులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా, నగదు చెల్లింపులను ఏక సమయంలో జరిగే విధంగా బ్యాంకులు ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సి ఉంటుంది. ఇందుకోసం 'రుపే' కార్డుల్లో అంతర్గతంగా 'తక్షణ చెల్లింపు సేవ' (ఐఎమ్‌పీఎస్) గుర్తింపు సంఖ్య, 'సమీప ప్రాంత సమాచార' (ఎన్ఎఫ్‌సీ) ట్యాగులను ఏర్పాటు చేయాలి. అలాంటి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ సాకారమైనప్పుడు యావత్ సమాజంలో మొత్తం నగదు చెల్లింపులను ఎలక్ట్రానిక్ లావాదేవీలతో భర్తీ చేయడం సాధ్యమవుతుంది. సాంకేతిక పురోగతి, మొబైల్ ఫోన్‌ల వినియోగం పెరగడం ద్వారానే అత్యధిక నిరక్షరాస్యులున్న భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లో

నూతన అవకాశాలకు మార్గం ఏర్పడుతుంది. అలాంటి ఒక సాంకేతిక పురోగతికి చిహ్నంగా ఇటీవలనే అమెరికా ఒక పేటెంట్‌ని సామ్‌సంగ్ కంపెనీకి జారీ చేసింది. ఇందులో వేలి ముద్ర వేయడానికి తాకే అవసరం లేకుండానే ఫోన్ మెమరీలో నిక్షిప్తమైన వేలిముద్రను భద్రపరచడం సాధ్యం అవుతుంది.

ఆధార్ అనుసంధాన సూక్ష్మ ఏటీఎమ్‌ల వినియోగం ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పెరిగింది. ప్రత్యేకించి, ఇది ప్రతిభావంతంగా పనిచేయడంతో సంఘటిత బ్యాంకింగ్ సేవలను వినియోగించుకొనే వారి సంఖ్య కూడా పెరిగింది. బ్యాంకులు లేని ప్రాంతాల్లో కూడా మూడు ముఖ్యమైన ప్రయోజనాలైన సౌకర్యం, తక్కువ లావాదేవీ వ్యయం, బ్యాంకులతో పెరిగిన అనుబంధానికి నిదర్శంగా పెరిగిన రుణ వసూళ్ల శాతం నిలుస్తుంది. సంఘటిత బ్యాంకింగ్ రంగం విస్తరించడంతో, గతంలో అసంఘటిత రంగంలో లభించే వివిధ ఆర్థిక సేవలు మరింత చౌకగా మారిపోయాయి. తెలంగాణాలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఏటీఎంలు, ఆధార్ అనుసంధాన సూక్ష ఏటీఎంల కారణంగా గతంలోని అసంఘటిత నగదు బదిలీ లావాదేవీలు దాదాపుగా అంతరించి పోయాయి. అదే విధంగా, నగదు చెల్లింపు వ్యయం కూడా శరవేగంగా తగ్గిపోతోంది. గడిచిన నాలుగేళ్లలో బ్యాంకులు 'కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్' (సీబీఎస్)లో పెట్టుబడులు పెట్టడం కారణంగా నగదు బదిలీ ఏక కాలంలో జరిగిపోతోంది.

అనేక గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ అనుసంధాన సూక్ష్మ ఏటీఎంల ద్వారా బ్యాంకులు టర్మ్ డిపాజిట్లను సేకరించ గలిగాయి. లేదంటే ఈ డిపాజిట్లలో అధిక భాగం అసంఘటిత పెట్టుబడుల్లోనో, మాయదారి పథకాల్లోనో ఇరుక్కుని చిక్కుల్లో పడిపోయేవి. భారతదేశంలో మొదటిసారిగా ఈ దిశగా సాధించిన అతి పెద్ద విజయంతో సంఘటిత రంగం ద్వారా గ్రామీణ ప్రజల పొదుపు డిపాజిట్లను సాధించే అవకాశం ఏర్పడింది. అసంఖ్యాక కుటుంబాలు తాము చేసుకున్న పొదుపు మొత్తాలకు బ్యాంకు ఖాతాల ద్వారా రక్షణ పొందగలిగారు. సాంఘికంగా చూస్తే, కుటుంబీకులు ఇకపై తమ పొదుపు మొత్తాలను బ్యాంకుల్లో దాచుకొంటూ వాటిని విద్య, ఆరోగ్యం, గృహ కల్పన వంటి అంశాలకు వినియోగించ గలుగుతున్నారు. లేదంటే కష్టపడి దాచుకున్న సొమ్మును మోసపు పథకాల్లో, అసంఘటితంగా అవకతవకలతో కూడుకున్న అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో కోల్పోవాల్సి వచ్చేది.

**జన్‌ధన్ ముందడుగు...**

జన్‌ధన్ పథకం విజయం ఇంకా రూఢీ కాలేదు. పైగా దీని అంతిమ విజయం ప్రయివేటు, అసంఘటిత వడ్డీ వ్యాపారులను సమూలంగా నిర్మూలించినప్పుడే మాత్రమే సాధ్యం అవుతుంది. ప్రధానమంత్రి జనధన యోజన ప్రయోజనాలు లక్షిత జనాభాకి చేరడానికి రెండు ప్రధాన అవరోధాలున్నాయి. అందులో తగినన్ని బ్యాంకింగ్ శాఖలు లేకపోవడం, అధార్ అనుసంధాన ఏటీఎమ్‌లలో లావాదేవీలపై ఉన్న పరిమితి ముఖ్యమైనవి. దేశంలోని సగం గ్రామాలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవు (పట్టిక 2). ప్రధాన మంత్రి జనధన యోజన ఖాతాల లావాదేవీలపై విధించిన పరిమితిని తొలగిస్తే ఆ ఖాతాలు మరింత ప్రభావంతంగా మారి వాటి వినియోగం ఎక్కువవుతుంది. జనధన విజయంతో పాటు, బ్యాంకింగ్ సంస్కృతిని అభివృద్ధి చేయడానికి అడ్డుపడుతున్న వాటిలో జనధన కింద తెరిచిన ఖాతాలకు ఉన్న పరిమిత వెసులుబాటుతో పాటు ఆధార్ అనుసంధాన ఏటీఎంల ద్వారా పరిమితంగా ఉన్న లావాదేవీలు ముఖ్యమైనవి. చాలా బ్యాంకులు జనధన ఖాతాలలో రోజుకి రూ.1500 నుంచి 10,000 వరకు మాత్రమే లావాదేవీలకు అనుమతిస్తున్నాయి. ఇక ఒక లావాదేవీకి అయితే అత్యధికంగా రూ.50,000 మాత్రమే ఉంది.

దీనికి మించి ఆధార్ అనుసంధాన ఏటీఎంలలో లావాదేవీలు నిర్వహించాలంటే ఆ ఖాతాదారులు తప్పనిసరిగా సమీపంలోని బ్యాంకును సంప్రదించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనితో జన్‌ధన్ ఖాతాల నిర్వహణలో సమస్యలు

పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి వివిధ సందర్భాల్లో అధిక మొత్తాలను జన్ ధన్ ఖాతాలోకి ప్రత్యక్ష ప్రయోజన లావాదేవీ ద్వారా పొందడానికి ఈ నిబంధనలు అడ్డుపడు తున్నాయి. ఈ ఖాతాలకు అనుమతించిన రోజువారీ లావాదేవీలపై పరిమితి కారణంగా వివిధ ప్రభుత్వ ప్రయోజనాలు లేదా ఎల్ఐసీ చెల్లింపులు నిలిచిపోతున్నాయి. 2014లో సింగ్ అభిప్రాయపడిన ప్రకారం ఆర్థిక సమీకృతాన్ని మరింత విస్తృత పరచాలంటే పోస్టు ఆఫీసు సేవలను కూడా వినియోగించు కోవాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా పోస్టు ఆఫీసుల్లో 28 కోట్ల ఖాతాలు ఉంటే అందులో 13 కోట్ల పొదుపు ఖాతాలు, 11 కోట్ల రికరింగ్ డిపాజిట్లు ఉన్నాయి. సమాజంలోని అన్ని వర్గాలను ఆర్థిక సమీకృత కార్యకలాపాల్లోకి భాగస్వాములుగా చేయడానికి అనేక చర్యలు తీసుకుంటు న్నప్పటికీ, వాటి విజయం ఇప్పటికీ పాక్షింగానే ఉందని చెప్పాలి. అదే విధంగా, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన ఖాతాలను మరింత విస్తృత పరచడానికి రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న చౌక ధరల దుకాణాలు కూడా మంచి సాధనంగా ఉంటాయి. తద్వారా గ్రామాల్లో సామాజిక, ఆర్థిక నిర్మాణంలో కీలక మార్పులు తీసుకొని వస్తూ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ సాకారం కావడానికి తోడ్పడుతుంది. ఒక ఉదాహరణను చూద్దాం: ఎవరైనా ఎక్కడి నుంచైనా రేషన్ పొందే ఉపయుక్తమైన చర్యను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (ప్రస్తుతం వివిధ దశల్లో అమలవుతోంది) ప్రారంభించింది. ఈ దిశగా ఎవరైనా ఎక్కడైనా చౌక ధరల దుకాణానికి సంబంధించిన రేషన్ తీసుకొనే సదుపాయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఒక నగరంలో ప్రారంభించి విజయం సాధించింది. చౌక ధరల దుకాణం సమాచారాన్ని ఆధార్‌తో అనుసంధానం చేయడం కారణంగా వాస్తవ సమయంలో రేషన్ సరుకుల జారీని పౌర సరఫరాల శాఖ గుర్తించగలుగుతోంది. నగరంలోని 27,176

**గమనిక**

**వ్యాసకర్తలకు సూచన :** యోజన మాసపత్రికకు వ్యాసాలు రాసేవారు తమ వ్యాసాల సాఫ్ట్‌కాపీని పేజీమేకర్ 6.5, అను 6.0 ఫాంట్‌లలో టైప్ చేసి పంపుతూ, వ్రాత ప్రతిని కూడా తప్పనిసరిగా హామీపత్రంతో జతచేసి పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదము /అనుకరణ కాదని మాత్రమే కాక, ఈ వ్యాసాన్ని మరే పత్రికకు పంపలేదు / పుస్తకంగా ముద్రించలేదు అని కూడా పేర్కొనాలి. వ్యాసాలను పేజీమేకర్,మరియు పిడిఎఫ్ ఫార్మెట్‌లోనూ, అలాగే యూనికోడ్‌లో టైప్‌చేసి వర్డ్ ఫార్మెట్‌లోనూ అందచేయవచ్చును. రచనలు 15వ తేదీలోపు హామీ పత్రంతో పంపాలి.

ప్రచురణను నోచుకోని వ్యాసాలు తిరిగి పంపబడవు. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వ్యాసకర్తలు గమనించగలరు.

– *సీనియర్ ఎడిటర్*

రేషన్ షాపులకు సరఫరా చేసిన విక్రయ యంత్రాలను మండల స్థాయిలోని నిల్వ గోదాములకు అనుసంధానం చేయడంతో ఒక కేంద్ర స్థానం నుంచే మొత్తం లావాదేవీలను పర్యవేక్షించడం సాధ్యమైంది. రేషన్ దుకాణాలను బహుళ ప్రయోజన శాఖలుగా వృద్ధి చేయడంతో పాటు వీటి ద్వారా మరిన్ని సేవలను అంటే ఆర్థిక లావాదేవీలను కూడా నిర్వహిస్తే బ్యాంకుల పరిమితి మరింత విస్తరించడానికి సహాపడుతుంది.

**ముగింపు**

ఆర్థిక రంగంలో గణనీయ మార్పును ఆర్థిక సమీకృత కార్యకలాపాల ద్వారా సాధించాలని ఆశిస్తున్నాం. ప్రత్యేకించి ముద్ర, బంగారంపై రుణాలు, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన వంటి ఆర్థిక ఉపకరణాలను అందుబాటులోకి తీసుకొని రావడం ద్వారా గ్రామీణ ఆర్థిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులను ఆశిస్తున్నాం. జన గృహాలకు నిరంతరంగా బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రత్యక్ష ప్రయోజన మార్పిడితో నియమిత మొత్తాలను చేరవేస్తూ, మదుపు చేసే అవకాశాలను వృద్ధి చేస్తుంది. ఆర్థిక రంగంలో బ్యాంకులు, సూక్ష్మ రుణ సంస్థలు, స్వయం సహాయ బృందాలు పోస్టాఫీసులు, ముద్రా బ్యాంకులు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రభుత్వం, ప్రజల నిధులన్నీ సంఘటిత వ్యవస్థలోనే మార్పిడి జరుగుతూ నిల్వ ఉండే విధంగా బ్యాంకింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందుతోంది. అదే విధంగా, గ్రామీణ ప్రాంతాలో ఉన్న 1,40,000ల పోస్టాఫీసు శాఖల ద్వారా ఈ వనరులను మరింత ఉపయుక్తంగా వినియోగించు కోవడానికి కొత్త పథకాలను అమలు చేయడం సాధ్యం అవుతుందని భావిస్తున్నాం. వివిధ రూపాల్లో ఉన్న బ్యాంక్ డిపాజిట్లు, పోస్టాఫీసుల్లోని చిన్న పొదుపు మొత్తాలు, గోల్డ్ బాండ్స్, నూతన ఆర్థిక ఉపకరణాలన్నీ పైన పేర్కొన్న వ్యవస్థల ద్వారా మరింత బలోపేతం అవుతాయి.

ఆర్థిక రంగంలో సృజనాత్మక సామర్థ్యం ద్వారానూ, మార్కెట్ల అవసరాల కోసం తయారీ రంగ ఉత్పత్తుల సృష్టికి వినూత్న ఆలోచనలకు తేలికపాటి రుణ సదుపాయం అందచేయడం ద్వారానూ పైన పేర్కొన్న పరిణామాలు సాకారం అవుతాయని భావిస్తున్నాం. మేక్ ఇన్ ఇండియా నినాదం ప్రధాన లక్ష్యం ఆర్థిక ఉత్పాదన స్థాయిని పెంచుతూ, అత్యుత్తమ ఉపాధి అవకాశాలను కల్పిస్తూ సమీకృత అభివృద్ధిని సాధించడమేనని భావిస్తున్నాం. ■

# మన వృద్ధి రేటు సమ్మిళితమేనా? సిద్ధాంతపరమైన అంశాలు - ఆధారాలు

సమ్మిళిత వృద్ధిని నిర్వచించడానికి అనేక మార్గాలున్నాయి. కొందరు నిపుణులు నిర్ణీతకాలంలో పేదరికం ఎంత వేగంగా తగ్గిందో అనే అంశాన్ని పరిగణించారు. ఎక్కువ వేగంగా తగ్గితే దాన్ని మరింత సమగ్ర సమ్మిళిత వృద్ధిగా పరిగణించారు. నిజానికి మనదేశంలో ఎప్పటి నుండో ఆర్థిక నిపుణులు ఈ పేదరిక నిర్మూలన గురించి వివిధ అభ్యాసాలు చేశారు. కనుక అసలు విధానాన్ని పరీక్షిస్తే మేలు. సంప్రదాయకంగా పేదరికాన్ని పేదరిక రేఖా కొలమానంతోనే చూస్తుండేవారు. అయితే, తరువాత జాతీయ ప్రతిచయన సంస్థ వారు పెరుగుతున్న వినియోగాన్ని బట్టి పేదరికాన్ని కొలవడం ప్రారంభించారు.

దాదాపు 1990వ దశకం నుండి మన వృద్ధి రేటు చాలా ఆశాజనకంగా ఉంది. తాజా ఆర్థిక సర్వే (2015) ప్రకారం, 9,10,11వ పంచవర్ష ప్రణాళికల కాలంలో మన స్థూల జాతీయ ఆదాయం 7.8శాతం మరియు 7.6శాతం, 5.6శాతంగా పెరిగింది. మన గత చరిత్రతో పోల్చినా, లేక అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చినా ఈ వృద్ధిరేట్లు ప్రశంసనీయము. మొత్తం మీద మనకు ఎంతో చెడ్డ పేరు తెచ్చిన "హిందూ వృద్ధిరేటు" విధానాన్ని మనం పక్కన పెట్టగలిగాము. అయితే సమతూకంలోని పేదలూ, అణగారిన వర్గాల వారిపై ఈ వృద్ధిరేటు ఏమి ప్రభావాన్ని చూపిందని ఆర్థిక నిపుణులు విస్తుపోయారు. వారి ఆలోచనల ఫలితంగా, సమ్మిళిత వృద్ధి అనే భావము వాడుకలోకి వచ్చింది. ఆర్థిక వృద్ధిని చూసే కోణం పూర్తిగా మారిపోయింది. ఇటీవలే రద్దు అయిన కేంద్ర ప్రణాళిక సంఘం ఈ సమ్మిళిత వృద్ధి భావనను సమర్థిస్తూ, పేదరికపు రేటును తగ్గించడం, ఆరోగ్య సేవలను మరింత మెరుగ్గా అందించడం పిల్లలందరినీ బడికి పంపించడమూ, ఉన్నత విద్యను మరింత ఉన్నత ప్రమాణాలతో ఎక్కువ మందికి అందుబాటులోకి తేవడం వంటి లక్ష్యాల సాధనతో పాటు, మెరుగైన జీవన ప్రమాణాలకోసం వేతన ఉపాధికి మరిన్ని అవకాశాలు కల్పించడం, ప్రాథమిక అవసరాలైన నీరు, విద్యుత్తు, రోడ్లు, పారిశుధ్యము, మరియు నివాసాలను వీలైనంత ఎక్కువమందికి కల్పించడానికి వెసులుబాటు కల్పించేదే సమ్మిళిత ఆర్థిక వృద్ధిరేటు అని నిర్వచించింది. అయితే నిర్వచనం ఇంత పెద్దగా ఉంటే లక్ష్యసాధన మరింత క్లిష్టమవుతుంది. దానితో వివిధ రకాల వారు వివిధ రకాలుగా తమకు తోచిన నిర్వచనాలను ఇవ్వసాగారు.

అయితే ఇటీవలి కాలంలో అసలు సమ్మిళితమంటే ఏమిటి? సమ్మిళిత వృద్ధి అంటే ఏఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి మొదలైన అంశాలపై మరింత స్పష్టమైన నిర్వచనాలకు ప్రయత్నం జరిగింది. ఈ ప్రశ్నలకు నాకు తెలిసినంతలో సమగ్రమైన జవాబులివ్వడానికి ప్రయత్నిస్తాను.

**శ్రీపాద మోతీరాం,** ఆచార్యుడు, ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్, రీసర్చ్, ముంబాయి. e-mail : sripadaigidr.ac.in

## అసలు సమ్మిళితం అంటే ఏమిటి?

పైన చెప్పినట్లు ఈ సమ్మిళిత వృద్ధిని నిర్వచించడానికి అనేక మార్గాలున్నాయి. కొందరు నిపుణులు నిర్ణీతకాలంలో పేదరికం ఎంత వేగంగా తగ్గిందో అనే అంశాన్ని పరిగణించారు. ఎక్కువ వేగంగా తగ్గితే దాన్ని మరింత సమగ్ర సమ్మిళిత వృద్ధిగా పరిగణించారు. నిజానికి మనదేశంలో ఎప్పటి నుండో ఆర్థిక నిపుణులు ఈ పేదరిక నిర్మూలన గురించి వివిధ అభ్యాసాలు చేశారు. కనుక అసలు విధానాన్ని పరీక్షిస్తే మేలు. సంప్రదాయకంగా పేదరికాన్ని పేదరిక రేఖా కొలమానంతోనే చూస్తుండేవారు. అయితే, తరువాత జాతీయ ప్రతిచయన సంస్థ వారు పెరుగుతున్న వినియోగాన్ని బట్టి పేదరికాన్ని కొలవడం ప్రారంభించారు. వ్యక్తుల ఆదాయాలపై నిర్దిష్ట సమాచారం అందుబాటులో లేకపోవడంతో వ్యయాన్ని ప్రమాణంగా తీసుకోనారంభించారు. తలసరి పేదరికాన్ని లెక్కకట్టే విధానం బహుళ ప్రాచుర్యంపొందింది. ఉదాహరణకు 2004-05, 2009-10 సంవత్సరాలను పరిగణనలోకి తీసుకున్నట్లయితే ముఖ్యంగా వ్యక్తి కొలమాన అంచనాలను పరిగణనలోనికి తీసుకుని పేదరిక తగ్గుదలను అంచనా వేశారు. తరువాత 1993-94 నుండి 2004-05 సంవత్సరాల మధ్య పదకొండు సంవత్సరాల కాలాన్ని తీసుకుని, పేదరికపు రేటు సంవత్సరానికి 2.2 పాయింట్లు చొప్పున తగ్గిందని అంచనా వేశారు. అయితే నిజానికి 2004-05 నుండి 2009-10 సంవత్సరాల మధ్య కాలంలో పేదరికం మరింత వేగంగా అంటే 4.4 పాయింట్ల చొపున తగ్గినట్లు రికార్డు అయింది. ప్రతిచయన సంస్థ వారి తాజా (2011-12) నివేదిక ప్రకారం, గతానికి భిన్నంగా మరో రెండు సంవత్సరాలలోనే ప్రణాళికా సంఘం 2009-10లో మరో స్వల్పకాల సర్వే నిర్వహించి, ఈ నూతన గణాంకాల ఆధారంగా వృద్ధిరేటు గణనీయంగా పెరిగిందనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ విధానంలో అనుసరించాల్సిన పద్ధతి సులభంగా ఉన్నప్పటికీ అధికారిక పేదరిక రేఖా నిర్ణయంలో అనుసరించిన విధానాలు సరిగా లేకపోవడం ఒక లోపం. ముఖ్యంగా సమ్మిళిత వృద్ధిని గూర్చి మనం మాట్లాడుతున్నపుడు, ఈ లోపం మరిన్ని పరిమితులను ఎత్తిచూపుతున్నది. ఉదాహరణకు పైన చెప్పినట్లు పన్నెండవ పంచవర్ష ప్రణాళిక పత్రం ఇదే చెబుతున్నది. మరోవిధంగా, ఈ సమస్య సమ్మిళిత వృద్ధిని నిర్ణయించే అంశాలకే పేదరిక రేఖను నిర్ణయించడానికి కూడా వాడుతున్నది. జాతీయ ప్రతిచయన సంస్థ ఈ విధానాన్నే అనుసరిస్తున్నది. సగటు మానవుని ఆదాయం నిజంగా పెరిగిందా లేదా అనేదాన్ని అంచనా వేయడమే అసలు ఉద్దేశ్యము. అయితే, సగటు తలసరి వ్యయం, 2004-05 నుండి 2011-12 సంవత్సరాల మధ్యకాలంలో గ్రామీణ ప్రాంతాలలో 22శాతం, పట్టణ ప్రాంతాలలో 27శాతం పెరిగింది. ఇంతమేర వ్యయం చేయగలిగారు అంటే ఆ మేరకు ఆదాయం పెరిగినట్లేగా అని అంచనా! గ్రామీణ పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ పేదలు చేసిన వ్యయం తక్కువగా నమోదు అయిందని ఒక అంచనా! అంటే ధనికులు మధ్యతరగతి వారికన్నా, పేదల ఆదాయవృద్ధి మందగించిందని వారి ఉద్దేశ్యము. పేదరిక స్థాయిలో అట్టడుగున అంటే మొదటి పది స్థానాలలో ఉన్న వారి ఆదాయాలలోని వృద్ధి గ్రామీణ ప్రాంతాలలో 20.3శాతంగానూ, పట్టణ ప్రాంతాలలో 24.5శాతంగానూ ఉంటే, అత్యంత ధనికులు అంటే చివరి 90లలో ఉన్నవారి ఆదాయ పెరుగుదల అధికంగా 23.1శాతంగా గ్రామీణ ప్రాంతాలలోను 29.1శాతం పట్టణ ప్రాంతాలలోనూ నమోదు అయింది. అదేవిధంగా పేదలలో మరింత వెనుకబడిన షెడ్యూల్డ్ కులాలు, జాతులవారి ఆదాయాలు మరింతగా మందగించినట్లు అంచనా! అంటే మొత్తం మీద భారతీయ ఆర్థిక వృద్ధి అసమానంగా ఉన్నట్లు అంటే, సమ్మిళితంగా లేనట్లు రుజువు అవుతున్నది. అనేకమంది నిపుణులు (జయరాజ్ సుబ్రహ్మణీయన్) ఇదే అభిప్రాయాన్ని వెలువరించారు. సమ్మిళితాన్ని నిర్వచించేందుకు వివిధ రంగాలలో సాధించిన అభివృద్ధిని స్పష్టంగా గుర్తించడానికి ప్రయత్నించారు. లేదా అందుబాటులోనున్న పరిమిత వనరులను పేదరిక నిర్మూలనకు వివిధ వర్గాలకు ఏవిధంగా కేటాయించాలో నిర్వచించారు. ముందు వనరుల పంపిణీ, రెండవ దశలో ఆ కేటాయింపులు ఏ విధంగా పనిచేస్తాయో గమనించారు. ఎన్ఎస్ఎస్ఓ వారి అంచనాలను గమనించి, మన అభివృద్ధి సూచికలు పారెటో సూచికలకు అనుగుణంగా లేనట్లు నిర్ణయించారు. యథార్థంగా అత్యంత పేదలలో అభివృద్ధి రేటు గ్రామీణ ప్రాంతాలలో 1993-94 నుండి 2009-10 సంవత్సరాల మధ్య నిజంగా 1.43శాంగా మాత్రమే ఉన్నట్లుగానూ, అయితే కనీసం ఇది 2.88 శాతంగా ఉండాల్సిందని గుర్తించారు. అన్నీ సామాజిక ఆర్థిక రంగాలలోనూ ఈ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు.

వేరొక అధ్యయనంలో (సూర్య నారాయణ దాస్) సమ్మిళితాన్ని మూడు రకాలుగా గుర్తించారు. అవి ఉపాధి, ఆదాయం, వినియోగం. దీనికి వారు మూడు మార్గాలను అనుసరించారు. సగటు ఆదాయం – సగటు వ్యయానికి మధ్యగా ఉండే సగటు వినియోగం గరిష్ఠ కనిష్ఠ వినియోగాల మధ్య వ్యత్యాసం, 60శాతం కన్నా తక్కువ వినియోగాన్ని చేసే జనాభా యొక్క వాటా. మొత్తం మీద ఎన్ఎస్ఎస్ఓ వారి వినియోగ గణాంకాలు, సమాజంలోని అట్టడుగు వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, జాతుల వారి వినియోగాన్ని లెక్కలోకి తీసుకుని, పైన సూచించిన కాలంలో అంటే 1993-94 నుండి 2011-12 సంవత్సరాల మధ్య కాలంలో మన అభివృద్ధి రేటు సమ్మిళితం కాదని నిర్ధారించారు.

*తరువాయి 17వ పేజీలో...*

# సమ్మిళిత వృద్ధిలో చిన్న - మధ్యతరహా పరిశ్రమల పాత్ర

**తయారీ రంగంలో గత రెండుదశాబ్దాల పరిస్థితిని సమీక్షిస్తే, విధానపరంగా దీనిమీద శ్రద్ధ పెట్టిందనడానికి, "జాతీయ తయారీ సామర్థ్య కార్యక్రమం", "జాతీయ తయారీ విధానాలే" నిదర్శనం. అయితే ప్రపంచ తయారీ రంగానికి కేంద్రబిందువుగా భారత్‌ను చేయాలంటూ ఆ దిశగా నిర్దేశించుకున్న స్పష్టమైన లక్ష్యాలు మాత్రం చెప్పుకోదగిన తాజా పరిణామాలు.**

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సమ్మిళితానికి ఎప్పుడూ సిద్ధమే! 'వృద్ధి' కి, 'పంపిణీ'కి పోటీ–అంటూ జరిగిన ప్రపంచ చర్చల్లో ఉపలబ్ధిగా అదనంగా పుట్టుకొచ్చిన ఆలోచన–'సమ్మిళిత వృద్ధి'. వృద్ధిని, పంపిణీని విడివిడిగా చూడడంకంటే ఈ రెండింటి దృక్పథాలను ఒకే కోణంలో చూడాల్సిన అవసరముందని 20వ శతాబ్దం చివరలో, 21వ శతాబ్ద ఆరంభంలో అందరూ ఒకే అభిప్రాయానికి వచ్చారు. ఇక అప్పటినుంచి ఈ 'సమ్మిళిత వృద్ధి' చర్చ మొదలయింది. ఒక వంక ప్రపంచవ్యాప్తంగా వాదోపవాదాలు ఇలా జరుగుతుంటే వివిధ దేశాల్లో ఆచరణ మాత్రం మరోలా కనిపించింది. ఏదేశానికా దేశంలో ఉన్న పరిస్థితులనుబట్టి సమ్మిళితవృద్ధి ఆలోచన, ఆచరణ, అవగాహన మారుతూ వచ్చాయి.

భారతదేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల పాత్రకు సంబంధించి ప్రత్యేక రాజకీయ, సామాజిక కోణాలున్నాయి. 'స్వాతంత్ర్య సమరం' ఆరంభమయిన నాటినుంచీ పాలనకు సంబంధించి స్వయం సమృద్ధి రాజకీయ విభాగాలుండాలనీ, స్థానిక వనరులు, వ్యాపార అవకాశాలు, మార్కెట్ల ఆధారంగా ఆర్థిక వికేంద్రీకరణ ఉండాలని భావించడం జరిగింది. మహలానోబిస్ అనే ఆర్థికవేత్త ప్రతిపాదించిన నమూనా ప్రకారం–చిన్న వ్యాపార సంస్థలే వృద్ధిని ముందుకునడిపే ఇంజన్లు కాగా, ఆర్థికవృద్ధికి ప్రధాన రంగాలకు ఇవి అనుబంధ పాత్ర మాత్రమే పోషిస్తాయి. అంటే దీనినిబట్టి తెలుస్తున్నదేమిటంటే– రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంనుంచే 'సమ్మిళిత వృద్ధి' ఆచరణలో ఉన్నా, ఆ పదం వాడుకలోకి వచ్చింది మాత్రం ఆ తరువాత కాలంలో మాత్రమే.

సమ్మిళితవృద్ధి స్థిరంగా కొనసాగడానికి సంబంధించికూడా చాలా సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. ఈ క్రమంలో సామాజిక, రాజకీయ విషయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అందరూ ఎక్కువగా మాట్లాడే కారణం, ఆమోదించదగిన కారణం– 'స్థిరవృద్ధి'. భారతదేశ అభివృద్ధి, అనుభవాల చర్చల్లో ఇదికూడా ఒక భాగమయిపోయింది. గత కొన్ని దశాబ్దాలుగా రేట్లు పెరుగుతున్నా, భారత ఆర్థికవ్యవస్థలో వృద్ధి, విస్తరణలు కూడా

**డాక్టర్ పి.ఎం. మాథ్యూ,** డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ & డెవలప్‌మెంట్, కొచ్చిన్. e-mail : mathew.econ@gmail.com

చెప్పుకోదగినట్లుగానే ఉంటున్నాయి.'వృద్ధి' అనేది ఆర్థిక నిపుణుల చర్చనీయాంశ మయినా, వృద్ధిఫలాలు అత్యధిక సంఖ్యాకులకు అందడంమీదనే విధానపరమైన నిర్ణయాల విజయం ఆధారపడి ఉంది. ఈ క్రమంలోనే ఎగుడుదిగుడులను తట్టుకునే ఒక సామాజిక వ్యవస్థ అవసరమవుతుంది. దానికి చిన్న మధ్యతరహా ఉపాధి సంస్థలు పనికివస్తాయని భావించడం జరిగింది. అయితే ఈ ఏర్పాటు దానంతట అదే జరుగుతుందనుకుంటే ఇటీవలకాలంలో పరిస్థితి దారుణంగా మారింది. ఆర్థికవ్యవస్థ తీవ్ర కుదుపులకు లోనయినప్పుడు కొన్ని రంగాలు ముందంజలో ఉంటాయి. కొన్ని వెనకబడిపోతుంటాయి. అలా వెనుకబడిన వాటిని తిరిగి ప్రధాన స్రవంతి లోకి ఎలా తీసుకురావాలనే ఒకేఒక పెద్ద సవాలు.

**సమ్మిళితం : పలు వ్యూహాలు**

సమ్మిళితం లేదా అన్నింటినీ కలుపుకుని పోవడం అనే క్రమంలో వ్యూహం చాలా ముఖ్యం. ఇప్పటి వరకు మూడు దఫాల వ్యూహాలను చూసాం. మొదటిది–సంప్రదాయపరమైన 'రక్షణ'. రెండవది–హక్కులపరమైనది. మూడవది, తాజాగా చేపట్టిన–'సామర్థ్యం ఆధారంగా చేసింది. దీనిప్రకారం సామర్థ్యం పెంపుకు తగిన అవకాశాలిస్తే చిన్న సంస్థలు కూడా ప్రధాన స్రవంతికి వస్తాయి.

కేంద్రప్రభుత్వం ఇటీవల తీసుకుంటున్న చర్యలు దీనిని సూచనప్రాయంగా తెలియ చేస్తున్నాయి. ఒకవైపు జాతీయ స్థాయిలో విధానపరమైన లక్ష్యాలవైపు కృషి జరుగుతుండగా, మరోవైపు నైపుణ్యాల అభివృద్ధి, కొత్త సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహం వంటివాటిపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ పోతే సామాజికంగా, ఉత్పాదక వరంగా సత్ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం ఈ దిశగా అనేక చర్యలను తీసుకుంటున్నది.

**కొత్తవిధానాల విశిష్టత**

కేంద్రప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌ద్వారాకానీ, ఆర్థికసర్వేద్వారాగానీ అందుతున్న సూచనలనుబట్టి కొన్ని ముఖ్యమైన చర్యలను నిశితంగా పరిశీలించాల్సిన అవసరముందని పిస్తున్నది. ప్రపంచమంతటా నేడు అనుసరిస్తున్న వైఖరి–కొత్త సంస్థలను (స్టార్టప్స్)ను ప్రోత్సహించడం. భారతదేశంలో కూడా మన జనాభాద్వారా మనకు లభించిన సానుకూలతలను బట్టి చూసినా, యువతను మంచి వేతనజీవులుగా తీర్చిదిద్దడంకంటే – వారిలో ఉప్పొంగే నైపుణ్యాలకు తగిన ప్రోత్సాహం అందించ దానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. బడ్జెట్, ఆర్థిక సర్వేలుకూడా ఈ దిశగా ఇప్పటికే అడుగు ముందుకు వేసాయి.

తయారీ రంగంలో గత రెండుదశాబ్దాల పరిస్థితిని సమీక్షిస్తే, విధానపరంగా దీనిమీద శ్రద్ధ పెట్టిందనడానికి, "జాతీయ తయారీ సామర్థ్య కార్యక్రమం", "జాతీయ తయారీ విధానాలే" నిదర్శనం. అయితే ప్రపంచ తయారీ రంగానికి కేంద్రబిందువుగా భారత్‌ను చేయాలంటూ ఆ దిశగా నిర్దేశించుకున్న స్పష్టమైన లక్ష్యాలు మాత్రం చెప్పుకోదగిన తాజా పరిణామాలు.

ఇక తయారీ రంగంలో భారత నూతన విధానాలు ఊపందుకున్నది మాత్రం రక్షణ పరికరాల ఉత్పత్తికి సంబంధించి మే, 2014లో ప్రభుత్వం ప్రకటించిన కొత్త విధానపరమైన నిర్ణయాలు. ఆ వెనువెంటనే ప్రధాని ఆగస్టు 15, 2014న ప్రకటించిన స్థానిక తయారీ రంగానికి సంబంధించిన కొత్త విధానంఈ కోవలోనిదే. భారత్‌కు స్వతంత్రం వచ్చిన తరువాత చిన్న సంస్థలను ప్రోత్సహిం చడానికి తీసుకున్న తొలిచర్యగా దీనిని చెప్పవచ్చు.

**నైపుణ్యాల అభివృద్ధి**

సాంకేతిక, వృత్తివిద్యలో మనం చాలా విజయాలు సాధించినా నైపుణ్యాల కొరత మన ఆర్థిక వ్యవస్థలో ఓ అఘాతంలా కనిపిస్తున్నది. ఈసమస్యను సక్రమంగా, సమగ్రంగా అర్థంచేసుకునే ప్రయత్నం జరగలేదు. ఇప్పటివరకు వృత్తివిద్యకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చడం, సమయానుకూలంగా వాటిని ఆధునీకరించడం మీదనే దృష్టి పెట్టాం.

కేంద్రబడ్జెట్, 2014 దీనితో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. అదే నైపుణ్యాల అభివృద్ధి. తద్వారా నైపుణ్య భారత్ అంటే నైపుణ్యాలను అభివృద్ధిపరచడంతో పాటూ వాటిని ఆచరణబాట పట్టించడం. ఇది అనుకున్నది అనుకున్నట్టు జరిగితే, దేశంలో కొత్త సంస్థలు, కొత్త వ్యాపారాలు, కొత్త తయారీ అన్నీ ఊపందుకుంటాయి.

ఈ దిశగా ముందుకు వెళ్ళడానికి ఇటీవలికాలంలో మూడు కేంద్రాలను గుర్తించారు. అవి 1. రక్షణ ఉత్పత్తులు 2. ఎలక్ట్రానిక్స్ 3. జౌళి.

**వెనుకబడినవర్గాలకూ అవకాశం**

మనదేశంలో చిన్న సంస్థలను పరిధిలో వాటి ఏర్పాటులోగానీ, నియామకాల్లోగానీ పలు సంస్కృతులవారిని, పలుభాషలవారిని పలుకులాల నిప్పత్తులను ఇముడ్చడం, సమన్వయ పరచడం, ఒక పెద్ద సవాలేగాక, ఒక మంచి అవకాశంకూడా! విభిన్న నేపథ్యాలున్న వర్గాలవారు ముఖ్యంగా సామాజికంగా వెనకబడినవర్గాలవారు క్రమేణా విద్యాపరంగా, ఆర్థికపరంగా, రాజకీయ పరంగా పుంజుకుంటున్న తరుణంలో చిన్న సంస్థలలో వారిని ఎక్కువగా ఇముడ్చుకునే అవకాశముంది. అయితే అంత వైవిధ్యాన్ని నిర్వహించగలిగే ఏర్పాటు, సామర్థ్యం వీటికి ఉందా? సామాజికంగా వెనకబడిన వర్గాల వారిని ముందుకు తీసుకు రావడానికి తగిన విధంగా ప్రభుత్వ విధానాలు ప్రకటిస్తున్న సమయంలో ఈసమస్యకు ముగింపు ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. ప్రధాన సామాజిక వర్గాలకంటే, సామాజికంగా

వెనకబడిన వర్గాలు ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తాయని ప్రపంచవ్యాప్తంగా రుజువవుతున్నది. భారత్‌లో వీరికి రాజ్యాంగపరంగా రక్షణ, అవకాశాలు అందుతున్న తరుణంలో ఆర్థికాభివృద్ధిలో వీరి ప్రభావం విశేషంగానే ఉంటుంది. అల్పసంఖ్యాకవర్గాలవారికి ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖ ఏర్పడిన తర్వాత వీటిని సమన్వయం చేసుకోవడంలో చాలా ప్రగతి కనిపించింది.

ఏ సమాజంలో అయినా ప్రధాన స్రవంతిలోని వర్గాలవారితో సమానంగా అవకాశాలు అందుకోవడం అల్పసంఖ్యాక వర్గాల వారికి అంత తేలికేమీ కాదు. అందుకే వారు ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో ఉండడానికి ఇష్టపడతారు. అదీగాక చాలా దేశాల్లో వీరికి ప్రభుత్వపరంగా సమన్వయపరుచుకునే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. అందువల్ల వీరు అటువంటి ఆర్థిక మండళ్ళ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండగలుగుతారు. ఉదాహరణకు - వియత్నాం, ఇండోనేషియాల్లో బాతిక్ కళ, చైనాలోని మైనారిటీవర్గమయిన యుగర్ చేపట్టిన వస్త్ర, హస్తకళలు, చైనాలోనే కజక్‌వర్గం నిర్వహించే నిర్దిష్టజాతుల ఆహార పదార్థాల తయారీవంటివి చెప్పుకోవచ్చు. అలాగే భారత్‌లో కూడా మొరాదాబాద్‌లో కంచుపాత్రల తయారీ, మీర్జాపూర్‌లో లేసుల అల్లికలు, చెన్నపట్నంలో కొయ్యబొమ్మల తయారీ, కర్నాటక ఉడిపి హొటళ్ళుకూడా ఈ కోవలోనివే.

అల్ప సంఖ్యాక వర్గాలు నిర్వహించే సంప్రదాయ కళలు, ప్రాచీనకళలవంటి వాటిల్లో నైపుణ్యాల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్, 2014లో కార్యక్రమాలు ప్రకటించడం జరిగింది. బహుళ సంస్కృతుల సమ్మేళనం దృష్ట్యా కానీ, ఆర్థికరంగంలో వీరు పోషిస్తున్న పాత్రపరంగా కానీ ఇంత విశిష్టత ఉన్నా, విధానపరమైన నిర్ణయాల్లో వీరి కార్యకలాపాలను సమన్వయ పరిచే పని ఇంతకుమునుపు ఎప్పుడూ జరగలేదు.

**ప్రాధాన్యతా రంగాలు**

ఎన్ని మార్పులుచేసినా, ఇంకా కొన్ని ప్రాధాన్యతారంగాలు మిగిలే ఉన్నాయి. వాటిమీద ప్రత్యేక దృష్టి పెట్టవలసిన అవసరముంది. అవి 1. అభివృద్ధిలో 'ప్రతిభ' వినియోగం 2. ఔత్సాహిక వ్యాపారాభిలాషను కీలక వనరుగా గుర్తించడం 3. సామర్థ్యాలను పెద్దఎత్తున సమన్వయ పరచడం 4. సామాజిక సంస్థల ప్రోత్సాహం

**1.అభివృద్ధిలో 'ప్రతిభ' వినియోగం**

అభివృద్ధిచెందిన ఆర్థిక వ్యవస్థల్లో (దేశాల్లో) విజయానికి కొత్తదారులు పడ్డాయి, కొత్త నిబంధనలు వచ్చాయి. గత రెండు మూడు దశాబ్దాల్లో 'ప్రతిభ' ఆధారిత ఆర్థిక వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా పెనుమార్పులు తీసుకువచ్చింది. పాత ఆర్థికవ్యవస్థకు కొత్త వ్యవస్థకు మధ్య స్పష్టంగా గీత గీసింది. లోగడ వ్యవసాయాధారంనుంచి పారిశ్రామిక రంగానికి మళ్ళినట్లుగానే, ఈ దేశాలు పారిశ్రామికాధారం నుంచి సిలికాన్, కంప్యూటర్లు, నెట్‌వర్క్‌లు అనే కొత్త ఆర్థిక వ్యవస్థవైపు ప్రస్థానం సాగిస్తున్నాయి. వీటిని నిన్న ఊహించలేదు. రేపటితర్వాత ఎలా ఉంటుందో కూడా తెలియదు. పాత ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా కొత్త వ్యవస్థలో కనబడుతున్న విశిష్టతలు-ప్రతిభ, డిజిటైజేషన్, వాస్తవికత, అణుసంబంధమైన సమన్వయం లేదా అంతర్జాల వనితీరు, మధ్యంతర వ్యవస్థలేకపోవడం, కేంద్రీకృతమయిన విధానాలు, నూతన ఆలోచనలు, వినియోగదారుడే వ్యాపారిగా మారే అవకాశం, ప్రపంచీకరణ, ఒకదానికి మరొకటి సరిపడకపోవడం, స్వయం ఉపాధికి ఊతం. చిన్న సంస్థల అభివృద్ధి విధానానికి సంబంధించి భారత్‌కు చాలా సుదీర్ఘ చరిత్ర ఉన్నా, ప్రతిభను సృష్టించడం, దాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్ళడంలో ప్రపంచ ప్రమాణాలకు ఇంకా చాలా దూరంలోనే ఉండిపోతున్నాం. సరళీకరణ విధానాల ద్వారా అన్ని రంగాలకు సమాన న్యాయం జరుగుతుందని ఆశించినా, ఈ రంగంలో ఆ మేరకు ఫలితాలు కనబడలేదు. విధాన నిర్ణయాలు తీసుకునే టప్పుడు మాత్రం ఈ రంగం నిలదొక్కు కోవడానికి నూతన ఆవిష్కరణలే బలమైన కారణం అని వాదించినా, ఆచరణలో మాత్రం దీనికి ఒరగబెట్టిందేమీ లేదు.

'ప్రతిభ' ఆధారిత ఆర్థికవ్యవస్థలో చిన్న సంస్థలు వాటంతటఅవిగా నిలదొక్కు కోలేవు. మిగిలిన వాటి ప్రయోజనాలతో అనుసంధానం కూడా ముఖ్యం. మన దేశానికి సంబంధించి నంత వరకు 'ప్రతిభ' ఆధారిత వ్యవస్థలను మరింత మెరుగు పరచాల్సిన అవసరముంది. ముందునుంచి అనుసరిస్తున్న ఇటువంటి వైఖరులకు 'భారత్‌లో తయారీ' వ్యూహం పూర్తిగా భిన్నం. అయినా ఈ రంగానికి సంబంధించి దీని ప్రభావాన్ని ఇంకా చర్చించాల్సిన అవసరముంది.

**2. కొత్త వ్యాపారోత్సాహమే కీలక వనరు**

మనదేశంలో మొదటినుండి వ్యాపారాలు ప్రారంభమవుతూ వచ్చింది సంప్రదాయబద్ధంగా కొన్ని కులాలద్వారానే, కొన్ని వర్గాలద్వారానే అనే అభిప్రాయం ఉంది. 1970 దశకం ఆరంభంలో ఈ ఆలోచనలు విప్లవాత్మకంగా కొత్తదారులు పట్టాయి. అప్పుడు ప్రవేశపెట్టిన ఔత్సాహిక పరిశ్రమల అభివృద్ధి విధానాలే దీనికి ప్రధాన కారణం. అయితే దీని ప్రభావాన్ని ఇంకా కచ్చితంగా అంచనా వేయడం జరగలేదు. ఔత్సాహిక సంస్థల అభివృద్ధికి రెండు అంశాలు కీలకం - చేపట్టదలచిన వ్యాపార నమూనా, దాని ఆచరణ. అయితే ఈ రెండింటిలోనూ వేటి సమస్యలు వాటివే అన్నట్లుగా సర్వేలు తేల్చాయి. యువత ఎక్కువగాఉన్న మనలాంటి దేశాల్లో ఔత్సాహిక సంస్థల అభివృద్ధిపట్ల అవగాహన, కచ్చితమైన అంచనాలు, ప్రణాళిక

అనేవి రూపొందించడం అవసరం. ఈ నేపథ్యంలోనే వనరులపట్ల మనకు అవగాహనలు, అంచనాలు అవసర మవుతాయి. కొత్త వ్యాపారాలు, పరిశ్రమల ఆలోచనే కీలక వనరు. దీనిని పరిరక్షించు కోవాలి, పోషించాలి. ప్రోత్సహించాలి. ఈ దృక్పథంతోనే ఇప్పటి వరకు అనుసరించిన విధానాలను, వ్యూహాలను సమీక్షించుకోవాలి.

**3. సమగ్రంగా 'సామర్థ్య'నిర్వహణ**

సామర్థ్యం అంటే పని సామర్థ్యం. దీనిని మెరుగుపరచాలి. ఉద్యోగాల, ఉద్యోగుల ప్రస్తుత స్థితిగతులే ఎటువంటి సామర్థ్యాలను, ఎలా సృష్టించాలో, ఎలా మెరుగుపరచాలో నిర్ణయిస్తాయి. ఎలా సృష్టించాలన్నదాంట్లో దృక్పథాలు వేరుగా ఉండవచ్చు.

ప్రస్తుతం మార్కెట్‌లో ఈ స్థితిగతుల సమన్వయం సక్రమంగా లేదు.దీనికి యువత నైపుణ్యాలను భారీ ఎత్తున యుద్ధప్రాతిపదికన పెంచాల్సిన అవసరముందన్న ఆలోచన మొదలయింది. గత సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధానమంత్రి చెప్పిందికూడా ఇదే. "నైపుణ్య భారత్" పేరుతో ఈ మేరకు ఆయన ఒక ప్రకటనకూడా చేశారు. ఈవిషయంలో మన దేశ విధానాన్ని ఇది సూచిస్తున్నది. ఇంకా దీని విధివిధానాలు రూపొందలేదు. వచ్చే కొన్ని దశాబ్దాలలో పెరగబోతున్న ఉద్యోగాలను దృష్టిలో పెట్టుకుని వారిలో నైపుణ్యం అభివృద్ధి చేయాలన్న ప్రధాన లక్ష్యంతో నవంబర్, 2014లో దీనికి ప్రత్యేకించి ఒక మంత్రిత్వ శాఖనుకూడా ఏర్పాటు చేశారు.

'ప్రతిభ' ఆధారిత ఆర్థికవ్యవస్థలోకి మనదేశం మారుతున్నప్పుడు, దానికి తగ్గట్టుగా మన ప్రజల్లో కూడా ముఖ్యంగా యువతలో ఆమేరకు ప్రజ్ఞాపాటవాలు, దిశానిర్దేశం జరగాలి. అదికూడా ప్రామాణికంగా, ఇది జరగాలంటే మనదేశంలోని ఉద్యోగుల, ఉద్యోగాల (లేబర్ మార్కెట్) స్వరూప స్వభావాలను నిర్దేశించగల ఒక జాతీయ విధానం ఉండాలి.

నైపుణ్యాల అభివృద్ధి అనేదానిని విడిగా మనం చూడకూడదు. మంచి ఉద్యోగాలు సంపాదించడానికి, మంచి వ్యాపారాలు ప్రారంభించడానికి అది మౌలిక అవసరమేతప్ప అదే సర్వస్వం కాదు. మార్కెట్‌లో డిమాండ్‌నుబట్టి నైపుణ్యాల అభివృద్ధి అనేది ఉపాధివ్యూహాల్లో , ఆర్థికవృద్ధి వ్యూహాల్లో ఒక భాగంగా ఉండాలి. ఆదాయ వనరుల అవకాశాలను పెంచాల్సిన అవపరం ప్రాతిపదికగా ఇది ఉండాలి. అంటే వేతన ఉపాధి, స్వయం ఉపాధి, ఉద్యోగాలకోసం విదేశాలకుపంపడంవంటి వాటిలో ఇది ఉండాలి. వేతన ఉపాధి బతుకుతెరువుకు పనికొస్తుంది. స్వయం ఉపాధి బతుకు దెరువుతోపాటూ ఆదాయాన్ని పెంచడానికి, ఉద్యోగావకాశాలను పెంచడానికి పని కొస్తుంది. ఉద్యోగాలకోసం విదేశాలకు పంపడంద్వారా విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరుగుతాయి. ఈ మూడింటినీ శాస్త్రీయ పద్ధతిలో ఒక జాతీయ విధానం సమన్వయ పరచగలగాలి. ఈ మూడు విభిన్న అంశాలు ఒకదానికొకటి అనుసంధానమయి ఉన్నట్లు కనిపిస్తున్నా, వేర్వేరు మంత్రిత్వ శాఖల పరిధిలో ఉన్నాయి. వీటిని సమన్వయ పరచాలి.

2005-12 మధ్యఉన్న ఏడేళ్ళకాలంలో దేశంలో కేవలం 27లక్షల అదనపు ఉద్యోగాల కల్పన మాత్రమే జరిగింది. ఇది డిమాండ్‌కంటే చాలా తక్కువ. ఉద్యోగార్థుల్లో కనీసం కొంతమందినయినా కొత్త వ్యాపారాలు, పరిశ్రమల దిశగా ప్రోత్సహించి ఉండవచ్చు. ఈ లోటును గుర్తించి 2009లో జాతీయ నైపుణ్యాభివృద్ధి విధానాన్ని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఇప్పుడు దీనిని మరింత అభివృద్ధి చేసి జాతీయ నైపుణ్య, ఔత్సాహిక సంస్థల అభివృద్ధి విధానం, 2015గా ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్రభుత్వంతోపాటూ సంస్థల యజమానులు, ఉద్యోగులు, శ్రామికులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కుల సంఘాలు, ప్రైవేట్ శిక్షణా సంస్థలవంటి పలువురి సమిష్టి బాధ్యత. ప్రధానమంత్రి ఆశిస్తున్న 'నైపుణ్యభారత్' విధానాన్ని సమర్థంగా ముందుకు నడపడంలో ఒక నిర్దిష్ట పాత్ర ఉంది. ఈ పాత్రలను నిర్వచించడంలో, నిర్వహించడంలో ఒకరు చేసిన పనులే మరొకరు చేసేటట్లుగా కాక, పకడ్బందీ ఆచరణ, ప్రణాళికతో సాగాలి.

**4. సామాజిక వాణిజ్య సంస్థలు**

బాధ్యతాయుతమైన వ్యాపారంలో ఈ రోజున ఎక్కువగా వినవస్తున్న పదాలు రెండు 1. పెట్టుబడులను ప్రభావితం చేయడం 2. సామాజిక వాణిజ్య సంస్థలు. అయితే మనదేశంలో ఇంకా ఇవి ఊపందుకోలేదు. మనదేశం చాలా పెద్దదయినందువల్ల సామాజిక సమస్యలు కూడా తక్కువేంకాదు. అందుబాటులోఉన్న వనరులు, అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఈ సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ప్రతి సామాజిక సమస్యలోకూడా ఒక అవకాశం ఎదురు చూస్తూ ఉంటుంది. ఒక వ్యాపారాభివృద్ధిని స్థిరంగా కొనసాగించడానికి ఈ అవకాశమే కేంద్రబిందువు. ఒక కొత్త వ్యాపార ఆలోచన అనేది ప్రతిమనిషిలో అంతర్గతంగా ఉంటుంది. దానిని ప్రోత్సహించడం అవసరం. సామాజిక సమస్యల విషయంలో అంతర్గతంగా ఉన్న అవకాశాలను గుర్తించి, అర్థవంతమైన పరిష్కారం దిశగా వాటిని క్రమబద్ధీకరించాలి. సామాజిక వాణిజ్య సంస్థల ఆలోచనలకు ఇదే నేపథ్యం.

బహిరంగ మార్కెట్‌లోని ఇతర వ్యాపారాలలాంటిదే ఇదికూడా. అయితే దాని నిర్వహణగానీ, మిగులు నిధుల మళ్ళింపుగానీ సామాజిక, పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. ఇవి ఆదాయాన్ని పొందే వ్యాపారాలే కానీ ఒక చిన్న తేడా వీటిని భిన్నంగా ఉంచుతుంది. దీనిని లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థనడిపినా, లాభాపేక్షకల ఒక

కంపెనీ నడిపినా సామాజిక వాణిజ్య సంస్థకు రెండు లక్ష్యాలుంటాయి. ఒకటి-సామాజిక, సాంస్కృతిక, సామూహిక, ఆర్థిక, పర్యావరణ ఫలితాలు రాబట్టడం. రెండవది-ఆదాయం రాబట్టడం. మిగిలిన వ్యాపార సంస్థల్లాగానే పైకి కనిపించినా సామాజిక ప్రయోజనం కేంద్రబిందువుగా. డబ్బుసంపాదన సహాయక పాత్రగా ఉంటుంది.

సామాజిక, ఆర్థిక, పర్యావరణ బాధ్యతల దృష్ట్యా కొత్త పరిష్కారాలను అన్వేషించే క్రమంలోనూ అలాగే ప్రభుత్వ, ప్రైవేటురంగాలు విస్మరించిన అవసరాలను తీర్చేక్రమంలోనూ 'సామాజిక ఆర్థిక వ్యవస్థ' రూపుదిద్దుకుంటుంది. పటిష్టమైన, స్థిరమైన, అందర్నీ కలుపుకుని పోయే సమాజాన్ని సృష్టించడంలో ఈ వ్యవస్థ విశిష్ట పాత్ర పోషిస్తుంది. విజయవంతంగా నడిచే సామాజిక వాణిజ్య సంస్థలో ప్రభుత్వ విధానపరమైన లక్ష్యాలను నెరవేర్చడంలో వాటి బాధ్యత అవి నెరవేరుస్తాయి. వాటిలో ప్రధానమైనవి...

- ఉత్పాదకతను, సామర్థ్యాన్ని పెంచడం
- సామాజిక వర్గాలనన్నింటినీ కలిపి సృష్టించే సంపదలో దాని వంతు బాధ్యతలు నిర్వర్తించడం
- వ్యక్తులు, వర్గాలు తమ స్థానిక సంబంధాలను కొనసాగించడం
- ప్రజలకు సేవలను అందించడంలో వినూత్న మార్గాలను ప్రతిపాదించడం
- అందరినీ కలుపుకొనిపోయే సమాజాన్ని అభివృద్ధి పరచడం, పౌరులు చురుగ్గా పాల్గొనేటట్లు చేయడం.

మనదేశ విస్తృతి దృష్ట్యా మనం ఇటువంటి నమూనాలు చాలా రూపొందించు కున్నాం. ఇవి ప్రభుత్వరంగంలోవి, ప్రైవేటురంగంలోవి కూడా ఉన్నాయి. కానీ దురదృష్టవశాత్తూ ఈ అంశంలో ఇప్పటికీ మనం ఒక జాతీయ విధానాన్ని రూపొందించు కోలేకపోయాం.

గత రెండు దశాబ్దాలుగా భారత్‌లో స్థూల దేశీయోత్పత్తి( జిడిపి) గణనీయంగా ఉన్నా, 120కోట్ల జనాభాలో మూడోవంతు మంది ఇంకా దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. ఐదేళ్ళలోపు పిల్లల్లో 40శాతం వరకు పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. 62శాతం మంది ప్రజలు ఇప్పటికీ కాలకృత్యాలకోసం బహిర్భూమికి వెళ్ళక తప్పడంలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవేదన వ్యక్తంచేస్తున్నది. సామాజిక లక్ష్యాలతో పెట్టే పెట్టుబడులకు ఈ సమస్యలన్నీ పెను సవాలుగానే ఉంటున్నాయి. వీటన్నింటికంటే ప్రధానమైనది-'సామాజిక వాణిజ్య సంస్థ' అంటే ఏమిటో నిర్వచించ గలగడం. అది జరిగితే విధాన నిర్ణయాలు రూపుదిద్దు కుంటాయి. అప్పుడు ఆలోచనలు ఆచరణ బాటపడతాయి. అప్పుడు కొత్త సంస్థలకు పెట్టుబడులు, రుణాలు, గ్రాంట్లు అందుతాయి. పన్నుమినహాయింపులు, భూమి, విద్యుచ్ఛక్తి, నీరు వంటి వనరులపై రాయితీలు తదితర ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి. ప్రస్తుతం కొత్తగా ప్రారంభమవుతున్న సామాజిక వాణిజ్య సంస్థలకు విదేశీ పెట్టుబడిదారులు నిధులు సమకూరుస్తున్నారు. మనదేశంలో ముఖ్యంగా ప్రభుత్వం వద్ద, కార్పొరేట్లవద్ద తగినన్ని పెట్టుబడులు కూడా ఉన్నాయి.

**ముగింపు**

'సమ్మిళితం' లేదా 'అందరినీ కలుపుకుని పోవడం' అనే రాజకీయ నినాదాన్ని ఎటువంటి మచ్చులు-రచ్చులు లేని కార్యాచరణ ప్రణాళికగా మార్చడమే ఇప్పుడు మన విధాన నిర్ణేతల ప్రధాన బాధ్యత. దీనిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. ■

*12వ పేజీ తరువాయి...*

## మన వృద్ధి రేటు సమ్మిళితమేనా? సిద్ధాంతపరమైన అంశాలు - రుజువులు

**ముగింపు :**

గత రెండు దశాబ్దాలలో మొత్తం జనాభాకు మాత్రమే కాదు వెనుకబడిన వర్గాలకు కూడా ఆదాయం సగటున పెరిగింది. అధికారిక లెక్కింపులలో పేదరిక రేఖా స్థాయి కూడా తగ్గింది. అయితే సమ్మిళిత అభివృద్ధి అంటే ఇంకా ఎంతో సాధించవలసి ఉన్నది. అత్యంత విస్తారంగా చేసిన భారతీయ సమ్మిళితం వృద్ధి నిర్వచనం మనలను నిరుత్సాహపరిచింది. కారణాలను ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. భారతీయ వ్యవసాయం కునారిల్లుతున్నది. అనేకమంది నిపుణుల అభిప్రాయం ప్రకారమైతే నేడు మన వ్యవసాయ రంగం అత్యంత ఆందోళనకర స్థితిలో ఉన్నది. పట్టణ ప్రాంతాలలో కూడా ఉపాధి అవకాశాలు తగినంతగా సృష్టింపబడటంలేదు. మొత్తం మీద గ్రామీణ నిర్మాణ రంగమే అధిక శాతం ఉపాధి కల్పిస్తున్నట్లు అనేకమంది అంచనాలు తెలియచేస్తున్నాయి. సాధారణ స్థితిలో ఈ ఉపాధి అవకాశాలు కనీస స్థాయిలో కూడా గిట్టుబాటు కానివి మాత్రమేకాదు. మార్కెట్ నైపుణ్యాలను కూడా పెద్దగా ఇవ్వలేవు. తయారీ రంగం పనితనం నిరుత్సాహకరంగా ఉన్నది. తయారీ రంగంలో, ముఖ్యంగా అధిక శ్రమశక్తి అవసరమైన చోట్ల మరింతగా సమ్మిళిత వృద్ధికి దోహద పడి ఉండాల్సింది. ప్రస్తుతావసరమేమంటే, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వంటి సంక్షేమ పథకాలను మరిన్ని అమలు చేసి పట్టణ పేదలకు మరింత జీవన భద్రత కల్పించాలి. అంతేకాక ఉపాధి అవకాశాలు వారినే వెతుకుకుంటూ వచ్చే విధంగా వారికి వృతింత నైపుణ్యాలను కల్పించాలి. అలా కాక, ఏదో అభివృద్ధి వస్తే, అన్ని రంగాలూ సమానంగా బాగుపడతాయని ఊహిస్తే అది పగటి కలే కాగలదు. ■

# సమ్మిళిత వృద్ధి మరియు సామాజిక మార్పు

**భారతదేశపు ఆర్థిక అభివృద్ధికి నిరుద్యోగం ఆటంకంగా నిలుస్తుంది. ప్రజలకు ఉద్యోగాలు సమకూర్చడం అనేది ఎంతో ముఖ్యమైన మార్పుగా చూడవచ్చు. మన ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) (2005) ద్వారా పథకాన్ని అమలుచేస్తుంది. ఇది ఖచ్చితమైన ఉపాధి చూపే పథకం. ప్రపంచ బ్యాంకు దీన్ని గొప్ప పథకంగా నిర్ధారించింది. అలాగే తరువాత తరాల వారికి కూడా ఇది చాలా ఉపయోగంగా ఉండగలదు.**

భారతదేశ స్థూలజాతీయోత్పత్తి (జిడిపి) 2014 –15 గణాంకాల ప్రకారం 7.3శాతం నుండి 7.5శాతానికి పెరగడం జరిగిందని పరిశీలకులు అంచనా. ఐఎన్‌పి అంచనాల ప్రకారం మన ఈ సంవత్సరపు వృద్ధి చైనా దేశపు ఆర్థిక వృద్ధికన్నా ఎక్కువగా ఉన్నది. ఈ సంవత్సరం మన ఆర్థికవృద్ధి అనేది మన దేశపు ఆర్థిక వ్యవస్థకు ఒక్క మంచుతునక లాంటిది.

సాధికారిత ప్రకారము భారతదేశపు పరిస్థితి చాలా భిన్నమైనది. 2015 సహస్రాభివృద్ధి లక్ష్యాల సూచనల ప్రకారం భారతదేశం కేవలం నాలుగు సూచనలకు మాత్రమే దగ్గరగా ఉన్నది. మిగతా సూచనల్ని కూడా (ఆఫ్ ట్రాక్) లేక మధ్యస్తపు (ఆన్ ట్రాక్)గా గమనించడము జరిగింది. మన ఆర్థిక వ్యవస్థకు మరియు సామాజిక పరిస్థితికి మధ్య ఎందుకింత వ్యత్యాసం? ఆర్థిక ఎదుగుదల అంటే సరళమైన మాటల్లో మన ఆర్థిక వ్యవస్థల్లా ఎప్పటికీ వచ్చే ఉత్పత్తి వలే ఈ ఎదుగుదల అన్ని విభాగాలకు సమానంగా ఉంటుందని చెప్పలేము.

అలాగే దీన్ని అన్ని విభాగాలకు సమానంగా పంచనూ లేము. ఇలా అన్ని విషయాలను విశ్లేషిస్తుంటే ఎదుగుదల మరియు విభజనకు మన దేశపు ఒక్క ఎత్తుగడను కనుకొన్నది. అలానే మన ఆర్థిక వ్యవస్థ యొక్క ఎత్తుగడలకు సరిగ్గా సరిపోయేది (12వ ఐదు సంవత్సరముల పథకము లక్షించింది. ఏమంటే సంఘటిత ఎదుగుదల అది కూడా ఎలా అంటే త్వరగా మరియు సమానంగా) ప్రపంచ బ్యాంకు సంఘటిత అనేదానిని ఎదుగుదల యొక్క పద్ధతి పరిమాణంగా సూచించింది. అంటే ఎదుగుదల యొక్క వేగం దానిపై ఆర్థిక పెంపు లాభాలుగా సూచించారు. బదుగు బలహీన వర్గాల ఎదుగుదల లక్ష్యంగా కొన్ని సూచనలు మరియు మెళుకువలతో వచ్చిన ఆదాయాన్ని పేదలకు అందేలా ఆలోచిస్తున్నారు. ఎలాగైతే సాహిత్యం, ప్రజావిధానం పేదరికం విడివిడిగా చెప్పబడ్డాయో ఎలా అయితే వాటి మధ్య తేడా ఏర్పడిందో అలాగే మన దేశంలోని ఈ పరిస్థితిని గూర్చి మాట్లాడేటపుడు అందులోకి ఒడిదుడుకులును అర్థం చేసుకుని, అన్ని విభాగాలకూ సమన్యాయం చేయటమే సంఘటితంలక్ష్యం.

ముందుగా చెప్పుకున్నట్లు సంఘటిత ఎదుగుదల దృష్టి వృద్ధిపైనే ఉంది.

---

**ఎస్.ఆర్.భానుమూర్తి,** ఆచార్యుడు, ఎన్.ఐ.పి.ఎఫ్.పి., న్యూఢిల్లీ. e-mail : nrbmurthy@gmail.com
**వర్షాశివరాం,** ఇంద్రప్రస్థ కాలేజ్ ఆఫ్ విమెన్, న్యూఢిల్లీ. e-mail : varsha.sivaram15@gmail.com

2008 ముందు వరకు కూడా మన దేశ ఆర్థిక ఎదుగుదల పేద, మధ్య తరగతి కుటుంబాలకు చేసింది ఏమీ లేదు అని చెప్పవచ్చు. అప్పటి వరకు వచ్చిన లాభాలు కేవలం కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం అవడంలో ఎన్నో రకాల ఇబ్బందులు చోటు చేసుకున్నాయి. ఈ విషయాలు క్రింది చెప్పబడ్డాయి. (గత మూడు సంవత్సరాల ఎదుగుదల) మరియు ముఖ్య ఎండిజి యొక్క ఫలితాలు రాష్ట్రాలు వారీగా చెప్పబడ్డాయి.

బీహార్ మధ్యప్రదేశ్, గుజరాత్, మేఘాలయాలలో ఎదుగుదల 8శాతంగా ఉండే గత మూడు సంవత్సరాలలో కర్ణాటక, రాజస్తాన్ పంజాబ్ మరియు ఉత్తరప్రదేశ్‌లో చాలా తక్కువగా మాత్రమే ఉంది. తరువాత ఎండిజి ప్రకారం చూస్తే బీహార్ జిఎస్‌డిపి ఎదుగుదల ఎక్కువగా ఉన్నా కూడా దగ్గరదగ్గరగా 10.3శాతం ఉన్నపుడు మొత్తం రాష్ట్రంలోని ప్రజలకు అది చేరడానికి కష్టంగా ఉన్నందున అందులో చాలా మంది ప్రజలు ఇంకా పేదలుగానే ఉన్నారు. ఇదేవిధమైన పరిస్థితి చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఓరిసా, రాజస్థాన్, మరియు ఉత్తరప్రదేశ్‌లది కూడా! ఇక్కడ కూడా 8 ఎండిజి సూచనలకు, 5 సూచనలు ఆఫ్ ట్రాక్‌లోనే ఉన్నాయి. అతి ఉత్తమంగా సాధికారిత సంపాదించిన రాష్ట్రంలో గోవా, కేరళ మరియు త్రిపుర, తమిళనాడు, మిజోరాం, మహారాష్ట్ర, మరియు హిమాచల్ ప్రదేశ్‌లో కంటే 8 ఎండిజికి 7 ఎండిజిలు చేరుకున్నాయి.

ఇవి ఏమి చేయాలి? దేశపు సమాజిక ఎదుగుదల పెంచాలి అంటే ఇప్పటి దాక ఏమి చేశారు? మన దేశ 12వ ప్రణాళిక పత్రాలలో ఎన్నో ఆలోచనలను సమకూర్చారు. అందులో మూడు మాత్రం తప్పని సరిగా పాటించడం జరిగాయి. అవి ఏవనగా సామాన్యుడికి ఉద్యోగము, ఆహార భద్రత మరియు సమ్మిళితవృద్ధి.

**సంచితవృద్ధి**

మన ఉద్దేశం ప్రకారం దేశాభివృద్ధికి సమ్మిళితం అనేది చాలా ముఖ్యమైన అంశం. ఆర్‌బిఐ యొక్క ఆర్థిక చేరిక ప్రకారం ఎప్పుడైతే నిరుపేదల నుండి సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక వేదిక అందుబాటులో ఉండగలుగుతుందో అపుడు సమాజానికి కొంత మేలు చేయగలము. ప్రధానమంత్రి జనధన యోజన వచ్చే ముందు వరకు కూడా కేవలం సగం మంది జనాభాకు మాత్రమే బ్యాంకుల్లో ఖాతాలు ఉండేవి. దీనిబట్టే తెలుస్తుంది. సగంకన్నా తక్కువ జనాభా కూడా మన దేశ అభివృద్ధిలో పాలుపంచుకోలేదని ఆ లెక్క ప్రకారం (పిఎంజెడివై) అనే ఒక గొప్ప పద్ధతిని అమలు చేసి మన ప్రభుత్వం కొన్ని కోట్ల మందిని (దగ్గర దగ్గర 16.7 కోట్ల మందిని) బ్యాంకింగ్ నెట్‌వర్క్ లోకి తీసుకు రాగలిగింది. అవి జూన్ ఆఖరికి 20 కోట్లకి చేరింది. ఈ పద్ధతి ఆర్థిక సమ్మిళితం ఎక్కువగా ఉపయోగపడకపోయిన ప్రజల్లో మిగులు డబ్బులు కూడబెట్టడం నేర్పిస్తుంది. దానితో పునఃపంపిణీ జరుగుతుంది.

**జెఎఎం ట్రినిటి**

బ్యాంకింగ్ నెట్‌వర్క్ మరియు బ్యాంకింగ్ ఖాతాలు పెరిగినా కూడా నిరుపేదలకు మరియు గ్రామాలకు ఈ సేవలు పూర్తిగా అందడం లేదు. ఈ లోటును పూరించడానికి గవర్నమెంట్ (సిఎఫ్ఐపి) అనే పద్ధతిని కనుక్కున్నది. ఏదైనా (పిఎంజెడివై)ని అనుసరిస్తుందో ఆర్థిక సర్వే 2014-15 ప్రకారం సిఎఫ్ఐపి ప్లాన్ ఏదీ ఆధార్ కార్డుతో లింకు అయి ఉందో అది మాత్రమే అన్ని ప్రభుత్వ పనులకు ఉపయోగించగలదు అని సూచించడంతో పునఃపంపిణీ విధానం అమలుకు వచ్చింది. ఇదే జెఎఎం ట్రినిటి! ఈ జెఎఎం ట్రినిడి ఆధారంగా ఎక్కడో అడుగున్నఉన్న ప్రజలను కూడా మన ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయవచ్చు. ఎప్పుడైతే పిఎంజెడివై ఆధార్‌తో లింక్ అయి ఉంటుందో అప్పుడు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఇన్సూరెన్స్‌లు,సబ్సిడీలు, అందించేటపుడు సమర్థవంతంగా ఎటువంటి తప్పులు జరగకుండా చేరాల్సిన వాళ్ళకే చేర్చగలుగుతారు.

**ఎంజిఎన్ఆర్ఇజిఎ**

తరువాత క్లిష్టమైన సమస్య సామాజపు ఎదుగుదలలో నిరుద్యోగం. ముందుగా అనుకున్నట్లుగా భారతదేశపు ఆర్థిక అభివృద్ధిలో నిరుద్యోగం అనేది ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. అందుకని ప్రజలకు ఉద్యోగాలు సమకూర్చడం అనేది ఎంతో ముఖ్యమైన మార్పుగా చూడవచ్చు. అందువల్ల మన ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) (2005) అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇది ఖచ్చితమైన ఉపాధి చూపే పథకం,. ప్రపంచ బ్యాంకు ఈ పథకాన్ని గొప్ప పథకంగా నిర్ధారించింది. అలాగే తరువాత తరాల వారికి కూడా ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది.

మిగతా అన్ని గ్రామీణ పథకాలతో పోల్చుకుంటే ఎంజిఎన్ఆర్ఇజిఎ అనేది అత్యంత ప్రధానమైనది. ఎందుకంటే సంఘటిత ఎదుగుదలకు ఇది ఎక్కువగా తోడ్పడుతుంది. మిగతా సామాజిక పథకాలలానే ఎంజిఎన్ఆర్ఇజిఎ కూడా ఐటిని వాడుతుంది. : ఎప్పుడైతే జీతాలు బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరుగుతుందో అప్పుడు గ్రామంలోని ప్రజలు కూడా బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. అత్యధికంగా 8.6 కోట్ల ఖాతాలు తెరవబడ్డాయి. దీనితో కొంత ప్రజలు పొదుపు నేర్చారు. అపుడు మిగులు ఏర్పడటం మొదలు అయింది.

ఈ ఎంజిఎన్ఆర్ఇజిఎలో ఉపాధి పొందిన వారిలో 81శాతం పూరి ఇళ్ళల్లో ఉండేవారు 61శాతం నిరక్షరాస్యులు. 72శాతం మందికి ఇంటికి కరెంటు కూడా లేనివారే.

ఎంజిఎన్ఆర్ఇజిఎతో మహిళలకు కూడా చాలా ఉపయోగం జరిగింది. ప్రస్తుతపు గణాంకాల ప్రకారం 53శాతం ఉద్యోగులు ఉపాధి అవకాశాలు గడిచిన 8 సంవత్సరాలలో ఆడవారికే కేటాయించ బడ్డాయి. దీనితో ఆడవారి ఆర్థిక మరియు సామాజిక పరిస్థితి చాలా వరకూ మెరుగుపడింది.

ఇటీవలే కార్యక్రమాలు అనగా ఆధార్‌తో లింకు వంటి మార్పులు బ్యాంకింగ్‌లోని ఎదుగుదలతో ఈ పథకాలను ముందుకు నడిపిస్తాయి. మరియు పేద ప్రజలయొక్క జీవన శైలిని కూడా మెరుగుపరుస్తాయి.

**ఆహార భద్రత**

ప్రపంచ ఆరోగ్యసంస్థ ఏమని నిర్ధారించింది అంటే ఎప్పుడైతే ఒక వ్యక్తి అన్ని సమయాల్లో సరిపడా, సాధ్యమైన, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటాడో అప్పుడే ఆ వ్యక్తి ఆరోగ్యవంతంగా ఉండగలడు! ఇది గమనిస్తే మనం చాలా నీచమైన పరిస్థితిలో ఉన్నాం. యునిసెఫ్ గణాంకాల ప్రకారం కొన్ని కోట్ల మంది పిల్లలు 5 సంవత్సరాలకన్నా తక్కువ వయస్సు వారు చనిపోతున్నారు. కేవలం సమతుల ఆహారం లేకనే. ముఖ్యంగా మనము ఎస్సీఎస్టీ, బిసి ఇంకా గ్రామీణ ప్రజలలో ఎక్కువ మంది సమతుల ఆహారం లేక మరణిస్తున్నారు. మన దేశంలో మధ్యప్రదేశ్ మరియు రాజాస్థాన్‌లలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. గ్లోబల్ ఇండెక్స్ రిపోర్టు 2014 ప్రకారం మొత్తం 76 దేశాలలో మన దేశం 55వ స్థానంలో ఉన్నాం.

ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం (ఎన్ఎఫ్ఎస్ఎ) అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. 2013లో రాయితీతో కూడిన ఆహారాన్ని 2/3 ప్రజలకు అందించాలనే మన ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే పిల్లలకు మధ్యాహ్న భోజన కార్యక్రమం మరియు సమతల ఆహార పథకం కూడా. ఈ పథకాలలో ఆహారంలోని పోషక విలువలు పెంచడం తల్లి మరియు శిశు సంక్షేమంలో భాగంగా తల్లి బిడ్డ ఇద్దరికి కూడా ప్రభుత్వం పోషక ఆహారం అందిస్తుంది. ఎన్నో అవాంతరాలు ఎదురైనా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా కొంత ఆలస్యంతోనైనా కూడా ఈ పథకాన్ని అమలు చేయగలిగింది. దీని జాప్యానికి కొంత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కారణమే.

**తీర్మానం**

ఎదుగుదలకు సామాజిక ఎదుగుదలకు మధ్య వ్యత్యాసాన్ని పూరించడానికి మన ప్రభుత్వం ఎంతగానో ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ ఎదుగుదల కొన్ని ప్రాంతాలకు కొన్ని వర్గాలకు మాత్రమే వర్తిస్తోంది. ఎప్పుడు అయితే ఎదుగుదలను ఐటితో మేళవించడం జరిగిందో అప్పుడు సామాజాన్ని చేరుకోవడం అనేది చాలా సులువుగా మారింది. ఇలాంటి ఒక పద్ధతితో కుల, మత, వర్గ విభేదాలను కొంత దూరం చేయొచ్చు. అపుడు సామాజిక ఎదుగుదల ఖచ్చింగా జరుగుతుంది. అన్నిటి కంటే ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క పాత్ర ఎక్కువ ఉంటుంది. ఈ ఖాళీ పూరించడంలో ఎప్పుడైతే రాష్ట్ర ప్రభుత్వం దగ్గర వనరులు పుష్కలంగా ఉంటాయో అపుడు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించే పథకాలను అమలు చేయగలుగుతుంది. 14వ ఫైనాన్స్ కమీషన్ ఏ పథకాలు ఐతే రాష్ట్రం భరించగలదో అలాంటి పథకాలను మాత్రమే ఆ రాష్ట్రానికి అమలు చేయాలి అని నిర్ణయించింది. ■

# యోజన

సెప్టెంబర్ 2015 సంచిక **"స్మార్ట్ సిటీస్ – మారుతున్న పట్టణ రూపురేఖలు"** అనే అంశంతో వెలువడుతుంది.

యోజన (తెలుగు) పత్రిక చందా వివరాలు, చిరునామా మార్పు, పత్రిక అందకపోవడం వంటి విషయాలపై ఫోన్ నెంబర్ 040–23310162 పై నేరుగా సంప్రదించవచ్చు. యోజన పత్రిక చందాకు సంబంధించిన వివరాల కోసం yojana_subscribe@yahoo.in కి మెయిల్ చేయగలరు.

*– సీనియర్ ఎడిటర్*



## యోజన పాఠకులకు స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

# సాధికారతకు డిజిటల్ సాంకేతికత దన్ను

దేశం ఎదుర్కొంటున్న కొన్ని సవాళ్లను అధిగమించే ప్రయత్నంలో భాగంగానే భారత ప్రభుత్వం డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజానీకం డిజిటల్ పరిజ్ఞానవంతులైతే అంతులేని అవకాశాలను అందిపుచ్చుకోవడంలో సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోగలరు. అంటే డిజిటల్ ఇండియా ఆవిష్కారం దిశగా మార్గసూచిని ఈ కార్యక్రమం రూపొందిస్తుంది.

**పరిచయం**


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015 జూలై 1న డిజిటల్ ఇండియా వీక్ (భారత అంకాత్మక వారోత్సవం)ను ప్రారంభించారు. డిజిటల్ సాంకేతికతలు లేదా డిజిటలైజేషన్ అన్నది అత్యాధునిక ఆవిష్కరణల తరంగం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టెలి కమ్యూనికేషన్లు, ఇంటర్నెట్, ఇతర సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాల సమ్మేళనంగా ఆవిర్భవించిన ఈ సరికొత్త సాంకేతికత ప్రజలను, సేవలను, ఉత్పత్తులను అనుసంధానిస్తుంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న సాంకేతిక విప్లవంలో ఇదొక భాగం. ఇందులో ఇప్పటికే ఇలాంటి ఐదు సాంకేతిక విప్లవాలుండగా, ఇప్పుడు ఆరోది నడుస్తోంది. అదే డిజిటలైజేషన్... ఇది వివిధ దేశాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రూపాంతరీ కరణలకు దారితీసే అవకాశాలు మెండు. అయితే, గడచిన 250 ఏళ్లలో నడిచిన ఐదు సాంకేతిక విప్లవాల్లో ఒక్కదానిలో కూడా భారత్ ఇప్పటికీ భాగస్వామి కాలేదు. అవన్నీ ఒక పాశ్చాత్య దేశంలో మొదలై ఇతర పశ్చిమదేశాలకు విస్తరించాయి. ఈ విప్లవాలతో అనేక పాశ్చాత్య దేశాలు లబ్ధి పొందాయి. కానీ, స్వాతంత్ర్యానంతరం ఆరు దశాబ్దాల తర్వాత కూడా పేదరికం విసురుతున్న సామాజిక-ఆర్థిక సవాళ్లు, పౌష్టికాహార లోపం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, అన్నిటినీ మించి ప్రస్తుతం పర్యావరణ పతనం వంటి మౌలిక సమస్యలతో భారత్ సతమతమవుతూనే ఉంది. ఈ సమస్యలన్నీ సుదీర్ఘ వలస ఏలుబడి, ఆ తర్వాత బలహీన పాలన వ్యవస్థల ఫలితమే. ఈ నేపథ్యం నుంచి బయటపడేలా అనేక సమస్యల పరిష్కారానికి తోడ్పడగల సామర్థ్యం ఆధునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాలకుంది. దేశంలోని సామాజిక-ఆర్థిక సమస్యల పరిష్కారంలో ఈ ఆధునిక సాంకేతికత పాత్ర ఎలాంటిది? ప్రజానీకానికి సమ్మిళిత అభివృద్ధి ఫలాలను అందించి, సామాజిక పరివర్తనకు ఇది దోహదపడుతుందా? వంటి ప్రశ్నలకు సమాధానాల అన్వేషణే ఈ వ్యాసం పరమోద్దేశం.

**సామాజిక-ఆర్థిక సవాళ్లు.. సమ్మిళిత అభివృద్ధి.. కొత్త సాంకేతికత స్వీకారం**

ప్రపంచంలోని పేదలలో అధిక శాతం భారత్‌లోనే ఉన్నారు. అనేక సామాజిక - ఆర్థిక సవాళ్లను దేశం ఎదుర్కొంటోంది.

**విజయ్‌కుమార్ కౌల్,** హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ. e-mail : kaulvijay@yahoo.com

భారతదేశంలో పరిపాలన, సాంకేతికత, సమ్మిళిత వృద్ధి




బాలలు పౌష్టికాహార లోపంతో అల్లాడు తున్నారు. క్షయ, కేన్సర్, మధుమేహం వంటి వ్యాధిగ్రస్థుల సంఖ్యను పరిశీలిస్తే ప్రపంచంలో మనదే అగ్రస్థానం. ఇటీవలి కాలంలో అక్షరాస్యత శాతం కొంత పెరిగినా, నేటికీ నిరక్షరాస్యుల సంఖ్యే ఎక్కువ. నిరుద్యోగ యువత పెద్దసంఖ్యలో ఉండగా, రానున్న సంవత్సరాల్లో ఈ నిర్దిష్ట సమస్య మరింత విషమం కాగలదు. వీటన్నిటికన్నా ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం సమాజంలో అట్టడుగు వర్గాల సమస్యలను మరింత ఎగదోసింది. ఈ సమస్యలన్నింటికీ సులభ పరిష్కారం దొరకదన్నది వాస్తవం. అంతేకాకుండా ఇవన్నీ ఒకదానితో మరొకటి ముడిపడినవే. ఉదాహరణకు... పేదరికం, సమ్మిళిత అభివృద్ధి, ఆహార భద్రత, ఉపాధి కల్పన వంటి సమస్యలు వ్యవసాయం, వ్యవసాయ పర్యావరణ వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఈ రెండు రంగాల్లో పూర్తిస్థాయి సంస్కరణలు అవసరం. పరస్పర సంబంధంగల ఈ సమస్యలన్నిటిపైనా ఏకకాలంలో ప్రభావం చూపగల, పరిష్కరించగల సమగ్ర ప్రణాళిక చట్రం అవశ్యం. అలాగే అన్ని ప్రాంతాలకూ ఉమ్మడి పరిష్కారం సాధ్యం కాకపోవడమేగాక, అలాంటిదాన్ని అమలు చేసినా సహాయకారిగా నిలవబోదు. ప్రాంతీయ వనరులు, ప్రజానీకం సంసిద్ధత, వారి భాగస్వామ్యం, సామర్థ్యాలు, చట్టబద్ధ వ్యవస్థల దృక్పథం లేదా ప్రభుత్వ వ్యవస్థలను దృష్టిలో ఉంచుకుని అత్యుత్తమ పరిష్కారాలను రూపొందించాల్సి ఉంటుంది.

అదే సమయంలో గమనించాల్సిన అంశం మరొకటుంది. గడచిన కొన్ని దశాబ్దాలుగా ఆవిష్కృతమైన డిజిటలైజేషన్ వంటి కొత్త సాంకేతికతలను వర్ధమాన దేశాల్లో సామాజిక-ఆర్థిక సమస్యలను పరిష్కారానికి వినియోగించినప్పుడు అనేక అంతర్గత సమస్యలు ఎదురయ్యాయి. డిజిటల్ సాంకేతికత వినియోగంతో విద్య విస్తరించింది. పాలనలో పారదర్శకత మెరుగుపడింది. ప్రజల మధ్య అనుసంధానం పెరిగింది. ఉత్పాదకతలో వృద్ధి కనిపించింది. సంస్థల పనితీరులో పరివర్తన వచ్చింది. కొత్త పరిశ్రమల సంఖ్య, వినూత్న ఆవిష్కరణల కార్యకలాపాలు ఊపందుకున్నాయి. గ్రామీణ, వ్యవసాయ రంగాలు, విద్య, ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ, ఎలక్ట్రానిక్ పాలన అంశాల గురించి తర్వాత చర్చిద్దాం.

చారిత్రకంగా చూస్తే భారత్ గతంలో అత్యంత సంపన్న దేశం. సుదీర్ఘ వలసపాలన ఆ సౌభాగ్యాన్ని దోచుకుంది. ఏ సాంకేతిక విప్లవంలోనూ దేశం పాలుపంచు కోలేక పోయింది. స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి విపరీతమైన పేదరికం, నిరక్షరాస్యత, దయనీయ సామాజిక-ఆర్థిక సూచీలతో అత్యంత పేద దేశాల్లో ఒకటిగా మిగిలింది. ఆ తర్వాత గడచిన ఆరు దశాబ్దాల స్వీయ పాలనలోనూ ఆ సమస్యల నుంచి బయటపడలేకపోయింది. అసమర్థ పాలన వ్యవస్థ పనితీరు కారణంగానే ఆర్థిక వ్యవస్థ పుంజుకోలేకపోయిందని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. అయితే, సమస్యలను పరిష్కరించగలిగేది మాత్రం నాణ్యమైన సుపరిపాలనే. తద్వారానే సుస్థిర ఆర్థిక, సామాజిక విధానాలు, కార్యక్రమాలు, పథకాలు రూపొందుతాయని, వాటిని సవ్యంగా అమలు చేయగలిగితే అంతిమంగా సమ్మిళిత వృద్ధి సిద్ధిస్తుందని రుజువైంది. ఈ ప్రక్రియలో ఆధునిక సాంకేతికతల పాత్రను పరిగణనలోకి తీసుకోవాలి. సంస్థ, పరిశ్రమ, నగర, ఆర్థిక వ్యవస్థలపరంగా పాలన వ్యవస్థలో డిజిటల్ సాంకేతికత పెనుమార్పు తెచ్చింది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలును ఈ సాంకేతిక పరిజ్ఞానాలు మరింత సులభతరం చేశాయి. దీన్నిబట్టి తగిన ప్రజానుకూల విధానాలు, కార్యక్రమాలు, పథకాలతోపాటు వాటి అమలులో ఆధునిక సాంకేతికత వినియోగంపై దృష్టి సారించే సుపరిపాలన అవసరం. దేశం ముందున్న సామాజిక-ఆర్థిక సవాళ్లను అది పరిష్కరించగలదని చెప్పవచ్చు. ఏతావాతా ఇవన్నీ కలగలసి దేశ సర్వతోముఖ సమ్మిళిత వృద్ధికి దోహదపడతాయి.

**ఆధునిక సాంకేతికత-భారత సమ్మిళిత వృద్ధి**

గడచిన 250 సంవత్సరాల్లో ప్రపంచం అద్భుతమైన సాంకేతిక మార్పులకు లోనయింది. ఈ విస్తృత సాంకేతిక మార్పులను, పురోగతినే సాంకేతిక

**భారత సాధికారతకు 12 సాంకేతికతలు**

| | | |
|---|---|---|
| డిజిటలైజేషన్ | మొబైల్ ఇంటర్నెట్ | చవకైన మరియు సమర్థమైన మొబైల్ పరికరాలు మరియు ఇంటర్నెట్ ద్వారా వ్యక్తుల సంస్థలకు సేవలు ఎక్కడైనా అందించవచ్చు. |
| | క్లౌడ్ టెక్నాలజీ | నెట్‌వర్క్ మరియు ఇంటర్నెట్ ద్వారా కంప్యూటర్ సామర్థ్యం, సేవలుఅందజేత చవకైన విధానం |
| | విజ్ఞానపనిలో ఆధునికత | మేధోపరమైన సాఫ్ట్‌వేర్ ద్వారా విశ్లేషణ, భాషపరమైన సంప్రదింపు, న్యాయాత్మకమైన పనితీరు, నిర్ణయాధికార సామర్థ్యం పెంపు. |
| | అంకీక చెల్లింపు | అందరికి ఆమోదయోగ్యమైన ఎల్రక్టానిక్ చెల్లింపుల ద్వారా బ్యాంకుకు దూరంగా ఉన్న కోట్లాది మందికి నగదు రహిత ఆర్థిక వ్యవస్థతో పరిచయం. |
| | ధ్రువీకృత అంకీక గుర్తింపు | అంకీక గుర్తింపు(డిజిటల్ ఐడెంటిటీ) ద్వారా సులువైన పద్ధతిలో సురక్షితమైన చెల్లింపు మరియు ప్రభుత్వ సేవలు |
| చురుకైన భౌతిక వ్యవస్థ (స్మార్ట్ ఫిజికల్ సిస్టమ్స్) | వస్తువు ఇంటర్నెట్ | తక్కువ ధరకు లభ్యమయ్యే గుర్తింపు పరికరాలు, యంత్రసామాగ్రి ద్వారా నిరంతరం సమాచార సేకరణ మరియు విశ్లేషణ |
| | మేధోపర రవాణా - సరఫరా | అంకీక సేవలు, ఇంటర్నెట్ వినియోగం ద్వారా రవాణా, సరఫరా సురక్షితమవ్వడమే కాకుండా సమర్థవంతమవుతోంది. |
| | అడ్వాన్స్ జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జిఐఎస్) | ప్రదేశాల యొక్క సమాచారం మరియు ఇతర సమాచారం క్రోడీకరించడం ద్వారా పనుల సమగ్ర నిర్వహణ మరియు భౌగోళికంగా ఇతర పను నిర్వహణ. |
| | నవతరం జన్యువిధానం (నెక్ట్స్ జనరేషన్ జినోమిక్స్) | వేగవంత, చవకైన జన్యు పట నిర్మాణం మరియు అధునిక జన్యు సాంకేతికత ద్వారా వ్యవసాయరంగ ఉత్పత్తి పెంపుదల, భారత ఇంధన భద్రత |
| పునర్ పరిశీలక శక్తి (రీ థింకింగ్ ఎనర్జీ) | అధునిక చమురు మరియు గ్యాస్ వెలికితీత | సంప్రదాయేతర చమురు, గ్యాస్ (షేల్ గ్యాస్)వెలికితీత ద్వారా భారతదేశంలో ఇంధన భద్రతకు తోడ్పాటునందించడం. |
| | సంప్రదాయేతర శక్తి | సంప్రదాయేతర వనరుల ద్వారా విద్యుత్ ఉత్పతి చేసి, మారుమూల ప్రాంతాలకు పంపిణీ చేయడంతోపాటు, పర్యావరణ పరిరక్షణ. |
| | అత్యాధునిక శక్తి నిల్వలు | పంపిణీ, సరఫరా నష్టాలు లేకుండా అధునిక విద్యుత్ నిల్వ సామర్థ్యం పెంపొందించుకోవడం. |

విప్లవాలుగా గుర్తించారు. అలాంటి ఐదు సాంకేతిక పరిజ్ఞాన విప్లవాలను దిగువ ఇచ్చిన పట్టికలో చూడవచ్చు. ఆరో విప్లవం ప్రస్తుతం రూపుదిద్దుకుంటోంది. దేశ ఆర్థిక వ్యవస్థ రూపాంతరీకరణపై ప్రభావం చూపగలవు కాబట్టే ఈ సాంకేతిక మార్పుల దశలను మనం విప్లవాలుగా వ్యవహరిస్తున్నాం. ప్రతి సాంకేతిక విప్లవం అభివృద్ధిని ఉప్పొంగింపజేసే చోదకంగా ఉంటుంది. వృద్ధి, ఉత్పాదకత పెంపు, వస్తు శ్రేణి, భౌగోళిక వ్యాప్తి, సామాజిక ప్రయోజనాలు వంటివాటిద్వారా దాని పూర్తి సామర్థ్యం వెల్లడయ్యేందుకు అర్ధ శతాబ్దంకన్నా ఎక్కువే అవసరం. వరుస సాంకేతిక విప్లవాలతో ఉత్తేజితమైన అభివృద్ధి దశలద్వారానే పెట్టుబడిదారీ విధానం ప్రగతిపథంలో పయనిస్తుంది. భారత సామాజికార్థిక లక్షణాల దృష్ట్యా సమ్మిళిత వృద్ధి సాధించాలంటే దేశానికి నిర్దిష్ట సాంకేతికతలు అవసరం.

పాతుకుపోయిన పాత వ్యవస్థల విచ్ఛిన్నంద్వారా నిర్దిష్ట వ్యవధిలో భారత ప్రగతికి దోహదపడే, ప్రముఖంగా ఆర్థిక ప్రభావం చూపగల అటువంటి 12 సాంకేతికతలను మెకిన్సీ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ గుర్తించింది. సదరు పరిజ్ఞానాల లబ్ధి, ప్రభావాలు విస్తృతంగా ఉంటాయి. అవి పెద్ద సంఖ్యలో ప్రజలను, సంస్థలను, ఉత్పత్తులను, విపణులను ప్రభావితం చేస్తాయి. భారత్

*తరువాయి 45వ పేజీ నుండి*

# సామాజిక భద్రతకు అటల్ పెన్షన్ యోజన

**జీవిత బీమా పథకాలు కేవలం 50 సంవత్సరాల వయసు వరకే వర్తిస్తే ఈ అటల్ పెన్షన్ పథకం 70 సంవత్సరాల వరకూ వర్తిస్తుంది. మొత్తం జనాభాలో 68శాతమూ, మొత్తం దేశ పేదలలో 78శాతంగా నున్నా ఈ మూడు పథకాలలో కలిపి కేవలం మూడవ వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతం వారు, బహుశా, అవగాహనా లోపం, గ్రామాలలో బ్యాంకుల సేవల లభ్యత తక్కువగా ఉండటం దీనికి కారణాలు కావచ్చు. మొత్తం చందాదారులలో నాలుగవ వంతు మాత్రమే మహిళలు,**

మన ప్రధానమంత్రి ఇటీవల మూడు సామాజిక సంక్షేమ పథకాలను ప్రారంభించారు. అవి : ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, మరియు అటల్ పెన్షన్ యోజన. ఈ మూడు పథకాలూ వరుసగా, మరణం ద్వారా వచ్చే సమస్యలకు, ఏదైనా ప్రమాదం జరిగితే వచ్చే సమస్యలకు, వృద్ధాప్య సమస్యలకు కొంత మేర పరిష్కారం చూపగలవు. పాలసీదారు మరణం లేదా శాశ్వత వైకల్యంలో రెండు లక్షల రూపాయల వరకూ పరిహారం లభిస్తుంది. దీనికి మొదటి రెండు పథకాలలో చెల్లించాల్సిన ప్రీమియం కేవలం రూ. 330/-లు మరియు 12 రూపాయలు. లబ్దిదారుని బ్యాంకు ఖాతా నుండి ప్రీమియం మొత్తాన్ని మినహాయించు కుంటారు. జూన్ ఒకటి 2015 నుండి మొదలైన ఈ పథకంలో పాలసీని ప్రతి సంవత్సరం పునరుద్దరించుకుంటూ ఉండాలి. ఈ పథకాల లబ్ది పొందడానికి కేవలం ఒక దరఖాస్తు నింపితే చాలు. సుస్థిరమైన సామాజిక భద్రతకు ఇది మరో ముందడుగు. ఈ పథకాలలో అనేక వినూత్న అంశాలు ఉన్నాయి.

**మొదటిది :** ఈ పథకాలు దాదాపు ప్రైవేటు పెన్షన్లను పొందలేని పేదలందరికీ అందుబాటులో ఉంటాయి. బ్యాంకు ఖాతాలు, వయసు వంటి కొన్ని నిబంధనలున్నప్పటికీ, అవి వీటిని సరైన లబ్దిదారులకు చేర్చడానికి ఉన్నాయి. ప్రీమియం లేదా పెట్టుబడి పేదలకు అందుబాటులో ఉండే విధంగా అతి తక్కువగా నిర్ణయించారు. **రెండవది :** ఇలా ప్రీమియం లేదా పెట్టుబడులను అలవాటు చేయడం పేదలకు ఒక మంచి అలవాటుగా మారుతుంది. వివిధ ఆర్థిక సేవల పట్ల వారి అవగాహన విస్తృతమవుతుంది. సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రజలకూ, బ్యాంకులకు మధ్య అనుసంధానం మరింత పటిష్ఠ మవుతుంది. **మూడవది :** ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకులు నిర్వహించే పాత్ర ప్రధానమైనది. లబ్దిదారుడు నేరుగా బీమా కంపెనీని సంప్రదించనవసరంలేదు. మధ్యలో ఉన్న బ్యాంకులే ఈ పనిని చూసుకుంటాయి. ప్రీమియం చెల్లించడంలోనైనా, లేక పరిహార మొత్తం లబ్ది దారునికి అందచేయడంలోనైనా

**జితేంద్ర సింగ్,** డిప్యూటీ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ & ప్రమోషన్, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ, భారత ప్రభుత్వం. e-mail : singh.jitender@nic.in

మొత్తం వ్యవహారం బ్యాంకులే చూసుకుంటాయి. దీనివల్ల వినియోగదారునికి ఎంతో వెసులుబాటు కలుగుతుంది. **నాలుగవది :** బిజినెస్ కరస్పాండెంట్ విధానం. జనధన యోజనలో ప్రవేశపెట్టిన ఈ బిజినెస్ కరస్పాండెంట్ విధానం బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృత పరుస్తుంది. అర్హత కలిగిన ఏ నిరుద్యోగి అయినా ఈ కరస్పాండెంట్‌గా ఉపాధి పొందవచ్చు. అసలు బ్యాంకులకు దూరంగా మారుమూల పల్లెల్లో కూర్చుని ప్రజలకు బ్యాంకులు అందచేసే అన్ని సేవలనూ ఈ బిజినెస్ కరస్పాండెంట్ అందచేస్తాడు. దీని ద్వారా బ్యాంకులు తమ లావాదేవీల వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. ఒక ఐదవది బీమా పెన్షన్‌లకోసం ప్రజలు చేసే పొదుపు మొత్తం జాతి నిర్మాణ కార్యక్రమాలలో పెట్టుబడిగా ఉపకరిస్తుంది. దీని ద్వారా సంప్రదాయక భూమి, బంగారం వంటి పెట్టుబడులలో ఉండే నష్టభయం ఈ తరహా పెట్టుబడులలో ఉండదు.

ఇలాంటి వినూత్న అంశాలు ఉన్నందునే ఈ మూడు పథకాలూ ఘన విజయాన్ని సాధించాయి. అతి తక్కువ కాలంలో, అంటే 27.06.2015 నాటికి, అంటే కేవలం ప్రారంభించిన 26 రోజులలో ఈ మూడు పథకాలూ కలిపి జాతికి రూ. 10.42 కోట్లను పెట్టుబడులుగా అందచేశాయి. దీనిలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా అందినది 78శాతం అయితే గ్రామీణ బ్యాంకుల నుండి 16శాతం ప్రొది అయింది. మిగిలినది సహకార బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకుల ద్వారా వచ్చింది. అయితే లబ్ధిదారుల సంఖ్యలో మాత్రం, ఒక వ్యక్తి మూడు పథకాలలోనూ చేరితే ఒకే వ్యక్తిని మూడుసార్లు లెక్కిస్తారు.

మొత్తం సమీకరించిన చందాలో మూడు వంతులు ప్రమాదబీమా కోసం అయితే, మిగిలిన ఒక వంతు మరణ బీమాకోసం చెల్లించారు. కేవలం ఒక శాతం కన్నా తక్కువ మాత్రమే వృద్ధాప్య పించను కోసం వసూలు అయింది. ప్రమాదబీమాకు ఎక్కువ ప్రాధాన్యం రావడం బహుశా అతి తక్కువ ప్రీమియం వల్ల కావచ్చు. జీవిత బీమా పథకాలు కేవలం 50 సంవత్సరాల వయసు వరకే వర్తిస్తే ఈ అటల్ పెన్షన్ పథకం 70 సంవత్సరాల వరకూ వర్తిస్తుంది. మొత్తం జనాభాలో 68శాతమూ, మొత్తం దేశ పేదలలో 78శాతంగా నున్నా ఈ మూడు పథకాలలో కలిపి కేవలం మూడవ వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతం వారు, బహుశా, అవగాహనా లోపం, గ్రామాలలో బ్యాంకుల సేవల లభ్యత తక్కువగా ఉండటం దీనికి కారణాలు కావచ్చు. మొత్తం చందాదారులలో నాలుగవ వంతు మాత్రమే మహిళలు, అది కూడా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో సమానంగా విస్తరించి ఉన్నారు. ఇప్పటి వరకూ మొత్తం 28 మందికి జీవిత బీమా మొత్తాలనూ ఎనిమిది మందికి ప్రమాద బీమా మొత్తాలనూ చెల్లించారు. అయితే ఈ పథకాల వల్ల కొన్ని సమస్యలు కూడా లేకపోలేదు.

- గ్రామీణ ప్రాంతాలలో పథకాల పట్ల అవగాహనా లోపం ఒక ప్రధాన సమస్య. గ్రామాలలో నిజంగా అర్హులైన వారికి వీటి సమాచారాన్ని సమగ్రంగా సకాలంలో అందించే వ్యవస్థ ఏదీ అందుబాటులో లేదు. అంటే కాదు, గ్రామ పంచాయితీల ప్రమేయం లేకుండా ఈ అవగాహనా కార్యక్రమాలు అసలు విజయవంతం కానే కావు.
- జనధన యోజన కార్యక్రమం క్రింద అసలు కనీస మొత్తం ఏమీ లేకుండా ప్రారంభించిన బ్యాంకు ఖాతాల వల్ల బ్యాంకులకు పడే ఆర్థిక భారాన్ని ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం కొంతవరకూ పూరిస్తుంది. అయినప్పటికీ ఈ బీమా పథకాలు బ్యాంకులకు భారమనే చెప్పాలి.
- ఈ మూడు పథకాలలో వసూలయ్యే అతి కొద్ది మొత్తంతో బ్యాంకులు అదనపు సిబ్బందిని నియమించడం భారమే అని చెప్పాలి.
- బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించడం కూడా ఆర్థికంగా గిట్టుబాటు కాదు. ఎందుకంటే చాలా ఖాతాలు శూన్య మొత్తాలతో ప్రారంభించబడినాయి కనుక.
- ఒక గ్రామంలో పనిచేసే ఒక బ్యాంకింగ్ కరస్పాండెంటుకు కనీసం ఒక ల్యాప్టాప్, విద్యుత్తు అంతర్జాలం మొదలైన సేవలు అందుబాటులో ఉండాలి. తాను స్వయంగా కంప్యూటర్ అంతర్జాలం ఏర్పాటు చేసుకున్నా, గ్రామాలలో అంతర్జాల అందుబాటు హీనంగానే ఉన్నది. క్లుప్తంగా చెప్పాలంటే మరణానంతర పరిహారము ప్రమాద బీమా, వృద్ధాప్య ఆసరాలను అందచేసే ఈ పథకాలు ఆదర్శవంతమే. పేదలకు సామాజిక భద్రతను అందచేసేవే అయినప్పటికీ పట్టణ యువత మాత్రం వీటిపటల్ల స్పందన లేకుండానే ఉన్నారు. అవగాహన లేకపోవడం, అంతర్జాల కనెక్షన్లలో తరచూ వచ్చే అంతరాయాలు, అట్టడుగు గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకులు ఇంకా చొచ్చుకు పోలేకపోవడం మొదలైన వాటిని ప్రధాన ఆడ్డంకులుగా చెప్పవచ్చు. కేవలం అధికంగా చందాలు వచ్చినంతనే ఈ పథకాలు పూర్తిగా విజయవంత మయ్యాయని చెప్పలేము. పేదలకు సకాలంలో తగిన సహాయాన్ని అందచేయగలిగితేనే వీటిని విజయవంతం అనగలుగుతాము. ■




# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్యశర్మ

1. జాతీయ జనాభా స్థిరీకరణ నిధి ప్రకారం 11.7.015 నాటికి భారతదేశ జనాభా ఎంత? ఇతర వివరాలేమిటి?
(ఎ) జనాభా : 127,42,39,769 (బి) ప్రపంచ జనాభాలో భారతీయులు : 17.25%
(సి) భారతదేశ జనాభా వృద్ధిశాతం : 1.63%
(డి) పైవన్నీ
2. "హౌసింగ్ ఫర్ ఆల్ బై 2022' పథకం క్రింద పట్టణాలలో రాబోయే 7 ఏళ్ళల్లో (75వ స్వతంత్రం) ఎన్ని గృహాలు నిర్మిస్తారు? (మిలియన్లలో)?
(ఎ) 20 (బి) 40
(సి) 60 (డి) 10
3. విరూపాక్ష గుడి నుండి ఎదుర బసవ వరకు రాళ్లతో కట్టిన సాలుమంటపాలు ఎక్కడున్నాయి?
(ఎ) వరంగల్ (బి) హంపి
(సి) మధురై (డి) రామప్పగుడి
4. రూ. 45 లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రారంభించిన డిజిటల్ ఇండియా ఎంతమందికి ఉపాధి కల్పిస్తుంది? (లక్షల్లో)
(ఎ) 18 (బి) 5 (సి) 15 (డి) 12
5. కావేరి నదికి క్యాచ్‌మెంట్ ఏరియా ఏది?
(ఎ) మహాబలేశ్వర్ (బి) కొడగుజిల్లా, కర్నాటక
(సి) త్రయంబక్‌నాసిక్ (డి) హిమాలయాలు
6. షనన్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టు మండి, హిమాచల్ ప్రదేశ్ ఎప్పుడు పనిచేయడం ప్రారంభించింది?
(ఎ) 1936 (బి) 1966
(సి) 1928 (డి) 1932
7. జి.డి. బిర్లా అవార్డు 2014 ఫర్ సైంటిఫిక్ రీసెర్చ్ ఎవరికి ఇచ్చారు?
(ఎ) ఎం.ఎస్ స్వామినాథన్
(బి) ప్రొఫెసర్ సంజీవ్ గలాండే
(సి) వి.కె. సారస్వత్ (డి) అనీల్‌కకోడ్కర్
8. ఈస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డిఎఫ్‌సి) కోసం ప్రపంచ బ్యాంకు ఎంత రుణం మంజూరు చేసింది?
(ఎ) 650 (బి) 250 (సి)350 (డి) 450
9. పాస్‌పోర్టు సేవా దివస్ ఎప్పుడు?
(ఎ) జూన్ 24 (బి) అక్టోబర్ 24
(సి) జనవరి 24 (డి) జనవరి 26
10. జేమ్స్ హార్నర్ ఏ సినిమా మ్యూజిక్ కంపోజర్?
(ఎ) టైటానిక్ (బి) అవతార్
(సి) ఎలీన్స్ (డి) పైవన్నీ
11. అవధ్ ఆఖరి నవాబ్ (సెంట్రల్ ఉత్తరప్రదేశ్) ఎవరు? వివరాలేమిటి?
(ఎ) నవాబ్ వాజిద్ ఆలీషా (బి) 1956లో డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ వల్ల, ఈయన పాలన ఆగిపోయింది (సి) బ్రిటీష్ వారు ఆయన్ని బెంగాల్‌లోని మాటియా బుర్జ్‌కి పంపారు, బ్రిటీష్‌వారు (డి) పైవన్నీ
12. 1921లో ప్రారంభమైన లక్నో జూ నూతన పేరు ఏమిటి?
(ఎ) ప్రిన్స్ ఆఫ్ వేల్స్ జూలాజికల్ గార్డెన్స్
(బి) లక్నో ప్రాణి ఉద్యాన్
(సి) నవాబ్ వాజిద్ ఆలీషా ప్రాణి ఉద్యాన్
(డి) ఇవేవి కావు
13. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) కజకిస్తాన్ : ఆస్తానా
(బి) కిర్గిస్తాన్ : బిష్‌కెక్
(సి) తుర్క్‌మెనిస్తాన్ : ఆష్‌గాబాట్
(డి) పైవన్నీ (దేశాలు : రాజధానులు)
14. గతంలో ఎల్‌నినో ఏ సంవత్సరం ఏర్పడింది?
(ఎ) 1997 (బి) 2002
(సి) 2006 & 2009 (డి) పైవన్నీ
15. సిస్టర్ నిర్మల ఏ సంస్థకు సుపీరియర్ జనరల్‌గా సేవ చేశారు?
(ఎ) రామక్రిష్ణమిషన్
(బి) మిషనరీస్ ఆఫ్ చారిటి
(సి) చిన్మయానంద మిషన్ (డి) ఇవేవీకావు
16. భారతదేశం, ఏ దేశాల నుండి గోధుమ దిగుమతి చేసుకోవాలనుకుంటుంది?
(ఎ) ఆస్ట్రేలియా (బి) ఫ్రాన్స్
(సి) రష్యా (డి) పైవన్నీ
17. కుంభగ్లేషియర్ ఎక్కడుంది?
(ఎ) కెనడా (బి) ఎవరెస్ట్ శిఖరం దగ్గర, హిమాలయాలల్లో (సి) ఫ్రాన్స్ (డి) పెరూ
18. గ్రీన్ క్లైమేట్‌ఫండ్ ఎంత ధనంతో భారతదేశంలో కార్యక్రమాలు చేపట్టనున్నది (బిలియన్ యుఎస్ డాలర్లలో)?
(ఎ) 100 (బి) 50
(సి) 60 (డి) 40
19. డిజిటల్ ఇండియాలోగల ప్రధాన కార్యక్రమాలు ఏవి?
(ఎ) భారత్ నెట్ (బి) డిజిటల్ లాకర్
(సి) నేషనల్ స్కాలర్ షిప్స్ పోర్టల్ (డి) పైవన్నీ
20. తుర్క్ మెనిస్తాన్ - ఆఫ్ఘనిస్తాన్ - పాకిస్తాన్- ఇండియా (టిఎపిఐ) గ్యాస్‌పైప్‌లైన్ పొడవెంత? (కి.మీ.లలో) వివరాలేమిటి?
(ఎ) 1078 మైళ్ళు (బి) కాస్పియన్, సముద్రం అవాజా దగ్గర మొదలౌతుంది (సి) పైప్‌లైన్ 90 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ సరఫరా చేయగలదు (డి) పైవన్నీ
21. ప్రపంచ బ్యాంక్ లెక్కల ప్రకారం ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) 2014లో భారతదేశ ఎకానమీ యుఎస్ డాలర్లు 2 ట్రిలియన్లు (బి) 2014లో జాతీయ ఆదాయంలో భారతీయుని వార్షిక తలసరి ఆదాయం : యుఎస్ డాలర్లు 1,610 (సి) 2014లో చైనా దేశ ఎకానమీ : యుఎస్ డాలర్లు 10.4 ట్రిలియన్లు (డి) పైవన్నీ
22. ఇంగ్లాండ్ వ్యాపార పెట్టుబడులు పెట్టే దేశాలలో మూడవ స్థానంలో ఉన్న దేశం ఏది?
(ఎ) యుఎస్ఎ (బి) ఫ్రాన్స్
(సి) ఇండియా (డి) జపాన్
23. నేషనల్ ఎకనామిక్ & కాస్ట్ సెన్సస్ (2011) ప్రకారం భారతదేశంలో, గ్రామీణ ప్రాంతంలో ఎంత శాతం మంది భూమిలేనివారు ఉన్నారు?
(ఎ) 30% (బి) 20%
(సి) 15% (డి) 12%
24. నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ ఛైర్మన్ ఎవరు?
(ఎ) అరవింద్ పనగారియా
(బి) ప్రనబ్ సేన్
(సి) హెచ్.ఎస్. అహ్లువాలియా
(డి) రతన్ టాటా
25. ప్రధానమంత్రి ముద్ర యోజన క్రింది ముద్ర కార్డ్ విడుదల చేసిన బ్యాంక్ ఏది?
(ఎ) ఎస్‌బిఐ (బి) కార్పొరేషన్ బ్యాంక్
(సి) ఎస్‌బిహెచ్ (డి) ఇండియన్ బ్యాంక్
26. అబ్దుల్ కలాం 79వ జన్మదినం సందర్భంగా ఏ సంవత్సరంలో అక్టోబర్ 15ను ప్రపంచ విద్యార్థి దినంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది?
(ఎ) 2014 (బి) 2015
(సి) 2008 (డి) 2010
27. 26 మే 2005లో అబ్దుల్ కలాం రాక సందర్భంగా ఆదినాన్ని "సైన్స్ డే" గా జరుపుకున్న దేశం?
(ఎ) స్విడ్జర్‌ల్యాండ్ (బి) రష్యా
(సి) నేపాల్ (డి) ఇథోపియా

28. దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు భారతప్రభుత్వం 1998లో ఏ పురస్కారం ఇచ్చింది?
(ఎ) వీర్‌సావర్కర్ అవార్డు (బి) పద్మ భూషణ్
(సి) భారతరత్న (డి) పద్మ విభూషణ్
29. ఏషియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ వివరాలేమిటి?
(ఎ) 50 దేశాలు సభ్యత్వం కలిగి ఉంటాయి
(బి) భారతదేశానికి 7.5% ఓటింగ్ షేర్, చైనాకి 26శాతం ఓటింగ్ షేర్ ఉంటాయి.
(సి) దీని ఇనిషియల్ క్యాపిటల్ 100 బిలియన్ల యుఎస్ డాలర్లు (డి) పైవన్నీ
30. ఇటీవల చెన్నయ్‌లో మెట్రో రైలు ప్రారంభించారు? ఇంకా ఎక్కడెక్కడ మెట్రో రైళ్ళు ఉన్నాయి?
(ఎ) కోల్‌కత (బి) ఢిల్లీ, ముంబయ్
(సి) బెంగుళూరు& జైపూర్ (డి) పైవన్నీ
31. క్రీస్తుపూర్వం 50 సంవత్సరం – క్రీస్తు శకం 500 సంవత్సరాల మధ్య రోమ్ సామ్రాజ్యంతో వ్యాపార సంబంధాలుగల నగరాలు ఏవి?
(ఎ) అజగాంకులం (వైగెయ్‌నది దగ్గర)
(బి) అరికమేడ, (పుదుచ్చేరి) (సి) పట్టణం (ముజిరిస్) (కేరళ) (డి) పైవన్నీ
32. బిసిఐఎం ఎకనామిక్ కారిడార్‌లోగల దేశాలేవి?
(ఎ) బంగ్లాదేశ్ (బి) చైనా
(సి) ఇండియా & మయన్‌మార్ (డి) పైవన్నీ
33. కొత్తగా ప్రతిపాదించిన కె (కోల్‌కత) –2 కె(కన్‌మింగ్ కారిడార్) వివరాలేమిటి?
(ఎ) పొడవు 2800 కిలోమీటర్లు
(బి) కోల్‌కత్తా – ఢాకా – మాండలే – కన్‌మింగ్ (చైనా)లను కలిపే మార్గమిది
(సి) దీనివల్ల ఈశాన్య రాష్ట్రాలకు రహదారులు సులువుగా ఉంటాయి (డి) పైవన్నీ
34. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'గివ్‌ఇట్ ఆప్' (వదిలేసుకొండి) అనే ఎల్‌పిజి సిలిండర్ సబ్సిడిని ఇప్పటికి ఎంతమంది వదులుకున్నారు? (లక్షల్లో)
(ఎ) 6.5 (బి) 13.00
(సి) 15 (డి) 20
35. ఐసిసి కొత్త ప్రెసిడెంట్ ఎవరు?
(ఎ) కమల్ ముస్తఫా (బి) జహీర్ అబ్బాస్
(సి) శ్రీనివాసన్ (డి) జగ్‌మోహన్‌దాల్మియా
36. కోపా అమెరికా ఫుట్‌బాల్ గేమ్ విజేత ఎవరు?
(ఎ) ఛిలీ (బి) అర్జెంటీనా
(సి) బ్రెజిల్ (డి) మెక్సికో
37. బ్రిక్స్ & ఎస్‌సిఓ సమావేశాలు నిర్వహించిన రష్యా నగరం ఏది?
(ఎ) షాంఘై (బి) ఉఫా
(సి) బీజింగ్ (డి) కీవ్
38. యునిసెఫ్ సపోర్టు చేసిన రాపిడ్ సర్వే ఆఫ్ చిల్డ్రన్స్ ప్రకారం జాతీయ స్థాయిలో గ్రామ ప్రాంత పిల్లల్లో స్టంటింగ్ (ఎదుగుదల నిలిచిపోవడం) ఎంత శాతం ఉంది?
(ఎ) 32.1% (బి) 41.7%
(సి) 38.8% (డి) 35.40%
39. ఫార్మోసా అనే పేరు ఏ దేశానికి ఉండేది?
(ఎ) ఇండొనేషియా (బి) తైవాన్
(సి) థాయ్‌లాండ్ (డి) మయన్‌మార్
40. జర్మనీలో ఎక్కడ ఉన్న అతిపురాతన న్యూక్లియర్ రియాక్టర్‌ని మూసేశారు?
(ఎ) బవేరియా (గ్రాఫెన్ రీన్ ఫీల్డ్)
(బి) ఫుకుషిమా
(సి) ఛెర్నోబిల్ (డి) త్రీఐలాండ్
41. బిసిఐఎం ప్రాజెక్టు వల్ల లాభాలేమిటి?
(ఎ) సంపదలు కలిగించే ఎకనామిక్ బెల్ట్ ఏర్పాటు చేయడం (బి) క్రాస్ బోర్డర్ రవాణా
(సి) ఎనర్జీ & టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్స్
(డి) పైవన్నీ
42. కాబిని రిజర్వాయర్ ఎక్కడుంది?
(ఎ) బీఛనహళ్ళి (మైసూరుకి 50 కిమీ దూరంలో) (బి) మహారాష్ట్ర
(సి) గుజరాత్ (డి) గోవా
43. మణిపూర్‌లోని మొయిరాంగ్‌లో ఎపుడు ఇండియన్ నేషనల్ ఆర్మీ సోల్జర్స్ స్వతంత్ర భారత జెండా ఎగుర వేశారు?
(ఎ) 1832 (బి) 14-06-1944 (రెండవ ప్రపంచ యుద్ధకాలం)
(సి) 1947 (డి) 1950
44. యుఎన్ పబ్లిక్ సర్వీసెస్ 2015 అవార్డును బహిరంగ ప్రదేశంలో మల విసర్జన నిలుపుదలకు గాను, ఏ జిల్లాకు ఇచ్చారు?
(ఎ) నాడియా జిల్లా (పశ్చిమ బెంగాల్)
(బి) జైపూర్ (సి) అలహాబాద్ (డి) పాట్నా
45. బిబెక్ దేబ్రాయ్ ప్యానెల్ (కమిటి) చేసిన సిఫారసులు ఏవి?
(ఎ) రైల్వేలకు స్వయం ప్రతిపత్తిగల రెగ్యులేటర్‌ని ఏర్పాటు చేయటం (బి) రైల్వే మినిస్ట్రీని, రైల్వే బోర్డ్‌ని విడదీయడం (సి) రైల్వేలను నడపడంలో ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించటం
(డి) పైవన్నీ
46. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) ముంబయ్ : ఆర్ట్ డెకో (బి) చెన్నయ్ : ఇండో – సరసెనిక్ (సి) కోల్‌కత్త : వలస, బెంగాలీ, గోథిక్ & ఇండో సరసెనిక్ (డి) పైవన్నీ (గృహనిర్మాణ శైలిలో)
47. ఎన్‌బిఏ టీం – డల్లాస్ మావెరిక్స్‌లోకి చేర్చుకున్న భారతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఎవరు?
(ఎ) సత్నాం సింగ్ భామ్రా
(బి) ఆండీబోర్‌మాన్ (సి) హరీష్ శర్మ
(డి) అమ్రిత్ పాల్ సింగ్
48. డేనియల్ ఆల్ట్‌మాన్స్ బేస్ లైన్ ప్రాఫిటబిలిటి ఇండెక్స్ 2015 ప్రకారం ఏ దేశం ప్రథమ స్థానంలో ఉంది?
(ఎ) భారతదేశం (బి) చైనా
(సి) హాంగ్‌కాంగ్ (డి) యుఎస్ఏ
49. సంపూర్ణ క్రాంతికి పిలుపునిచ్చిన జయప్రకాష్ నారాయణ్ జన్మస్థలం ఏది?
(ఎ) సితాబ్, దయారా, ఛాప్రా (శరన్) జిల్లా, బీహార్ (బి) న్యూఢిల్లీ
(సి) పోర్‌బందర్, గుజరాత్ (డి) వారణాసి
50. యుఎన్‌సిటిఎడి తయారు చేసిన వరల్డ్ ఇన్ వెస్ట్‌మెంట్ రిపోర్ట్ ప్రకారం, 2014లో ఏ దేశం ఎక్కువ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకర్షించి, ప్రథమస్థానంలో ఉంది?
(ఎ) చైనా (బి) హాంగ్‌కాంగ్
(సి) ఇండియా (డి) శ్రీలంక
51. చార్లెస్ కొరియా (1930–2015) వేటిని డిజైన్ చేశాడు?
(ఎ) గాంధీ ఆశ్రమం మ్యూజియం
(బి) న్యూబాంబే (సి) ట్యూబ్ హౌస్ (డి) పైవన్నీ (ఈయన సికింద్రాబాద్, తెలంగాణ లో జన్మించాడు.
52. 'నాథులా పాస్' వివరాలేమిటి?
(ఎ) ఇది 4545 మీటర్ల మార్గం
(బి) కైలాస్ యాత్ర దూరం 1500కిమీ
(సి)మిది తీర్థయాత్ర స్థలం (డి) పైవన్నీ
53. ది కమిటి ఆన్ కెపాసిటి బిల్డింగ్ ఇన్ బ్యాంక్ & నాన్ బ్యాంక్ ఇన్‌స్టిట్యూషన్స్‌ని ఎవరు ఏర్పాటు చేశారు?
(ఎ) ఆర్‌బిఐ (బి) ఎస్‌బిఐ
(సి) ఐఆర్‌డిఎటి (డి) ఇపిఎఫ్ఓ
54. జపాన్ దేశపు సాఫ్ట్ బ్యాంక్ ప్రధాన వ్యాపారం ఏది?
(ఎ) టెలికాం & ఇంటర్నెట్ (బి) విమానాల తయారీ (సి) రైలు ఇంజన్ల తయారీ
(డి) ఇవేవికావు
55. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) బేనజీర్ భుట్టో : అన్నాసువోరోవా
(బి) బియాండ్ డేట్ : తీస్తా సెతల్ వాడ్
(సి) గోపాలక్రిష్ణ గోఖలే : గోవింద్ తాళ్వాల్కర్
(డి) పైవన్నీ
56. సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జిబి) వివరాలేమిటి?
(ఎ) సావరిన్ గోల్డ్ (బంగారం) బాండ్స్‌ను 2 గ్రాములు, 5 గ్రాములు, 10 గ్రాములలో జారీ చేస్తారు (బి) కనీస కాలపరిమితి 5 నుండి 7 సంవత్సరాలు (సి) వీటిని బ్యాంకులలో ఎన్‌బిఎఫ్‌సిలలో పోస్టాఫీసుల్లో అమ్ముతారు, కొంతారు వీటిపైన వడ్డీ, మార్కెట్‌లో బంగారం ధరకు సమానంగా ఉంటుంది (డి) పైవన్నీ
57. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) DO : డిజాల్వ్‌డ్ ఆక్సిజన్
(బి) BOD: బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్
(సి) TDS : టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్
(డి) పైవన్నీ
58. జూన్ 19, 2015 నాటికి ఆర్‌బిఐ వద్ద ఉన్న ఫారెన్ ఎక్స్ఛేంజ్ రిజర్వ్‌లు ఎంత? (యుఎస్ బిలియన్ డాలర్లలో)
(ఎ) 355.46 (బి) 315
(సి) 320 (డి) 304

59. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఏ) RII : రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్ట్‌మెంట్
(బి) HNI : హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్
(సి) QIB: క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయర్స్
(డి) పైవన్నీ

60. కేంద్ర ప్రభుత్వం ఏ ప్రభుత్వ రంగ సంస్థలకు, టాక్స్ ఫ్రీ బాండ్‌ల జారీ ద్వారా రూ. 40వేల కోట్లను సేకరించడానికి అనుమతిని ఇచ్చింది?
(ఏ) ఎన్‌హెచ్‌ఏఐ : రూ. 24వేల కోట్లు
(బి) ఇండియన్, రైల్వేస్ ఫైఆనన్స్ కార్పోరేషన్ : రూ. 6వేల కోట్లు
(సి) హుడ్కో : రూ. 5వేల కోట్లు
(డి) పైవన్నీ (IREDA, IVTPC, PFC, REC)

61. స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) ట్రైనింగ్ సెంటర్లను అధ్యయనం చేయటానికి నియమించిన కమిటి / పానెల్ ఛైర్‌పర్సన్ ఎవరు?
(ఏ) పి.గోపిచంద్ (బి) అశ్వనీ నాచప్ప
(సి) డా. జస్పాల్ సింధు
(డి) భోగేశ్వర్ బారువా

62. మిలేనియం డెవలప్‌మెంట్ గోల్స్ (ఎండిజి)రిపోర్టు 2015 ప్రకారం భారతదేశంలో పేదరికం 49.47 (1994లో) నుండి 2011కి ఎంతకి తగ్గింది?
(ఏ) 24.7% (బి) 21%
(సి) 19% (డి) 18%

63. రోజుకి ఎంతకన్నా తక్కువ సంపాదన ఉన్న వారిని పేదవారు అనవచ్చును, అని ప్రపంచ బ్యాంకు తెలిపింది?
(ఏ) 0.5 డాలర్లు (బి) 1.25 డాలర్లు
(సి) 0.6 డాలర్లు (డి) 0.7 డాలర్లు

64. సువర్ణ భూమి ఎయిర్ పోర్ట్ ఎక్కడుంది?
(ఏ) బాంగ్‌కాక్ (బి) జకార్తా
(సి) కౌలాలంపూర్ (డి) టోక్యో

65. 2013లో ఆమోదించిన నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ అమలు చేయటానికి ఇంకా సమయం కోరిన రాష్ట్రాలు ఏవి?
(ఏ) తమిళనాడు, జమ్ము & కాశ్మీర్
(బి) గుజరాత్, కేరళ
(సి) ఉత్తరప్రదేశ్ (డి) పైవన్నీ

66. 500 ఎండబ్ల్యుఎం ప్రొటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ వివరాలేమిటి?
(ఏ) కల్పక్కం, తమిళనాడులో నిర్మించారు
(బి) దీనిలో ఇంధనంగా ప్లుటోనియం, యురేనియం యాక్సైడ్ వాడతారు మరియు 1750 టన్నుల లిక్విడ్ సోడియం కూలెంట్ గా వాడతారు (సి) భారతీయ నాభికోయ విద్యుత్ నిగం లిమిటెడ్ (భావిని) దీని నిర్మాణం చేసింది
(డి) పైవన్నీ

67. సమాచార హక్కు చట్టం భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ద్వారా రూపొందించారు?
(ఏ) ఆర్టికల్ 19(1) (ఏ) ఫ్రీడం ఆఫ్ స్పీచ్ & ఎక్స్‌ప్రెషన్ (బి) ఆర్టికల్ 14
(సి) ఆర్టికల్ 25 (డి) ఆర్టికల్ 27

68. ఫిబ్రవరి 2016లో ఎక్కడ డెల్ఫిక్ గేమ్స్ నిర్వహిస్తారు?
(ఏ) ఏథెన్స్, గ్రీస్ (బి) గోవా
(సి) బీజింగ్, చైనా (డి) కెనడా

69. డెల్ఫిక్ గేమ్స్ వివరాలేమిటి?
(ఏ) 1000 సంవత్సరాల క్రితం ఒలింపిక్ గేమ్స్ మాదిగానే డెల్ఫిక్ గేమ్స్‌ని ప్రారంభించారు, గ్రీన్ దేశంలోని డెల్ఫీలో కాని 394 సంవత్సరంలో నిషేధించారు (బి) 1994లో ఇంటర్నేషనల్ డెల్ఫిక్ కౌన్సిల్ (ఐడిసి) స్థాపించి, డెల్ఫిక్ గేమ్స్ నిర్వహిస్తున్నారు (సి) యూత్ డెల్ఫిక్ గేమ్స్ ప్రతి 4 సంవత్సరాలకొకసారి నిర్వహిస్తారు (డి) పైవన్నీ

70. ఉజ్ బెకిస్తాన్ రాజధాని ఏది?
(ఏ) తాష్కెంట్ (బి) ఆస్తానా
(సి) దుషాన్ బే (డి) త్బిలిసి

71. గ్రీసు దేశ ఆర్థిక సమస్యను నిశితంగా పరిశీలిస్తున్న సంస్థలేవి?
(ఏ) యూరోపియన్ కమిషన్
(బి) యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్
(సి) ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్
(డి) పైవన్నీ (వీటిని ట్రాయోకా అంటున్నారు)

72. గ్రీసు దేశ ఆర్థిక సమస్య వివరాలేమిటి?
(ఏ) 320 బిలియన్ యూరోల అప్పు (350 బిలియన్ డాలర్ల అప్పు) (బి) గ్రీసు దేశం నిర్వహించిన రెఫరెండంలో, ఆదేశ ప్రజలు రుణమాఫీని వద్దన్నారు. (భవిష్యత్తులో రాబోయే కఠిన తర ఆర్థిక ఆంక్షల దృష్ట్యా) (సి) 2010 తర్వాత ఇపుడు రాబోయేది మూడవ ఇంటర్నేషనల్ బెయిల్ అవుట్ అవుతుంది (డి) పైవన్నీ

73. డొనాల్డ్ టస్క్ దేనికి అధ్యక్షుడు?
(ఏ) యూరోపియన్ యూనియన్
(బి) ఆఫ్రికా యూనియన్ (సి) సార్క్
(డి) ఏషియాన్

74. ప్రిపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఫర్ మాస్ టాన్సిట్ సిస్టం (పిపిఐ-ఎంటిఎస్) వివరాలేవి?
(ఏ) వీటిల్లో రూ. 2000 వరకు రిలోడ్ చేసుకోవచ్చును. (బి) వీటిని 6 నెలల వరకు వాడుకోవచ్చును (సి) క్రొత్త కేటగిరి ఈ సెమిక్లోజ్డ్ పిపిఐల గురించిన మార్గదర్శక సూత్రాలు ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది (డి) పైవన్నీ

75. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఏ) SCZMA: స్టేట్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (బి) CRZ : కోస్టల్ రెగ్యులేటరీ జోన్
(సి) FDR : ఫ్లూట్ డేటారికార్డర్ (డి) పైవన్నీ

76. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఓ) లో కొత్తగా చేరుతున్న దేశాలేవి?
(ఏ) చైనా, రష్యా, కజకిస్తాన్ (బి) ఉజ్‌బెకిస్తాన్, తజకిస్తాన్ (సి) ఇండియా, పాకిస్తాన్ (డి) పైవన్నీ

77. 2016లో సార్క్ దేశాల సమావేశం ఎక్కడ నిర్వహిస్తారు?
(ఏ) ఖాట్మాండు (బి) ఇస్లామాబాద్, పాకిస్తాన్
(సి) మాలే (డి) కొలంబో

78. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఏ) న్యూయార్క్ స్టాక్ ఎక్చేంజ్ : డౌజోన్స్ ఇండస్ట్రియల్ ఇండెక్స్ (బి) నాస్‌డాక్ : ఓఎంఎక్స్ గ్రూప్ (సి) డార్క్ పూల్ : ప్రైవేట్ ట్రేడింగ్ సెంటర్లు షేర్ల అమ్మకానికి కొనుగోళ్ళకు యుఎస్‌లో (డి) పైవన్నీ

79. ఆర్‌బిఐ క్రొత్తగా విడుదల చేసిన రూ. 100 నోటు మీద (మహాత్మాగాంధీ సిరీస్ – 2005) నోటు సీరియల్ నెంబర్ ఎలా ఉంటుంది?
(ఏ) సంఖ్యల సైజు ఎడమ నుండి కుడివైపుకి ఆరోహణ క్రమంలో ఉంటాయి (బి) సంఖ్యలో అవరోహణ క్రమంలో ఉంటాయి (సి) సంఖ్యలు ఒకే సైజులో ఉంటాయి (డి) సంఖ్యలు ఉండవు

80. ఉత్తరాఖండ్‌లో డెహ్రాడూన్‌లో నెలకొల్పిన భూకంప హెచ్చరిక సిస్టం, ఎన్ని సెకండ్ల ముందుగా భూకంపం గురించి హెచ్చరికలు జారీ చేస్తుంది, భూ కంపాలలోని పి మరియు ఎస్ తరంగాలను పసిగట్టి?
(ఏ) 2 నిమిషాలు (బి) ఒకటి నుండి 40 సెకన్లు (సి) 5 నిమిషాలు (డి) 10నిమిషాలు

81. ఫారెన్ అకౌంట్ టాక్స్ కంప్లయన్స్ యాక్ట్ (ఎఫ్ఏటిసిఏ) ప్రకారం భారతదేశంతో పాటు ఏ దేశం సంతకం చేసింది ఇటీవల?
(ఏ) యుఎస్ఏ (బి) పాకిస్తాన్
(సి) ఇజ్రాయిల్ (డి) ఇండోనేషియా

82. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఏ) త్రీరివర్స్ & ఏ ట్రీ–దిస్టోరీ ఆఫ్ అలహాబాద్ యూనివర్సిటీ : నీలంశరణ్ గౌర్ (బి) ఫాలింగ్ ఇన్ లవ్ : డొన్నాలియోన్ (సి) వాండరర్స్ ఆల్ : జాహ్నవి అఖరేకర్ (డి) పైవన్నీ

83. యురేషియన్ ఎకనామిక్ యూనియన్ (ఇఇయు)లోగల దేశాలేవి?
(ఏ) రష్యా, బెలారస్ (బి) కజకిస్తాన్, కిర్గిస్తాన్
(సి) ఆర్మేనియా (డి) పైవన్నీ

**జవాబులు (ఆగస్టు 2015)**

| | | | |
|---|---|---|---|
| 1 – డి | 22 – సి | 43 – బి | 64 – ఏ |
| 2 – ఏ | 23 – ఏ | 44 – ఏ | 65 – డి |
| 3 – బి | 24 – బి | 45 – డి | 66 – డి |
| 4 – ఏ | 25 – బి | 46 – డి | 67 – ఏ |
| 5 – బి | 26 – డి | 47 – ఏ | 68 – బి |
| 6 – ఏ | 27 – ఏ | 48 – ఏ | 69 – డి |
| 7 – బి | 28 – ఏ | 49 – ఏ | 70 – ఏ |
| 8 – ఏ | 29 – డి | 50 – ఏ | 71 – డి |
| 9 – ఏ | 30 – డి | 51 – డి | 72 – డి |
| 10 – డి | 31 – డి | 52 – డి | 73 – ఏ |
| 11 – డి | 32 – డి | 53 – ఏ | 74 – డి |
| 12 – సి | 33 – డి | 54 – ఏ | 75 – డి |
| 13 – డి | 34 – ఏ | 55 – డి | 76 – సి |
| 14 – డి | 35 – బి | 56 – డి | 77 – బి |
| 15 – బి | 36 – ఏ | 57 – డి | 78 – డి |
| 16 – డి | 37 – బి | 58 – ఏ | 79 – ఏ |
| 17 – బి | 38 – బి | 59 – డి | 80 – బి |
| 18 – ఏ | 39 – బి | 60 – డి | 81 – ఏ |
| 19 – డి | 40 – ఏ | 61 – బి | 82 – డి |
| 20 – డి | 41 – డి | 62 – ఏ | 83 – డి |
| 21 – డి | 42 – ఏ | 63 – బి | |

# దర్పణం

## స్వచ్ఛంద వేటు




కేంద్ర ప్రభుత్వం ఇటీవల 4470 స్వచ్ఛంద సంస్థల లైసెన్సులను రద్దు చేసింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, ఎస్కార్ట్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ వంటి ఎన్నో ప్రఖ్యాత సేవాసంస్థలు వీటిలో ఉన్నాయి. ఈ సంస్థలన్నీ సక్రమంగా తమ ఆదాయ / వ్యయ పద్దులను ఆడిట్ చేసి ప్రభుత్వానికి సకాలంలో సమర్పించకపోవడమూ, ఇతర తప్పుల వల్ల సమగ్ర విధాన ప్రక్రియలో ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల, ఈ సంస్థలేవీ ఇకపై విదేశాల నుండి నిధులను పొందలేవు. గత ఏప్రిల్‌లో ఇవే కారణాలతో తొమ్మిది వేల సంస్థల లైసెన్సులను రద్దు చేశారు.

## గతిమాన్ ఎక్స్‌ప్రెస్




జూన్ నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశంలోని అత్యంత వేగవంతమైన రైలును ప్రారంభించారు. ఆగ్రా – ఢిల్లీ ల మధ్య నడిచే ఈ రైలు గంటకు 120 కిమీ వేగంతో నడుస్తూ, ఢిల్లీ నుండి ఆగ్రాకు ఒక గంటా 45 నిమిషాలలో చేరుతుంది. ఇప్పటివరకూ వేగంగా నడుస్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రెండు గంటల సమయం తీసుకుంటున్నది. ఇంత వేగంగా నడిచే ఈ రైలు బోగీలు ఒక్కొక్కటి 2.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నారు. టికెట్ ధర ఎగ్జిక్యూటివ్ క్లాస్ రూ. 1365/– లు వాతాను కూలిత ఛైర్ రూ. 690లుగా నిర్ణయించారు. మన రాష్ట్రంలోని సికింద్రాబాద్ – నాగాపూర్ / వ యంబై సికింద్రాబాద్ – చెన్నైలతో సహా మొత్తం మరో తొమ్మిది మార్గాలలో ఈ అత్యంత వేగవంతమైన రైళ్ళను త్వరలో ప్రారంభిస్తారు.

## పోస్టల్ డెబిట్ కార్డులు


ఇంతవరకూ మనకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు జారీచేసే డెబిట్ / క్రెడిట్ కార్డుల గురించి తెలుసు. ఇక ఇపుడు తపాలా శాఖ కూడా ఇలాంటి డెబిట్ కార్డులను జారీ చేయనున్నది. “రూపే” సౌకర్యంతో ఉండే ఈ కార్డులు ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకము వంటి పథకాల లబ్దిదారులకు ప్రయోజనం కలిగిస్తాయి. దేశవ్యాప్తంగా పోస్టు ఆఫీసు పొదుపు ఖాతాలు 1.5కోట్లు ఉన్నట్లు అంచనా. ఈ ఖాతా దారులందరికీ ఈ డెబిట్ కార్డులను త్వరలో అందచేస్తారు.

## ఈ - బస్తా




కొన్నాళ్ళ క్రితం, చండీగడ్‌లోని ప్రముఖ వ్యంగ్య నటుడు స్వర్గీయ జస్పాల్ భట్టీ నగరంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఒక ర్యాలీ నిర్వహించాడు. దీని ఉద్దేశ్యమేమంటే ఎల్‌కేజీ / యుకెజి చదివే ప్రతి బాల బాలికలకూ ఒక గోతం బస్తా (పుస్తకాలను స్కూలుకు తీసుకువెళ్ళడానికి) ఇప్పించమని! ఈ బాధాకరమైన దుస్థితి నుండి భావి భారత పౌరులని రక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రవేశపెడుతున్నది. ఈ బస్తా గా పిలిచే ఈ పథకంలో పిల్లలకు ఈ నోట్ బుక్కులూ, ల్యాప్‌టాప్‌లు అందచేస్తారు. దీనితో ఇక నిజమైన పుస్తకాలను బడికి తీసుకెళ్ళే అవసరం లేకుండా, అన్నీ సబ్జెక్టులు పాఠ్యాంశాలూ, వాటి రిఫరెన్సులతో కూడా పిల్లలకు అందుబాటులోకి వస్తాయి. మొబైల్ యాప్‌లో www.ebasta.inకూడా లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.


## పరుగులు తీస్తున్న వృద్ధి రేటు




అంతర్జాతీయ ఆర్థిక అంచనాలను రూపొందించే ప్రఖ్యాత సంస్థ పీచ్ అంచనాల ప్రకారం 2015 వ సంవత్సరంలో మన దేశం చైనాను అధిగమించి, 7.8శాతం వృద్ధి రేటును నమోదు చేస్తుంది. అలాగే, రానున్న వరుస రెండు సంవత్సరాలలో వరుసగా ఎనిమిది శాతం 8.1శాతం వృద్ధిరేటును నమోదు చేస్తుందని అంచనా! ఈ సంవత్సరం ప్రపంచ వృద్ధిరేటు 2.4శాతం పెరుగుతుందని కూడా ఈ సంస్థ అంచనా.

### మొబైల్ మార్కెట్లో రెండో స్థానానికి భారత్

ప్రపంచ మొబైల్ మార్కెట్‌లో 2017 నాటికి అమెరికాను దాటి భారత్‌రెండో స్థానానికి చేరుకుంటుందని పలు సర్వేలు



అంచనా వేస్తున్నాయి. నానాటికీ పెరుగుతున్న స్మార్ట్ ఫోన్ల వినియోగంలో మొదటి మూడు స్థానాల్లో చైనా, అమెరికా, భారత్‌లు ఉన్నాయి. 2017 సంవత్సరానికి అమెరికాను అధిగమించి భారత్ రెండో స్థానానికి చేరుతుందని అంతర్జాతీయ సర్వేలు పేర్కొన్నాయి. 2015లో ప్రపంచ వ్యాప్తంగా 1.5 బిలియన్ల స్మార్ట్ ఫోన్ల అమ్మకాలు జరుగుతాయనీ, అది 2017 నాటికి 1.7 బిలియన్లకు చేరుతుందని అంచనా,. నానాటికీ పెరుగుతున్న స్మార్ట్ ఫోన్ల వినియోగం కారణంగా దేశంలో మొబైల్ మార్కెట్ దినదినాభివృద్ధి చెందుతోంది.

### సహస్రాబ్ది లక్ష్యాలు

సహస్రాబ్ది లక్ష్యానికన్నా నాలుగు సంవత్సరాలు ముందుగా అంటే 2011లోనే మన దేశం పేదరిక శాతాన్ని 49.4 శాతం నుండి 24.7 శాతానికి అంటే దాదాపు సగానికి తగ్గించగలిగింది. ఈ లక్ష్యాల ప్రకారం రోజుకు ఒకటింబావు డాలరు కన్నా తక్కువ మొత్తంతో బతుకు గడుపుతున్నవారు పేదలు, అయితే ఈ విజయం మన పొరుగున ఉన్న చిన్న దేశాలు శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్‌ల కంటే తక్కువే! ప్రపంచంలోని మొత్తం పోషకాహారలేమితో బాధపడుతున్న వారిలో 25శాతం మంది మన దేశంలోనే ఉన్నారట.

### దేశంలోనే అతిపెద్ద సొరంగం




దేశంలోనే అతి పెద్ద సొరంగంగా రోడ్ మార్గాన్ని కేంద్ర ఉపరితల రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కారీ జమ్ము కాశ్మీర్‌లోని ఉద్దంపూర్‌లో ఈనెలలో ప్రారంభించారు. జమ్ము నుండి శ్రీనగర్ మార్గంలో ఈ సొరంగం 30 కిలోమీటర్ల పొడవునా ఉంటుంది.

### ప్రధానమంత్రి స్నేహబంధన్ బీమా పథకం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం మూడు సామాజిక బీమా పథకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. అవి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన మరియు అటల్ పెన్షన్ యోజన ఈ మూడు పథకాలకూ ప్రీమియంల చెల్లింపుకు కేంద్రం మరొక పథకాన్ని ప్రధానమంత్రి స్నేహ బంధన్ బీమా పథకం పేరుతో ఆగస్టు నెలలో ప్రారంభించనున్నది. రక్షాబంధనం స్ఫూర్తితో పేదలకు ఈ బీమా పథకాల లబ్ధిని చేకూర్చే లక్ష్యంతో వాటి ప్రీమియం మొత్తాలను రూ. 201, రూ. 351, రూ. 501 మొత్తాలను బహుమతి చెక్కుల రూపంలో అందచేస్తారు.

### జాతీయ ఉద్యోగ సేవ కార్యక్రమం

ఇంతవరకూ మనకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలకు సేవలందించే సంస్థలు ఏజన్సీల గురించి తెలుసు. ఇప్పుడు అటువంటిదే ప్రభుత్వోద్యాగాలకు ప్రభుత్వంచే నిర్వహించబడే సంస్థ ఒకటి ఉనికి లోకి రానున్నది. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉద్యోగ




సేవా కార్యక్రమం పేరుతో ఒక వినూత్న సేవ వినియోగంలోకి రానున్నది. మాన్‌స్టర్ డాట్‌కామ్, నౌక్రి డాట్‌కామం. షైన్ డాట్‌కామ్ వంటి సంస్థల తీరులో ఈ ఎన్‌సిఎస్ ప్రభుత్వోద్యాగాల వివరాలను జాతీయ కార్మిక ఉపాధి కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు అందిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగాలకోసం రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, శిక్ష వంటి సేవలను అందచేస్తారు. పూర్తి పారదర్శకతతో పనిచేసే ఈపోర్టల్ రానున్న కాలంలో మొబైల్ ఫోన్‌లో కూడా అందుబాటులోకి వస్తుంది.

### తుది దశలో ప్రపంచ మొదటి మలేరియా వాక్సిన్

మస్కిరిక్స్ పేరుతో ప్రపంచ మొదటి మలేరియా నిరోధక వాక్సిన్ తుది దశ ప్రయోగాలలో ఉన్నది. దాదాపు మూడు దశాబ్దాల ప్రయోగాల తరువాత ఈ వాక్సిన్‌కు లండన్‌లోని యూరోపియన్ మెడిసిన్ ఏజన్సీ పచ్చజెండా ఊపింది. వచ్చే నవంబర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ తన ప్రమాణాలను పరిశీలించి ఈ వాక్సిన్‌కు అనుమతి ఇస్తుంది. ఎన్నో అభివృద్ధి చెందిన చెందుతున్న దేశాలలో ఒక మహమ్మారిలాగా ప్రజల ప్రాణాలతో చెలగాడమాడుతున్న ఈ మలేరియా వ్యాధికి నివారణ వాక్సిన్‌ను కనుగొనడం ప్రపంచ వైద్య చరిత్రలో ఒక మైలురాయి. ఇపుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ, వివిధ దేశాలలో ఈ మందును పరీక్షించి చూసి, ప్రమాణాలను నిర్ధారించి ధరలను నిర్ణయిస్తుంది. గ్లాక్సో స్మిత్‌క్లైన్ సంస్థ ఈ పరిశోధనలకు ఇప్పటిఇరకూ 356 మిలియన్ల అమెరికన్ డాలర్లను ఖర్చు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా మలేరియా వల్ల ప్రతి సంవత్సరమూ ఆరు లక్షలకు పైగా ప్రజలు మృత్యువాత పడుతున్నారు. వీరిలో సబ్ సహరాన్ ప్రాంత దేశాలవారు, ముఖ్యంగా ఐదు సంవత్సరాల కన్నా తక్కువ వయసున్న పిల్లలు అధికం ■

## నైపుణ్య భారతం

ప్రపంచంలోనే ప్రప్రథమంగా భారతప్రభుత్వం నైపుణ్య భారతంలో భాగంగా ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని 15 జులై,2015న ఘనంగా నిర్వహించింది.

**జాతీయ నైపుణ్యాభివృద్ధి మిషన్ :** భారతీయ యువతకు ఉపాధి బాటపట్టించడానికి ప్రధానమంత్రి "జాతీయ నైపుణ్యాభివృద్ధి మిషన్" (నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్)ను ప్రారంభించారు. దీని ముఖ్య ఉద్దేశం దేశంలో నైపుణ్యాభివృద్ధికి కావల్సిన ప్రొత్సాహాన్ని పెంపొందించడం. దీని సమగ్ర అమలు మరియు పూర్తి స్థాయి ఆచరణకు ఒక చట్టం ఏర్పాటు చేయడం, భారతదేశంలో శిక్షితులైన నైపుణ్యంగల కార్మికులను తయారు చేయడం ద్వారా సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తుంది ఈ మిషన్.

**మిషన్ ఉద్దేశాలు :** ⇨సమగ్ర ఆచరణ చట్రం ద్వారా నైపుణ్యాభివృద్ధి చేపట్టి జీవితకా శిక్షణ నివ్వడం ఇందులో ఉన్నాయి. అలాగే ఇందులో..పాఠశాల స్థాయినుంచే నైపుణ్య విద్య ప్రవేశం, దీర్ఘకాల శిక్షణ, శిక్షణార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఉన్నాయి. ⇨పరిశ్రమలు మరియు యాజమాన్య అవసరాలకనుగుణంగా నైపుణ్య శిక్షణార్థుల సమూహాన్ని తయారు చేయడానికి ఒక సమగ్ర కార్యాచరణ రూపొందించడం. ⇨ వివిధ రంగాల అవసరాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణకు కార్యాచరణ, అలాగే దీన్ని అన్ని మంత్రిత్వ శాఖల్లో, రాష్ట్రాల్లో, ప్రైవేటు సంస్థల్లో అమలు చేయడం. ⇨ అసంఘటిత రంగం (నిర్మాణ మరియు శిక్షణలోపంతో ఉన్న ఇతర రంగాల)లో సామర్థ్యపెంపు, అసంఘటిత రంగంలో నైపుణ్యాభివృద్ధికి గుర్తింపుకు నోచుకోని రంగాల గుర్తింపు, వాటిని సంఘటిట రంగాలవైపు మరల్చడం. ⇨ ఉన్నతస్థాయి, సమగ్ర దీర్ఘకాల నైపుణ్యాభివృద్ధికి కృషి, అంతర్జాతీయ స్థాయి శిక్షణ ప్రమాణాలు రూపొందించడం ద్వారా పూర్తి స్థాయి నైపుణ్య కార్మికులను తయారు చేయడం. ⇨ నైపుణ్యాభివృద్ధి వాతావరణంలో ప్రమాణిక స్థాయి శిక్షకులను తయారు చేయడానికి ఉన్నతస్థాయి శిక్షకు శిక్షణా సంస్థను ఏర్పాటు చేయడం. ⇨ ప్రస్తుత ప్రజామౌలిక సదుపాయాలను మరియు పరిశ్రమలను నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య పెంపువైపు ప్రొత్సాహించడం. ⇨ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించి విదేశీ ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి కృషి. ⇨ క్రెడిట్ మార్పిడి విధానం ద్వారా సాధారణ విద్య, వృత్తి విద్య మధ్య అనుసంధానం చేపట్టడం. ⇨ కేంద్రీకరణ, పరస్పర అవగాహన ద్వారా కేంద్ర మంత్రిత్వశాఖలు, విభాగాలు, రాష్ట్రాలు, అమలు ఏజెన్సీ మధ్య నైపుణ్యాభివృద్ధికి కృషి. ⇨ ప్రత్యేక ఔట్ రీచ్ కార్యక్రమాలు, క్షిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా సమాజంలో వెనుకబడిన వర్గాల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి. ⇨ నైపుణ్య శిక్షణ యొక్క అవసరాన్ని యువకుల్లో అవగాహన కల్పిండం. ⇨ దేశంలో నైపుణ్య కార్మిక శక్తి డిమాండ్, సప్లయి మధ్య ఒక వారధిగా పనిచేయడం. ⇨ ఎల్.ఎం.ఐ.ఎస్.ద్వారా దేశంలో నైపుణ్యాభివృద్ధిపై చేపడుతున్న కార్యక్రమాల సమాచారం అందుబాటులో ఉంచడం. ⇨ అలాగే రాష్ట్రాల్లో ప్రస్తుతం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యమ్రాల సామర్థ్యాన్ని పరిశీలించడం.

**జాతీయ నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక విధానం-2011 :** జాతీయ నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక విధానం-2015ను ఇటీవల ప్రధానమంత్రి ప్రారంభించారు. దీని ముఖ్య ఉద్దేశ్యం 'పెద్ద సంఖ్యలో నైపుణ్యాభివృద్ధికి ఒక వాతావరణాన్ని రూపొందించడం, ఉన్నత ప్రమాణాల ద్వారా నవకల్పనును ప్రోత్సహించడం ద్వారా ఉపాధిని కల్పించే వ్యవస్థాపక రంగాన్ని ప్రొత్సాహించడం ద్వారా, సుస్థిర ఉపాధిని దేశ ప్రజకు అందించడం'. ఈ మిషన్ నైపుణ్య అభివృద్ధికి కావాల్సిన అవశ్యకతను రూపొందిస్తోంది. కావల్సిన పరిమాణంలో ఖచ్చిత, సమగ్ర ప్రతిస్పర్థను కల్పిస్తుంది. రంగాకు అనుగుణంగా నైపుణ్య మానవవనరును సరఫరా చేయడం, అంతర్జాతీయ, జాతీయ ప్రమాణాను రూపొందించడం, ఒక నైపుణ్య వాతావరణ సృష్టించడం ద్వారా నవకల్పనను, ఉత్పాదకతను పెంపొందించడం, సుస్థిర ఉపాధికి సమగ్ర వ్యవస్థాపక ఆర్థిక వ్యవస్థను తయారు చేయడంద్వారా ఉద్యోగితను పెంపొందించడం. ఈ విధానం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే ప్రతి వ్యక్తికి తన శక్తి సామర్థ్యాలను గుర్తేరిగేలా చేయడం ద్వారా జీవితకాల ఉపాధిని అందుకోగల స్థాయికి తీసుకుని వెళ్లడం.దీర్ఘకాల శిక్షణ ద్వారా పోటీ ప్రపంచంలో సమర్థ శిక్షణ, రుణ సేకరణ మరియు బదిలీ ద్వారా సామర్థ్య పెంపు. ఒక వ్యక్తి ఉన్నత స్థాయికి చేరడం ద్వారా సమాజం, దేశం కూడా ఉన్నత స్థాయికి చేరుకుంటాయి. వ్యవస్థాపక విధానం ద్వారా దేశంలో వ్యవస్థాపక కార్యాచరణ చట్రం రూపొందించి వ్యవస్థాపకతను సమతుల్యం చేయడంతో పాటు, సామర్థ్య పెంపు ద్వారా దేశంలో వ్యవస్థాపక రంగాన్ని బలోపేతం చేయడం. ఇందులో...⇨ వ్యవస్థాపక సంప్రదాయం, దాని ఆకాంక్షను పెంపొందించడం. ⇨ మధ్యవర్తిత్వం ద్వారా వ్యవస్థాపకత ఉత్తమ ఉపాధి మార్గంగా ప్రొత్సాహం కల్పించడం. ⇨ సలహాదారుడిగా మరియు నెట్‌వర్క్ ఏర్పాట్ల ద్వారా సమర్థ వ్యవస్థాపకతను ప్రోత్సహం కల్పించడం. ⇨ నవకల్పనలను, సామాజిక వ్యవస్థాపకత ద్వారా సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజ అవసరాలను తీర్చడం. ⇨ వ్యాపార ప్రారంభానికి ఉన్న సంస్థాగత ఒడిదుడుకులను తగ్గించడానికి కృషి. ⇨ మహిళల్లో వ్యవస్థాపకతను ప్రొత్సాహించడం. ⇨ సమజిక, భౌగోళికంగా అభివృద్ధి చెందని వర్గాలను దృష్టిలో ఉంచుకుని వారిలో వ్యవస్థాపకతను పెంపొందించడం. అంటే ఎస్.సి., ఎస్.టి., ఒబిసి, మైనారిటీ, వికలాంగుల్లో వ్యవస్థాపికతను ప్రోత్సాహించడం. ■

# సమ్మిళిత వృద్ధికి ఉపకరణంగా వ్యవసాయం

**దేశంలో 1960 దశకం తొలినాళ్లలో దుర్భిక్షం ఏర్పడే సూచనలు కనిపించినప్పుడు నాటి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జాతిని హరిత విప్లవం వైపు విజయవంతంగా నడిపించారు. ఆ విప్లవం నుంచి లబ్ధిపొందిన భారతదేశం ప్రధాన పంటల ఉత్పత్తిలో పరుగులు తీసి అనేక ఆహార ధాన్యాల సాగులో స్వయం సమృద్ధి సాధించింది. అయితే... దాని పరిధి, బాధ్యతలు కేవలం సాగు విస్తీర్ణం పెంపు, అధిక దిగుబడి అనే ఏకైక లక్ష్యానికే పరిమితమయ్యాయి. అంతే తప్ప సామాజిక మార్పు, సమ్మిళిత వృద్ధికి ఉపకరణంగా ఎన్నడూ దీన్ని పరిగణించ లేదు.**

భారత దేశంవంటి వ్యావసాయిక సమాజంలో వ్యవసాయం కేంద్రంగా లేని ఏ అభివృద్ధి ప్రణాళికైనా విజయవంతం కాబోదనడంలో సందేహం లేదు. ప్రపంచంలోని అతిపెద్ద ఆహార వినియోగ దేశాల్లో మనదీ ఒకటి కావడంవల్ల మన ఆహార భద్రత కోసం వ్యవసాయ రంగాన్ని ఉజ్వలంగా, సజీవంగా ఉంచుకోవడం అవశ్యం. అంతేగాక దేశంలో సగానికిపైగా జనాభా సామాజిక, ఆర్థిక... చివరకు సాంస్కృతిక జీవనం ఈ రంగం స్థితిగతులతో ముడిపడిందన్నదీ వాస్తవం. కానీ, జాతికి జీవగర్రలాంటి మన వ్యవసాయ రంగం నేటి దయనీయ స్థితికి దిగజారిందన్నదీ నమ్మశక్యంగాని మరో వాస్తవం. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాతినుంచీ పరిణామాలను గమనిస్తే దీనికి మూలమేమిటో తెలుసుకోవచ్చు. "పరిశ్రమలకే నా ప్రాధాన్యం, ఉక్కు కర్మాగారాలు తదితరాలకే నా ప్రాథమ్యం. కానీ... ఏది ఎంత భారీ పరిశ్రమ అయినా సరే, వ్యవసాయమే అన్నిటికన్నా ప్రధానమైనదని నేను నొక్కి చెబుతున్నాను" అన్నారు మన ప్రథమ ప్రధాని, ఆధునిక కాలంలో అత్యంత గొప్ప దార్శనికుడుగా వాసికెక్కిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ. ఇదేదో సాధారణ ప్రకటన కాదు; ఆ తర్వాత ఏడు దశాబ్దాలుగా వ్యవసాయంపై మన జాతీయ విధానాలకు అది ప్రవేశికగా నిలిచింది. నాటినుంచీ మారుతూ వచ్చిన ప్రభుత్వాలు వ్యవసాయ రంగ ప్రాధాన్యం గురించి పదేపదే వల్లెవేస్తూ విసుగెత్తించాయి తప్ప విధాన నిర్ణయాలకు వచ్చేసరికి దాని ఖర్మకు దాన్ని వదిలేశాయి. ఆధునిక భారతానికి పరిశ్రమలే దేవాలయాలని నెహ్రూ సాధికారికంగా ప్రకటించిన తర్వాత స్వతంత్ర భారతంలో వ్యవసాయం ఓ నిరర్థక, నిష్ప్రయోజన అంశంగా మారి భవిష్యత్తు కోల్పోయింది.

వ్యవసాయ రంగంపై ఈ ఉదాసీనత రెండు పరిణామాలకు దారితీసింది. ఒకటి.. ఉత్పాదకత, పంటల వైవిధ్యంలో పరిస్థితి దిగజారుతూ వచ్చింది. రెండోది... మూడింట రెండువంతుల జనాభాలో సామాజిక–ఆర్థిక కొలమానాలకు సంబంధించిన ప్రతి అంశంలోనూ నిరుత్సాహం ఆవరించింది. వ్యవసాయమే వారి జీవనోపాధికి ఏకైక మార్గం

**భువన్ భాస్కర్,** ఆర్థిక, అభివృద్ధి అంశాల పాత్రికేయుడు

కావడం... మౌలికంగా అవసరమైన నీటిపారుదల, పంట నిల్వ-విక్రయ సౌకర్యాలు, పరిశోధన కేంద్రాలు, రుణ పరపతి, సమ్మిళిత ఆర్థిక వృద్ధివంటివి లోపించడం ఇందుకు కారణాలు. ఇవన్నీ వారి ఆదాయ స్థాయిలపై ప్రభావం చూపి అంతిమంగా పట్టణ, గ్రామీణ భారతాల మధ్య అగాధం పెరగడానికి దారితీశాయి. దేశంలో 1960 దశకం తొలినాళ్లలో దుర్భిక్షం ఏర్పడే సూచనలు కనిపించినప్పుడు నాటి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జాతిని హరిత విప్లవం వైపు విజయవంతంగా నడిపించారు. ఆ విప్లవం నుంచి లబ్ధిపొందిన భారతదేశం ప్రధాన పంటల ఉత్పత్తిలో పరుగులు తీసి అనేక ఆహార ధాన్యాల సాగులో స్వయం సమృద్ధి సాధించింది. అయితే... దాని పరిధి, బాధ్యతలు కేవలం సాగు విస్తీర్ణం పెంపు, అధిక దిగుబడి అనే ఏకైక లక్ష్యానికే పరిమితమయ్యాయి. అంతే తప్ప సామాజిక మార్పు, సమ్మిళిత వృద్ధికి ఉపకరణంగా ఎన్నడూ దీన్ని పరిగణించ లేదు. ఫలితంగా పొలాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం మితిమీరింది. దీనివల్ల కమతాల ఉత్పాదకత క్షీణించడంతోపాటు సాగు వ్యయం కూడా పెరిగిపోయింది. ఏటికేడు రసాయనాల వినియోగం క్రమంగా పెంచుకుంటూ వచ్చాం. ఈ నేపథ్యంలో నాడు హరిత విప్లవం వల్ల అత్యంత లబ్ధిపొందిన పంజాబ్ రాష్ట్రం నేడు పెరిగిపోయిన సాగు వ్యయం, విషపూరిత భూములు, ఉత్పాదకత క్షీణత సమస్యలను ఎదుర్కొంటోంది.

అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వాన ఎన్‌డీఏ ప్రభుత్వం 2003లో తొలిసారిగా భారత వ్యవసాయంలో పంట కోత తర్వాతి పరిస్థితుల ప్రాధాన్యాన్ని గుర్తించింది. ఆ మేరకు అత్యంత జాగ్రత్తవహిస్తూ వ్యవసాయ ఉత్పత్తుల విపణి సంఘాల (అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ) చట్టాన్ని తెచ్చింది. కానీ, కాలక్రమంలో ఈ సంఘాలపై స్థానిక రాజకీయ నాయకుల పట్టు పెరిగి రైతుకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యతను గాలికొదలడం మొదలైంది. ప్రస్తుతం ఈ వ్యవస్థపై చర్చ సాగుతున్న నేపథ్యంలో కూరగాయలు, పండ్లను ఏపీఎంసీ చట్టంలోని పంటల జాబితా నుంచి కేంద్ర ఆర్థిక శాఖ తప్పించింది. సామాజిక మార్పు, సమ్మిళిత వృద్ధి దిశగా తీసుకున్న మరొక కీలక విధాన నిర్ణయం పంటలకు బీమా కల్పించడం. అయితే, ఈ విషయంలో ఇప్పటిదాకా ఎన్నో చర్యలు తీసుకున్నా అవి విజయవంతమైన సూచనలేవు. ఈ పరిస్థితుల నడుమ భారత వ్యవసాయ చరిత్రలో తొలిసారిగా ఈ రంగాన్ని దేశానికి తిండిపెట్టేదిగా మాత్రమే కాకుండా జాతి సామాజిక-ఆర్థిక సూచీలను ఊర్ధ్వముఖంగా పయనింపజేయగల మౌలిక ఉపకరణంగా కేంద్ర ప్రభుత్వం పరిగణించడం ప్రారంభించింది. ఈ దిశగా తన దృక్పథాన్ని రుజువు చేసుకుంటూ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడంతోపాటు అభివృద్ధి పథకాలనూ ప్రవేశపెట్టింది. వీటిని విజయవంతంగా అమలు చేయగలిగితే భారత వ్యవసాయ రంగం మూలాలు బలోపేతమై అన్నదాతకు అపార ప్రయోజనం కలుగుతుందని ఆశించవచ్చు.

**ప్రభుత్వ చర్యలు, పథకాల విశ్లేషణ**

జాతీయ వ్యవసాయ విపణి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తాజా చర్య... దిగుబడి అనంతర పంటల నిర్వహణ పరిస్థితులను ఇది శాశ్వతంగా మార్చేయగలదు. ఈ మేరకు జాతీయ వ్యవసాయ విపణిని ప్రోత్సహించే కేంద్ర ప్రభుత్వరంగ పథకానికి ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఈ ఏడాది జూలై 2న వ్యవసాయ-సాంకేతిక మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేసింది. దీనికింద దేశంలోని 585 టోకు విపణులను ఒక్కటిచేస్తూ ఆన్‌లైన్ వేదికను ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీనికిగాను 2015-16 నుంచి 2017-18 వరకు మూడేళ్లకు రూ.200 కోట్లు కేటాయించింది. దీన్ని గురించి వివరిస్తూ- “ఇకపై ఏకస్థాన రుసుము (లెవీ) విధింపుతో రాష్ట్రం మొత్తానికీ వర్తించే ఒకే లైసెన్స్ ఉంటుంది. అత్యుత్తమ ధర అన్వేషణ కోసం ఎలక్ట్రానిక్ వేలం నిర్వహిస్తారు. దీని ప్రభావంతో రాష్ట్రం మొత్తం ఒకే విపణిగా మారిపోయి, చిల్లర విపణులన్నీ అంతర్ధానమవుతాయి'' అని సీసీఈఏ సమావేశం తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశంలోని 250 మండీలు ఈ ప్రణాళిక కిందకు వస్తాయి. ఆ తర్వాత 2016-17లో 200, 2017-18లో 135 వంతున మొత్తం మండీలన్నీ ఎన్ఏఎం కిందకు రావాలన్నది లక్ష్యం. ఒక్కసారి ఎన్ఏఎం అన్నది స్థిరపడితే ఆయా రాష్ట్రాల్లో మధ్యవర్తుల ప్రమేయం అన్నది లేకుండా వ్యవసాయ ఉత్పత్తులన్నీ ఏకఛత్రం కిందకు బదిలీ అవుతాయి. రైతుకు విస్తృత విపణి అందుబాటులోకి వస్తున్నందువల్ల పరిమిత విపణికి బందీగా మిగిలే దురవస్థ తప్పుతుంది. రాష్ట్ర, జాతీయ స్థాయి విపణుల ఏకీకరణవల్ల అన్నదాతకు మరింత మంచి ధర లభించే అవకాశాలు పెరుగుతాయి. దాంతోపాటు సరఫరా గొలుసు మెరుగుపడి, వృథాను అరికడుతూ ఉమ్మడి వేదికగా ఏకీకృత జాతీయ విపణి సృష్టికి మార్గం సుగమం కాగలదని ప్రభుత్వం చెబుతోంది.

విస్తృత విపణి అందుబాటులో లేనందువల్ల రైతుకు అందాల్సిన లాభంలో అధికశాతం మింగేస్తున్న దళారీ వ్యవస్థ సమస్య

ఏకీకృత వేదికతో శాశ్వతంగా పరిష్కారమవుతుంది. ఈ దిశగా కర్ణాటకలో ఇప్పటికే 155 విపణి (మార్కెట్ యార్డు)లకుగాను 55 విపణులు ఏకీకృత లైసెన్స్ వ్యవస్థ కిందకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రీయ ఈ-మార్కెట్స్ సర్వీసెస్ లిమిటెడ్ 50:50 భాగస్వామ్యంగల సంస్థ నేషనల్ కమాడిటీస్ ఎక్స్ఛేంజి ఎన్‌సీడీఈఎక్స్ అనుబంధ ఎన్ఈఎంఎల్ ఈ మేరకు ముందంజవేశాయి. జాతీయ వ్యవసాయ విపణికి దీన్ని నమూనాగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం 2014-15 ఆర్థిక అధ్యయనంలో సూచించింది. దీంతోపాటు ఈ వ్యవస్థ పనితీరును పరిశీలించేందుకు 23 రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్ ఈ నెల రెండోవారంలో అక్కడికి తీసుకెళ్లారు.

**భూసార కార్డుల పథకం** : గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆ రాష్ట్రంలో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసిన నరేంద్ర మోదీ, లోక్‌సభ ఎన్నికలలో దీన్నీ ఓ ప్రచారాంశంగా మలచుకున్నారు. ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టాక ఎన్డీఏ ప్రభుత్వ తొలి బడ్జెట్‌లోనే ఈ పథకానికి చోటు దక్కింది. దీనికోసం ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ రూ.156 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.56 కోట్లను దేశవ్యాప్తంగా 100 సంచార భూసార పరీక్ష ప్రయోగశాలల ఏర్పాటుకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి 19న రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్‌లో 'భూసార కార్డు'ల పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. దేశంలో పేదరిక నిర్మూలనకు వ్యవసాయాన్ని ఒక ఉపకరణంగా తన ప్రభుత్వం పరిగణిస్తున్నదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ మార్గసూచికి అనుగుణంగా ముందడుగు వేస్తూ ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపును రూ.200 కోట్లకు పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 28న కేంద్ర వ్యవసాయ శాఖ జారీచేసిన ఆదేశాల ప్రకారం 2015-16లో దేశవ్యాప్తంగా 2.53 కోట్ల మట్టి నమూనాలను సేకరిస్తారు. ఈ పరీక్షలకయ్యే వ్యయంలో రాష్ట్రాలు 50 శాతం భరించాలి. నమూనాల సేకరణ, విశ్లేషణతోపాటు రసాయన నిపుణులు, సిబ్బందిసహా రైతుల శిక్షణకే కాకుండా ఐసీటీలు, సదస్సులు నిర్వహిస్తారు. వీటికోసం రూ.192 కోట్లు ఖర్చు కానుండగా అందులో రూ.96 కోట్లు కేంద్రం భరిస్తుంది. ఈ పథకం కింద మూడేళ్లలో దేశంలోని 14.5 కోట్ల మంది రైతులకు భూసార కార్డులు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే భూసార కార్డుల పథకం అమలవుతున్నా దీన్ని ఓ జాతీయ ఉద్యమ రూపంలో కొనసాగించే కృషి ఇంకా ప్రారంభం కాలేదు. వ్యవసాయ రంగం సుస్థిర అభివృద్ధికి ఇదొక ప్రశంసనీయ పథకం. దీనికింద రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించి, ప్రయోగశాలల్లో పరీక్షిస్తారు. ఆ తర్వాత ఆస్పత్రులు ఇచ్చే ఆరోగ్య కార్డుల తరహాలో రైతులకు భూసార కార్డులు అందుతాయి. మట్టి నమూనాల్లోగల మూల పదార్థాలు, నేలలోని లోపాల వివరాలు ఈ కార్డులో నమోదై ఉంటాయి. ఈ కార్డుల ఆధారంగా యూరియా, డీఏపీ లేదా మరేదైనా ఇతర ఎరువులను గుడ్డిగా ఉపయోగించకుండా తన పొలంలో కచ్చితంగా వాడాల్సినవేమిటో రైతు నిర్ణయించుకోగలడు. దీనివల్ల సాగు వ్యయం తగ్గడమే కాకుండా భూసార పరిరక్షణ సాధ్యమవుతుంది. అలాగే తన భూమి ఏ పంటకు అనువైనదో కూడా రైతు నిర్ణయించుకునేందుకు ఈ కార్డులు దోహదపడతాయి.

**ప్రధాన మంత్రి సాగునీటి పథకం** : ప్రతి కమతం సాగు, జల వినియోగ సామర్థ్యం మెరుగుదల లక్ష్యంగా 2015-16 బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో సూక్ష్మ నీటి పారుదల, పరీవాహక ప్రాంతాల అభివృద్ధితోపాటు ప్రధానమంత్రి సాగునీటి పథకం (పీఎంకేఎస్‌వై) అమలు చేస్తారు. గడచిన ఏడాది నీటి పారుదల, పరీవాహకా (వాటర్‌షెడ్)ల నిర్వహణ పథకాల కోసం రూ.5,623 కోట్లు కేటాయించారు. బీజేపీ ఎన్నికల హామీలలో ప్రతి పొలానికీ నీరు ప్రధానమైనది కావడంతో దానికి అనుగుణంగానే పీఎంకేఎస్‌వైకి అరుణ్ జైట్లీ ప్రాధాన్యమిచ్చారు. ఈ మేరకు 2014-15కుగాను సమర్పించిన తన తొలి కుదింపు బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించారు. కానీ, పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం జూలై 2న సమావేశమై ఐదేళ్లలో (2015-16 నుంచి 2019-20) ఈ పథకం కోసం రూ.50వేల కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపింది.

దేశంలో 1997-98నాటికి ఆహార ధాన్యాలు సాగయ్యే నీటి సదుపాయంగల భూ విస్తీర్ణం 40.5 శాతమే అయినా, అన్నిరకాల ఆహార ధాన్యాల ఉత్పాదకత 56 శాతంగా ఉంది. ఈ పథకం ప్రాముఖ్యం, ప్రమాణాలను లెక్కించడానికి ఈ ఒక్క వాస్తవం చాలు. సాగునీటి సదుపాయానికి ఇంతటి ప్రాధాన్యం ఉన్నా తదుపరి ప్రభుత్వాలు ఏ మేరకు విస్మరించాయో దీన్నిబట్టి అర్థమవుతుంది. ఈ నిర్లక్ష్యం పర్యవసానంగా 2000-01 నుంచి 2011-12 మధ్య నీటిపారుదల సౌకర్యంగల

| ప్రణాళిక | వ్యవధి | నీటిపారుదలకు నిధుల కేటాయింపు శాతం |
|---|---|---|
| ఐదో ప్రణాళిక | 1974-78 | 23.25 |
| ఆరో ప్రణాళిక | 1980-85 | 20.85 |
| ఏడో ప్రణాళిక | 1985-90 | 11.85 |
| ఎనిమిదో ప్రణాళిక | 1992-97 | 18.48 |
| తొమ్మిదో ప్రణాళిక | 1997-2002 | 14.93 |

భూ విస్తీర్ణం పెరుగుదల కేవలం 5.8 శాతానికి పరిమితమైంది. ప్రణాళిక సంఘం అధికారిక గణాంకాల ప్రకారం నికర సాగు విస్తీర్ణం 40.5 నుంచి 46.34 శాతానికి చేరటానికి పన్నెండేళ్లు పట్టిందన్న మాట.

నీటిపారుదల రంగంలో పెట్టుబడులను క్షేత్రస్థాయిలో ఏకీకృతం చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. "ప్రతి కమతానికీ నీరివ్వడంద్వారా సాగు భూమి విస్తీర్ణం పెంచడం, సాగునీటి వృథాను అరికట్టి జల వినియోగ సామర్థ్యం మెరుగు పరచడంద్వారా కచ్చితంగా పంటకు నీరందేలా చేయడం కూడా ఇందులో భాగంగా ఉంటాయి. అలాగే నీటిపొదుపు లక్ష్యంగా ప్రతి నీటిచుక్కతో పంట రాబట్టే పద్ధతులను అమలు చేయడం, జల వనరుల పునః పూరకతను పెంచడం, సుస్థిర జల సంరక్షణ విధానాలను ప్రవేశపెట్టడం మరికొన్ని లక్ష్యాలు. అంతేగాక శుద్ధిచేసిన పురపాలికల స్థాయి వాడకపు నీటిని పట్టణ వ్యవసాయంలో పునర్వినియోగించడంపై సాధ్యాసాధ్యాల అన్వేషణ, కచ్చిత నీటిపారుదల వ్యవస్థపై ప్రైవేటు పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం కూడా ప్రధానం" అని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం ప్రకటన పేర్కొంటోంది. మూడు నీటిపారుదల పథకాలను ఏకీకృతం చేసి ఒకే గొడుగు కిందకు తేవడంద్వారా నీటిపారుదల వ్యయాన్ని వికేంద్రీకరించడం ఈ పథకం ప్రాథమిక నిర్దేశం.

ఈ పథకానికి మంత్రివర్గ సంఘం ఆమోదం లభించిన తర్వాత కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడారు. "నీటి వసతి కల్పన, వినియోగం, పునరువయోగానికి సంబంధించిన మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, ఆర్థిక సంస్థలను ఒక ఉమ్మడి వేదికగా రూపొందించాల్సి ఉంది. తద్వారా నీటి చక్రంపై సమగ్ర దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుని, ఇళ్లు, పరిశ్రమలు, వ్యవసాయం తదితర అన్ని రంగాలకూ తగురీతిన నీటి కేటాయింపులు చేయాలి" అని ఆయన చెప్పారు. వీటన్నిటి దృష్ట్యా సహజంగానే దీర్ఘకాలంలో సుస్థిర జల పరిరక్షణ, పొదుపు, నీటిపారుదలకు ఈ పథకం ఒక నమూనాగా నిలిచి సామాజికాభివృద్ధికి దోహదపడుతుంది. పీఎంకేఎస్‌వైకి తోడుగా రానున్న మూడేళ్లలో జాతీయ గ్రామీణ వ్యవసాయాభివృద్ధి బ్యాంకు-నాబార్డ్ కూడా రూ.30 వేల కోట్లను సాగునీటి సదుపాయం కోసం రైతులకు రుణాలుగా ఇవ్వనుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇప్పటికే రూ.వెయ్యి కోట్లను మంజూరు చేసింది.

**ధరల స్థిరీకరణ నిధి** : ఎన్నో ఏళ్లుగా ఉల్లిపాయలు, బంగాళాదుంప ధరలలో తీవ్ర అస్థిరత ఫలితంగా రైతులు దెబ్బతింటున్నారు. ఈ కూరగాయలు త్వరగా పాడైపోయేవి కావడంతోపాటు తగిన నిల్వ సదుపాయాలు లేకపోవడమన్నది లాభార్జనపరులకు ధరలు పెంచేసే ఉపకరణంగా మారింది. ఫలితంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో ఇటు రైతులు అతి తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సి వస్తుండగా, అటు దళారులకు ఆకస్మిక లాభాలు వచ్చిపడుతున్నాయి. ఈ విపరిణామాన్ని అరికట్టే దిశగా ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం రూ.500 కోట్ల భారీ మూలధనంతో 'ధరల స్థిరీకరణ నిధి'ని ఏర్పాటు చేసింది. తదనంతర కాలంలో త్వరగా పాడయ్యే ఇతర వ్యవసాయ-ఉద్యాన ఉత్పత్తులనూ ఈ నిధి పరిధిలోకి తేనున్నారు. ప్రభుత్వవర్గాల సమాచారం ప్రకారం... ఈ ఉత్పత్తులను నేరుగా రైతుల నుంచి లేదా రైతు సంఘాల నుంచి లేదా వ్యవసాయ మండీల నుంచి కొనుగోలు చేసి హేతుబద్ధమైన ధరలతో ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. ఈ అంశంపై వ్యవసాయ శాఖ పరిధిలోని చిన్నకారు రైతుల వ్యవసాయ -వాణిజ్య సమాఖ్య విభాగం కూడా కసరత్తు చేస్తోంది. దేశవ్యాప్తంగా రైతు ఉత్పాదక సంస్థల ఏర్పాటును తప్పనిసరి చేయడంతోపాటు దేశ రాజధానిలో 'ఢిల్లీ కిసాన్ మండీ' (డీకేఎం) పేరిట ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. కొనుగోలుదారులను నేరుగా రైతు ముంగిటకు చేర్చడం దీని ప్రధాన కర్తవ్యం. డీకేఎం ఏర్పాటైన ఏడాదిలోపే వివిధ ఎఫ్‌పీవోలద్వారా వెయ్యి టన్నుల కూరగాయల అమ్మకానికి అవకాశం కల్పించింది.

**వ్యవసాయ రుణ పరపతి** : అన్నదాతకు సరళమైన నిబంధనలతో రుణ పరపతి కల్పించడమన్నది కేంద్రంలో అధికారంలో ఉండే ఏ ప్రభుత్వానికైనా అగ్ని పరీక్షే. వడ్డీ వ్యాపారుల వలలో చిక్కి రైతులు ఆత్మహత్య చేసుకుంటున్న సంఘటనలు మన దృష్టికి వస్తూనే ఉంటాయి. ఆర్థిక సహాయం పొందడంలోగల చేదు వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి ఆర్థిక సహాయ లక్ష్యాన్ని ప్రభుత్వం రూ.50వేల కోట్ల నుంచి రూ.8.5 లక్షల కోట్లకు పెంచింది.

**రైతుల కోసం దూరదర్శన్ చానెల్:** వాతావరణ పరిస్థితులు, కొత్త అవకాశాలు, సరికొత్త మార్గాలపై రైతుకు తగిన సమాచారం కరవైన పరిస్థితిని గుర్తించిన ఎన్డీఏ ప్రభుత్వం వారి అవసరాలు తీర్చడం కోసమే ప్రత్యేకంగా ఒక టీవీ చానెల్‌ను ప్రారంభించింది. దీన్ని సవ్యంగా నిర్వహిస్తే రైతులకు సమాచార అగాధాన్ని పూడ్చగల వినూత్న ఆలోచన ఇంతకన్నా మరొకటి ఉండదనడంలో సందేహం లేదు.

**కమతాల బీమా** : అన్నదాతను అన్నివిధాలా ఆదుకునే దిశగా సరికొత్త బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఈ ఏడాది జూలై 12న ప్రకటించారు. పంట రుణాలుసహా రైతు తన పొలంలో పెట్టే పెట్టుబడి మొత్తానికీ రక్షణ కల్పించడం ఈ పథకం ధ్యేయం. అయితే, ఇటువంటి వ్యవసాయ బీమా పథకాల చరిత్రను గమనిస్తే ఈ ప్రయత్నం ప్రభుత్వానికి గట్టి సవాలేనని చెప్పవచ్చు. అయితే, దీన్ని ప్రవేశపెట్టడంపై రైతులకు భరోసా ఇస్తూ- "ఇలాంటి బీమా పథకం ఉపయుక్తమైనదేగాక దాన్ని అమలు చేయడమూ సాధ్యమే. తద్వారా వివిధ ప్రతికూల పరిస్థితుల్లో నష్టపోయే రైతు- కనీసం విత్తనాలు, ఎరువులు తదితర మౌలిక వ్యవసాయ ఖర్చులనైనా కూడదీసుకోగలిగే వీలుంటుంది" అని జైట్లీ అన్నారు. ఇలాంటి పటిష్ఠ రుణ పథకాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం సఫలమైతే గ్రామీణ భారతానికి అది బలమైన సామాజిక భద్రతను ఇవ్వగలదు. కానీ, దురదృష్టవశాత్తూ ఇప్పటిదాకా ప్రవేశపెట్టిన ఇటువంటి పథకాలన్నీ దారుణంగా విఫలమయ్యాయన్నది నిష్ఠుర వాస్తవం.

**ఇక్కడ పథకాల టేబుల్ ఇన్‌సర్ట్ చేయాలి**

కొత్త వ్యవసాయ రుణ పథకంపై ప్రభుత్వ యోచన నేపథ్యంలో "మనకిప్పుడు జాతీయ బీమా పథకం ఉంది. దానికి మార్పుచేర్పులతో బీమా ఉంది. ఇక ఇప్పుడు వాతావారణ ఆధారిత బీమా రక్షణ కల్పించబోతున్నాం. ఇదీగాక తాజాగా రైతులకు ఆదాయ బీమా అన్నది నేడు కీలక చర్చనీయాంశంగా మారింది" అని రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ హెచ్.ఆర్.ఖాన్ దాన్ని గురించి రేఖామాత్రంగా వివరించారు.

**గిడ్డంగుల సదుపాయం:** దేశంలో గిడ్డంగుల ఆవశ్యకతను గుర్తించిన ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లోనే ఇందుకోసం రూ.5వేల కోట్లు కేటాయించింది. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ 2013లో ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం- సరైన గిడ్డంగుల సదుపాయం లేక ఏటా 2.1 కోట్ల టన్నుల గోధుమలు వృథా అవుతున్నాయి. మొత్తం గోధుమ ఉత్పత్తిలో ఇది 22 శాతం. ఇక పండ్లు, కూరగాయల జాతీయ ఉత్పాదకతలో వృథా 40 శాతంగా ఉంది. మొత్తం మీద ఏడాదికి మనం వృథా చేస్తున్న ఆహారధాన్యాల విలువ రూ.44వేల కోట్లు! ఈ నేపథ్యంలో 9.23 లక్షల టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యంతో గిడ్డంగులు, నిల్వ సదుపాయాల నిర్మాణానికి నాబార్డ్ సంకల్పించింది. అలాగే 2015-16కుగాను జలవనరులు, భూ అభివృద్ధి, వ్యవసాయ యంత్రీకరణ, పాడి, పౌల్ట్రీ, మత్స్య వంటి ప్రధాన రంగాలకు రూ.47,756.43 కోట్ల మేర వార్షిక రుణ పరపతి కల్పించాలని నిర్ణయించింది. గిడ్డంగుల నిర్మాణం, మార్కెట్ యార్డుల ఏర్పాటుతోపాటు పునరుత్పాదక ఇంధన వనరులు, వ్యర్థాల నిర్వహణ తదితరాల కోసం ఈ నిధులను వినియోగిస్తారు. గడచిన ఏడాది (2014-15) ఇందుకోసం కేటాయించిన నిధులు రూ.40,001.01 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది 19 శాతం పెరిగింది. దీన్నిబట్టి భారత వ్యవసాయ రంగంలో అతిపెద్ద సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, దాన్ని పరిష్కరించేందుకు విధానపరమైన చర్యలద్వారా ప్రయత్నిస్తోందని అర్థమవుతుంది.

ఏడాది కాలంలో ప్రారంభమైన ఇలాంటి పథకాలు, అభివృద్ధి చర్యలతో దశాబ్దాలుగా వాటిల్లిన నష్టాన్ని పూడ్చుకునే దిశగా దేశం ముందుకు సాగుతున్నదని ఆశించవచ్చు. ఈ ప్రత్యక్ష పథకాలతోపాటు ఇంధన రంగంలో సంస్కరణలమీద కూడా ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో గ్రామీణ భారతానికి మరింత చేయూత లభించనుంది. వ్యవసాయంపై ఆధారపడిన వారి సంఖ్య తగ్గటం దేశ సౌభాగ్యానికి సంకేతమన్న చిరకాల అపోహను జాతీయ నమూనా అధ్యయన కార్యాలయం నిర్వహించిన వివిధ అధ్యయనాలు, ఇటీవలి సామాజికార్థిక, కులగణన అధ్యయనం పటాపంచలు చేశాయి. వ్యవసాయం రానురానూ నష్టదాయకం కావడంతో యువత పట్టణాలవైపు పరుగుతీస్తోంది. దీనివల్ల మురికివాడల జనాభా పెరుగుతూ సామాజిక నిర్మాణాత్మక సమస్యలను ఎగదోస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలన్నీ సత్ఫలితాలిస్తే ఈ ధోరణి తగ్గి, సమ్మిళిత అభివృద్ధి కల సాకారానికి పట్టు దొరుకుతుందని ఆశించవచ్చు. ■

# భారతదేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థ - రాజకీయ ఆర్థిక స్థితి

**రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య ఈ ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో అనేక అంతరాలున్నాయి. ఆచరణ, అర్హులను ఎంపిక చేయడం, అమలు చేయడం, వగైరా అంశాలలో రాష్ట్రాల మధ్య భారీ స్థాయిలో వ్యత్యాసాలు ఉంటున్నాయి. తమిళనాడు నుంచి బీహార్ వరకు ఈ వ్యవస్థ అమలులో దీర్ఘకాలికమైన తీవ్రమైన అంతరాలున్నాయి. ప్రధానంగా వంటనూనె, పప్పుధాన్యాలలో ఇటీవల కాలంలో బీహార్‌లోని ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) మెరుగుబడింది.**

ఆహార పదార్థాలను అందరికీ అందుబాటులో ఉండే ధరలకు అందించడానికి 1965లో ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)ను ప్రారంభించారు. మార్కెట్ ధరల కంటే చౌకగా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, చౌకధరల దుకాణాల ద్వారా ఆహార ధాన్యాలను పంపిణీ చేస్తున్నాయి. ఆహార ధాన్యాల వాస్తవధరకు, చౌకధరల దుకాణాల ద్వారా విక్రయించే ధరకు మధ్య నున్న వ్యత్యాసమే (సిఐపి) ఆహార సబ్సిడీ. 1998 వరకు ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) పట్టణ ప్రాంతాలలోనే విస్తృతంగా ఉండడం వలన అనేక విమర్శలకు లోనయింది. దానిని నివారించడానికి 1997 లక్ష్యాలకు అనుకూల ప్రజాపంపిణీ వ్యవస్థ (టిపిడిఎస్) ప్రారంభమయింది. దీని ప్రకారం అర్హుల జాబితాను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన పేదరికపు ప్రమాణాల మేరకు కేంద్ర ప్రభుత్వం, రూపొందిస్తుంది. ఈ కుటుంబాలను దారిద్ర్యరేఖ కంటే దిగువనున్న (బిపిఎల్) కుటుంబాలుగా వ్యవహరిస్తారు. వీరు చౌకధరలలో ఆహార ధాన్యాలను పొందడానికి అర్హులు. వీరికి అదనంగా మరింత పేదవారికి అంత్యోదయ అన్నయోజన (ఎఎవై) పథకం క్రింద ఇంకా చౌకధరలకు ఆహార ధాన్యాలను అంద చేస్తున్నారు. దారిద్ర్యరేఖ కంటే దిగువనున్న వారు (బిపిఎల్) అంత్యోదయ అన్న యోజన (ఎఎవై) పథకాలకు అర్హులైన వారి జాబితాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తయారు చేస్తాయి. మిగిలిన అనేక ప్రభుత్వ పథకాల వలె టిపిడిఎస్ సహితం అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటుంది.

రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య ఈ ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో అనేక అంతరాలున్నాయి. ఆచరణ, అర్హులను ఎంపిక చేయడం, అమలు చేయడం, వగైరా అంశాలలో రాష్ట్రాల మధ్య భారీ స్థాయిలో వ్యత్యాసాలు ఉంటున్నాయి. తమిళనాడు నుంచి బీహార్ వరకు ఈ వ్యవస్థ అమలులో దీర్ఘకాలికమైన తీవ్రమైన అంతరాలున్నాయి. ప్రధానంగా వంటనూనె, పప్పుధాన్యాలలో ఇటీవల కాలంలో బీహార్‌లోని ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) మెరుగుబడింది. ఆయా ప్రదేశాలలో, ఆయా సమయాలలో తలయెత్తుతున్న వ్యత్యాసాలు జాతీయ స్థాయి

**సి.ఎస్.సి. శేఖర్,** అసోసియేట్ ప్రొఫెసర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, ఢిల్లీ యూనివర్సిటీ, ఢిల్లీ

అంచనాలకు అందటంలేదు. అందువలన ఈ వ్యాసంలో, కొన్ని రాష్ట్రాలలో ఆయా రాష్ట్రాల స్థాయి సాధారణ సంస్కరణలను గూర్చి చత్తీస్‌ఘడ్, బీహార్‌లో ప్రత్యేక దృష్టిని సారించడం జరిగింది. రాజకీయ అర్థవ్యవస్థ నేపథ్యంలో వివిధ రాష్ట్రాలలో పిడిఎస్ అమలు సామర్థ్యాన్ని విశ్లేషించడం జరుగుతుంది.

**సెక్షన్ : 2 విశ్లేషణాత్మక విధి విధానాలు :**

సాహిత్య అంశాలకువలె ఇక్కడ కూడా రెండు ప్రమాణాల ఆధారంగా విశ్లేషణ జరుపవచ్చు అవి :

1. నియో – క్లాసికల్ సంక్షేమ పురోగతి విధానం
2. రాజకీయ ఆర్థిక విధానం.

సాంప్రదాయకమైన సంక్షేమ వృద్ధిలో కీలకమైనవి రెండు అవి. మార్కెటింగ్ వైఫల్యం, కేటాయింపు సామర్థ్యత. ప్రభుత్వం సర్వజ్ఞగా, పరమదయాళుగా భావించబడుతుంది. పిగో (1932) తన వ్యాసంలో ఈ అంశాన్ని లేవనెత్తాడు. మార్కెట్ ఎందుకు సవ్యంగా పనిచేయలేకపోతోంది. పంపిణీలు కేటాయింపులలో ఎందుకు సమర్థవంతంగా పనిచేయలేకపోతోంది అన్న అంశంపై ఆయన తన పరిశోధనలో లోతుగా చర్చించాడు. ఈలోపాలను సరిదిద్దడానికి, ప్రభుత్వ జోక్యం అనివార్యమని సూచించాడు. ఈయన ప్రతిపాదించిన సూత్రాల ప్రకారం ప్రభుత్వం ఆయా వస్తువులను ఉత్పత్తి చేస్తుంది. ధరలను నిర్ణయిస్తుంది. పరిశ్రమల పారిశ్రామిక ఉత్పత్తుల ధరలను నియంత్రిస్తుంది. చివరగా సంపదను అందరికీ సరిసమానంగా పంచిపెడుతుంది ఈ విధానం వలన ప్రభుత్వం సర్వజ్ఞగా, ఆధునికంగా ఉండవచ్చు.

రెండవదైన 'రాజకీయ ఆర్థిక విధానం' అనేది పిగోవియన్ విధానానికి ప్రతిచర్యలాంటిది. ఇది ప్రభుత్వ దయాళత్వాన్ని సహించదు. మార్కెట్ సంస్కరణలను ప్రశ్నిస్తుంది. మార్కెట్ వైఫల్యాలను దిద్దుబాటు చేసే ప్రభుత్వాలు, తామే విఫలమవుతాయి. ఎందుకంటే ప్రభుత్వ మనేది తమ ప్రత్యేక లక్ష్యాలున్న అనేక కార్యనిర్వాహక, శాసన నిర్మాణ సంస్థల సమాహారం, ఇవి తరచు ఒకదానితో మరొకటి విభేదిస్తాయి. రాజకీయ ఆర్థిక విధానమనేది స్వంత లాభాపేక్ష కలిగిన రాజకీయ నాయకుల, ఓటర్ల, ఉన్నతాధికారుల ప్రమేయంతో ముడిపడి ఉంటుంది. ఇంకా ప్రభుత్వ ప్రతినిధులు పనిచేసే విధానం, వివిధ ప్రభుత్వ సంస్థల ఏర్పాటు, ఆర్థిక సూత్రాల ప్రభుత్వ విధానాల సమన్వయం, ఇత్యాదుల ప్రభావ ముంటుందని సిద్దాంతీకరించే శాస్త్రీయ విధానం ఈ రాజకీయ ఆర్థిక విధానం.

**2.1 ప్రయోగాత్మకమైన రాజకీయ అర్థవ్యవస్థ విశ్లేషణ**

రాజకీయ ఆర్థిక విపణిలో ఈ ప్రయోగాత్మక రాజకీయ, ఆర్థిక విధానం, ప్రభుత్వ ప్రాధాన్యతలను, అంతర్గతంగా శాసిస్తుంది. రాజకీయ ప్రాధాన్యతల విధులు (పిపిఎఫ్) అనేవి, విధాన రూపకల్పనలను ప్రభావితం చేస్థాయి. ఆర్థిక అవరోధాలను వీలైనంతగా తగ్గించుకుంటూ, విధాన రూపకర్తలు పనిచేస్తారు. విధాన ప్రాధాన్యతలు వారి నిర్ణయాల నుంచే రూపొందుతాయి. సంక్షేమ మిగులు, లాభాలు, నికర వ్యవసాయాదాయం ప్రభుత్వ బడ్జెట్ ఖర్చులు వంటి అంశాలు ప్రభుత్వ పనితనపు ప్రాధాన్యతలు కూడా పీడిత వర్గాల అభ్యున్నతి దిశగా నడుస్తాయి. ప్రాధాన్యతలను గణించడం సాధ్యమే. ఎందుకంటే అవి గమనించడానికి వీలైనవి, విధాన నిర్ణయాలు వాటిని బయలుపరుస్తాయి. పిపిఎఫ్ విధానంలో మరొక కోణం ఏమంటే ప్రత్యేకించి వ్యవసాయ విధానానికి సంబంధించి అంతర్ నిర్ణయ విధానాల స్థాయిలు. ఇందులో వ్యవసాయోత్పత్తుల ధరలు, చెల్లింపులలోని లోపాలు, దిగుమతి పరిమితులు, తదితర స్థాయిలన్నీ వరుసక్రమంలోనున్న ప్రభుత్వ రెవెన్యూ మూలాలు.

సంప్రదాయబద్ధమైన సర్వజ్ఞ, దయాళత్వ ప్రభుత్వ విధానానికి ఇంచుమించు సరిపోలి ఉంటుంది. ఈపిపిఎఫ్ విధానం. తేడా ఏమిటంటే వివిధ రాజకీయ ప్రయోజనాలకు దీని నుండి రాబట్టడమే. పిపిఎఫ్ విధానం ఒకింత వ్యయంతో కూడినప్పటికీ అంతర్లీనంగా ప్రభుత్వ ప్రాధామ్యాలను కాపాడుతుంది. ప్రభుత్వం ఒక విధాన ఉపకరణంగా పనిచేస్తుంది. రాజకీయ విపణిలో విధాన నిర్ణేత అనేది ఒక మిథ్యా వ్యవస్థ మాత్రమే. పిపిఎఫ్ విధానంలో రాజకీయ ప్రమేయానికి తావులేకుండా ప్రాధామ్యాల నిర్ణయాలు జరుగుతాయి.

**2.2. ఆసక్తి వర్గాలు**

ప్రయోగాత్మక సాహిత్యంలో మరొక అంశం, ఒత్తిడి పాత్రలేదా ఆసక్తివర్గాలు. విధానాలురూపొందించే క్రమంలో రాజకీయ వాతావరణ ప్రభావం కీలకమైనది. ఈ కోణంలో భారత ప్రగతిని, ప్రత్యేకించి ప్రజా పంపిణీ వ్యవస్థను (పిడిఎస్) విశ్లేషించవచ్చు. భారతదేశంలో ప్రజాస్వామ్య రాజకీయాలు అత్యంత సంక్లిష్టమైనవి. రాజకీయ పార్టీలకు ఎన్నికలలో పోటీ చేయడానికి నిధులు అవసరం. ఆ నిధులను కొందరు పారిశ్రామిక వేత్తలు, కొన్ని వర్గాలవారు మాత్రమే సమకూరుస్తారు. అందువలన విధానాల రూపకల్పనలలోనూ, వాటిని అమలు చేయడంలోనూ, ఆయా వర్గాల ఒత్తిళ్ళకు ప్రభుత్వాలు తలొగ్గడం సహజం. విధాన

రూపకల్పనలో రాజకీయ పార్టీల ఇష్టాయిష్టాలను నిధులు సమకూర్చే ఆయా వర్గాలు నిర్దేశిస్తాయి. అంటే ఆయావర్గాలు తప్పనిసరిగా ఆర్థిక వనరులను సమకూర్చే వ్యాపారాలలో మునిగిఉంటాయి. ఆ కారణంగా, విధాన నిర్ణయాలు రూపొందించే సందర్భాలలో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ వృత్తులవారు, పేదలు, నిరాశ్రయులు, అనాథలు విస్మరింప బడుతున్నారు. వీరు తమకు అర్హమైన ప్రాధాన్యాన్ని పొందలేకపోతున్నారు. ఎందుకంటే రాజకీయ పార్టీలకు నిధులు అందించే ఆర్థిక వనరులు వీరివద్ద లేవు కాబట్టి సమాచార అసమగ్రతకూడా ఒక ప్రధాన భూమిక పోషిస్తుంది. వివిధ ఆసక్తి వర్గాల మధ్య సమాచార సమన్వయం లేదా సమాచార లోపం ఉంటే, రాజకీయ వర్గాలవారు అధిక సంఖ్యలో సమాచారం కలిగిన సభ్యులను అందుబాటులో ఉంచాలి. ఇందువలన ఆయా ఆసక్తి వర్గాలవారు తమలో తాము సమాచారం మార్పిడి చేసుకుంటూ విధాన రూపకల్పనలో తమకు అనువైన విధానాలను రూపొందింప చేసుకోవచ్చు.

రాజకీయంగా కాకుండా ఆసక్తివర్గాల వారు తమకు అనువైన విధానాలను రూపొందించప చేసుకోవడానికి ఇంకో మార్గం ఉంది. వారు అధిక సంఖ్యలో ప్రజాబలాన్ని సమీకరించుకోవాలి. నిరసనలు, ప్రదర్శనల ద్వారా తమకు కావాల్సిన విధానాలను రూపొందించే టట్లుగా ప్రజాప్రతినిధులను ప్రభావితం చేయవచ్చు. అవి పారిశ్రామిక కాలుష్యం. మానవ హక్కులు తదితరాలు కావచ్చు. ఈ విధానంలో ఎన్నికలు, చట్టసభలు వంటి వాటికంటే మధ్యవర్తిత్వం జరిపి సాధించుకోవచ్చు.

**సెక్షన్ - 3 : చత్తీస్‌ఘడ్, బీహార్‌లలో ప్రజాపంపిణీ వ్యవస్థ**

గత సెక్షన్‌లో చర్చించిన రాజకీయ అర్థ వ్యవస్థ కోణంలో బీహార్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో అమలును, పనితనాన్ని ఈసెక్షన్‌లో చర్చిద్దాం.


2004 సంవత్సరం వరకు చత్తీస్‌ఘడ్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ప్రైవేటు పరంగా ఉండేది. దాని వలన ప్రధాన సమస్య ఏమంటే చౌకధరల దుకాణాలు (ఎఫ్‌పిఎస్) తిండిగింజలను సక్రమంగా పంపిణీ చేయక, ప్రైవేటు దుకాణాలకు తరలిపోయేవి. దీనిని నివారించడానికి అనేక సంస్కరణలు చేపట్టారు. ప్రధానంగా చత్తీస్‌ఘడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ (సిపిడిఎస్) ఏర్పాటయింది. తద్వారా రేషన్ దుకాణాలకు నేరుగా సరకులను అందచేసే వారు అలా తరలించే ట్రక్కులకు పసుపు రంగు పూసేవారు. ప్రతినెలా ఏడవ తేదీ నాటికి రేషన్ షాపులకు సరకులను అందచేయడం తప్పనిసరి. కంప్యూటరీకరణ ద్వారా ట్రక్కుల వివరాలు ఎప్పటికపుడు తెలుపుకొనేవారు. జనాభాలో 80శాతానికి పిడిఎస్ ద్వారా సరకులనందించేవారు. చౌకదుకాణాలకు కమిషన్‌ను క్వింటాల్‌కు ఎనిమిది రూపాయల నుంచి ముప్పయి రూపాయలకు పెంచారు. అనర్హులు ప్రయోజనం పొందడానికి వీలులేకుండా, ప్రతి లబ్దిదారుని ఇంటి బయట ఆయా రేషన్‌కార్డు వివరాలు బిపిఎల్ లేదా ఎఎవైలు రాసి పెట్టేవారు.

బీహార్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ ఎల్లపుడు వివిధ సమస్యలతో సంక్లిష్ట పరిస్థితుల్లోనే ఉంటుంది. అన్ని స్థాయిలలోనూ తిండిగింజల దుర్వినియోగం పంపిణీలో అవకతవకలు, తిండి గింజల ఉత్పత్తిలో కొరత, బీహార్ రాష్ట్ర ఆహార మరియు ప్రజా పంపిణీ సంస్థ (బిఎస్‌ఎఫ్‌సిఎస్‌సి) దివాళాతీయడం, భారీస్థాయిలో అవినీతి, డీలర్లు ఉన్నతాధికారులు, స్థానిక రాజకీయ పెద్దలు, మంత్రులు కుమ్మక్కు అవ్వడం, తక్కువస్థాయి ఆర్థిక ప్రగతి వంటి సమస్యలు వనరులను నిర్వీర్యం చేశాయి.

ఛత్తీస్‌ఘడ్ బీహార్‌లలోని ఆ వ్యవస్థల పనితీరును సులభమైన పద్ధతిలో క్రింది చిత్రం -1, మరియు 2ల ద్వారా వివరించవచ్చు. ఆసక్తివర్గాలు, సంస్థలు విధానాల మధ్య పరస్పర సంపర్కం ఉంటుంది. ప్రగతి క్రమంలో ఇది కీలకంగా మారి వివిధ అంశాలలో తన ప్రభావాన్ని ప్రమేయమున్న అందిరమీదా చూపిస్తుంది. అవి ఒకదానిపై మరొకటి ప్రభావం చూపుతూ, తుది ఫలితాన్ని మరింత పటిష్ఠంగా అందించడం జరుగుతుంది.

డిమాండు వైపుగాని, సప్లయి వైపుగాని ఉన్న లోపాలు, వాస్తవ ఫలితాలపై ప్రభావం చూపించి, ఆశించిన ఫలితాలు రానివ్వవు. (పటం -1) సప్లయి వైపు ప్రధానంగా సరైన ప్రేరణ లేకపోవడం, సమగ్రమైన ప్రోత్సాహక విధానం లేకపోవడం, సమన్వయ లేమి ఇత్యాదులు ప్రధాన సమస్యలు. డిమాండు పరంగా ఉన్న అత్యంత ప్రధాన సమస్య, లబ్దిదారుల నుంచి స్పష్టమైన లేదా ఖచ్చితమైన డిమాండు పరిమాణం తెలియక పోవడం, వీటి ఫలితంగా ఆచరణలో విఫలంకావాల్సి వస్తోంది.

పట్టిక - 1




పై చిత్రాల వలన బీహార్, చత్తీస్‌ఘడ్‌లలోని వ్యత్యాసాన్ని గ్రహించవచ్చు. 2004 వరకు చత్తీస్‌ఘడ్‌లోని ప్రధాన సమస్య చౌక ధరల దుకాణాలకు క్రమంగా సరఫరా చేయలేకపోవడం, ఇంకా భారీస్థాయిలో తిండిగింజలు బహిరంగ మార్కెట్‌కు తరలిపోవడం. దీనికి ప్రధాన కారణం. సరైన ప్రోత్సాహకాలు లేకపోవడం, ప్రభుత్వ యంత్రాంగాల మధ్య సమన్వయ లోపం (చిత్రం –2). చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఛత్తీస్‌ఘడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ ఏర్పాటుతో సమస్య తీరిపోయింది. డీలర్ల ప్రోత్సాహక కమిషన్‌ను క్వింటాలుకు రూ. 8 నుంచి రూ. 30కి పెంచారు. దీనివలన తిండిగింజలు బహిరంగ మార్కెట్‌కు తరలడం తగ్గింది. అదే సమయంలో ట్రక్కుల వివరాలు కంప్యూటరీకరించడం, ట్రక్కులకు పసుపు రంగు వేయడం, సరైన సమన్వయం ఇందువలన తిండి గింజలు అక్రమ ప్రదేశాలకు తరలడం ఆగింది. మరోవైపు లబ్దిదారులను భారీ సంఖ్యలో పెంచడం ద్వారా డిమాండ్‌ను పటిష్టం చేశారు. (చిత్రం –2) దరిమిలా ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పని చేయడం ప్రారంభించింది. పిడిఎస్‌ను అధిక సంఖ్యాకులకు వర్తింపచేయడం. పిడిఎస్ ధరలు తగ్గించడం, కంప్యూటరీకరణ, డోర్ డెలివరీ, రేషన్ షాపులను ప్రైవేటీకరణ నుంచి తప్పించడం, ఫిర్యాదులను పరిష్కరించేం యంత్రాంగం ఏర్పాటు వంటి చర్యల ద్వారా చత్తీస్‌ఘడ్‌లో ఈ వ్యవస్థ మెరుగుపడింది. ఆవిధంగా దశాబ్దికాలంలో చత్తీస్‌ఘడ్, పిడిఎస్‌లో ఆదర్శ రాష్ట్రమయింది. సిపిడిఎస్ విధానం ఆసక్తి వర్గాలయిన లబ్దిదారులను పెంచడం, డిమాండ్ పెరిగేటట్లు చేసింది. (విధానం – ఆసక్తివర్గాల సంబంధం చిత్రం–1)

బీహార్‌లో పిడిఎస్ 2011 సంవత్సరం వరకు అనేక సమస్యలు, ఎదుర్కొంది. అతి భారీస్థాయిలో తిండి గింజల అవతవకలు పంపిణీలో అనమానతలు, బిఎస్ఎఫ్‌సిఎస్‌సి దివాలాతీయడం డీలర్లు, ఉన్నతాధికారులు, స్థానిక రాజకీయ నేతలు మంత్రులు కుమ్మక్కు అవడం (మాయిజి, 1998, 2001) ఇత్యాదులు. ఈ స్థితికి ప్రధాన కారణం. బీహార్‌లో చాలినంత తిండి గింజల ఉత్పత్తి

**చిత్రం – 2**

**ప్రణాళిక రచన మరియు ఆమలు**



లేకపోవడం. దరిమిలా ఆహార ధాన్యాల కుంభకోణాలు. పిడిఎస్ విధానం వలన ప్రధాన లబ్ధిదారులైన పేదలు నిజానికి నోరులేని వారుగా మారిపోయారు. ఎందుకంటే భారీ స్థాయిలో ఆర్థిక అసమానతలు ఆర్థిక వ్యవస్థ ప్రగతి శూన్యంగా మిగల్చడం వగైరాల వలన పౌరసమాజం మీడియా బాధ్యతా రహితంగా వ్యవహరించి ఎన్నికలలో పై అంశాలను లేవనెత్తలేదు. ఆంధ్రప్రదేశ్ తమిళనాడు రాష్ట్రాలవలె లబ్ధిదారుల నుండి స్పష్టమైన డిమాండ్ ఉండాలి. మీడియా, పౌరసమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వాధికారులు నిజాయితీగా ఉండాలి. రాజకీయ నేతలు విశుద్ధులై ఉండాలి. అలాగైతే పిడిఎస్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది.

ఇవన్నీ గత కొన్ని సంవత్సరాలలో మార్పు చెందాయి. ఈ వ్యవస్థలో గత మూడు సంవత్సరాలలో ప్రత్యేకించి గత 12 నెలలో మార్పులు సంభవించాయి. దీనికి కారణం బీహార్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు. 2011 ప్రాంతంలో కూపన్ల పద్ధతి ప్రవేశపెట్టారు. మరిన్ని సంస్కరణలు గత మూడేళ్ళలో చేపట్టారు. కులగణన, ఆర్థిక సామాజిక స్థితి ఆధారంగా క్రొత్త రేషన్ కార్డుల జాబితాను తయారు చేశారు. బీహార్‌లో 75శాతం గ్రామీణ ప్రజలు క్రొత్త రేషన్‌కార్డు లేదా అంత్యోదయ అన్నయోజన కార్డు కలిగి ఉన్నారు. ప్రతి వ్యక్తికి నెలకు ఐదుకిలోల తిండి గింజలు లభిస్తాయని వారికి మొదటిసారి తెలియ వచ్చింది. పిడిఎస్‌ను ఎన్నికల అంశంగా తేవడంతో ప్రజలు మరింత చైతన్యవంతులయ్యారు. ప్రతి పక్షాలు కూడా ఈ విషయంలో అధికార పక్షానికి సహకరించాయి. ఇవన్నీ లబ్ధిదారుల నుంచి పిడిఎస్ పై ఒత్తిడి పెరగడానికి తోడ్పడ్డాయి. కొన్ని సంవత్సరాల క్రిందటి స్థితి అంటే ఎవరికీ ఏమీ లభించని స్థితికి నేటి స్థితికీ వ్యత్యాసం స్పష్టంగా గోచరిస్తున్నది.

ఈ రెండు రాష్ట్రాల చత్తీస్‌ఘడ్, బీహార్‌లో ప్రభుత్వ పరంగా చేపట్టిన చర్యలు అంటే సరఫరాను పెంచడం డిమాండును పటిష్ఠపర్చడం సత్ఫలితాలనిచ్చాయి.

**ఇతర రాష్ట్రాల అనుభవాలు**

ఇదే తరహాలోని విధానాల రూపకల్పన అమలు చేయడం వంటి వాటి వలన ఇతర రాష్ట్రాలలోనూ మంచి ఫలితాలు వచ్చాయి.

హిమాచల్ ప్రదేశ్‌లో పిడిఎస్ అందరికీ వర్తిస్తుంది. (ఒకే తరహాలో కానప్పటికీ) దారిద్ర్యరేఖ కంటే దిగువన ఉన్న వారు (బిపిఎల్) దారిద్ర్యరేఖ కంటే ఎగువనున్న (ఎపిఎల్) వారికంటే తక్కువ ధరకు తిండిగింజలు పొందడానికి అర్హులు. తిండిగింజలు కాని, నూనెలు, పంచదార, పప్పుధాన్యాలు వంటి వాటిని అన్ని కుటుంబాలకు (బిపిఎల్ మరియు ఎపిఎల్) ఒకే ధరకు అందిస్తారు. అయితే ఇవన్నీ తమిళనాడులో సులభంగానే సాధింపబడ్డాయి. ఎలాగంటే పిడిఎస్‌ను అందరికీ వర్తింపచేసి, డిమాండును పటిష్ఠపరచడం వలన.

తమిళనాడులో ప్రజానుకూలమైన తక్కువ ఖర్చుతోకూడిన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను విజయవంతంగా నడిపిస్తున్నారు. ఇక్కడ పారదర్శకత బాధ్యతలు ఆ విజయానికి కారణాలు. ఏ ఇతర రాష్ట్రం కూడా ఇంతటి జాగ్రత్తలు తీసుకోలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో పొరపాట్లు తగ్గించగలిగారు. 2008 నుంచి పొరపాట్లు తగ్గాయి. ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ మార్గాన్ని ఎంచుకుంది. కొరాపుట్, బొలంగీర్, కలహంగి జిల్లాల్లో ప్రతి ఒక్కరికి పిడిఎస్‌ను ప్రయోజనం అందుతోంది. చౌకధరల దుకాణాలను గ్రామ పంచాయితీలకు అప్పగించారు. రాజస్థాన్‌లో మే 2010 నుంచి, పై సంస్కరణలలో కొన్నింటిని అమలు చేస్తున్నారు. అవి సత్ఫలితాల నిస్తునట్లు ఆ గణాంకాలు చెపుతున్నాయి. జార్ఖండ్‌లో అసంపూర్ణమైన కాలం చెల్లిన బిపిఎల్ జాబితాలున్నాయి. ఆలస్యంగానైనా ఆ ప్రభుత్వం కొన్ని సంస్కరణలను ఆచరణలో పెట్టింది. 2009 నుండి పిడిఎస్ బియ్యం ధర ఒక్క రూపాయికి తగ్గించారు. రేషన్ సరుకులను ఇంటి వద్ద అందించేందుకు వీలుగా పిడిఎస్‌కు కాలపట్టికను అమలు చేస్తున్నారు.

**ముగింపు**

రాష్ట్రాలలో పిడిఎస్‌ను మెరుగుపర్చడానికి విస్తృత చర్యలు చేపడుతున్నారు. పిడిఎస్ వర్తించే వారి సంఖ్య పెంచడం, పిడిఎస్ ధరలు వీలైనంత తగ్గించడం, కంప్యూటరీకరణ, డోర్ డెలివరీ, రేషన్‌షాపుల్ని ప్రైవేటు వ్యక్తుల నుంచి తప్పించడం, రేషన్ షాపుల నిర్వహణను కమ్యూనిటీ సంస్థలకు అప్పగించడం, ఫిర్యాదుల పరిష్కారానికి తగిన వ్యవస్థలను అందుబాటులోకి తేవడం ఎఫ్‌పిఎస్ కమిషన్ల ఏర్పాటు ఇత్యాది. ఇంకోఅంశం ఏమంటే రాజకీయ మైన దృఢ సంకల్పం డిమాండు, సప్లయిల పటిష్ఠపర్చడం అనేవి పిడిఎస్ సమర్థవంతంగా పనిచేయడానికి తోడ్పడతాయి. ■

# భారతదేశంలో సామాజిక పరిణామ క్రమం - సమ్మిళిత వృద్ధి

**సహజ వనరులని మానవ వనరులతో సమన్వయం చేసి చట్టాలపై ప్రభుత్వ విధానాలపై నమ్మకము కల్పించాలి. అంతే కాకుండా సమ్మిళిత వృద్ధిని సాధించాలంటే అభివృద్ధి కోసం దూరదృష్టితో పనిచేయాలి. విమర్శనాత్మక మార్గ నిర్దేశకత్వంతో మందగమనంగా సాగుతున్న అభివృద్ధిని వేగవంతం చేయడానికి అందరికి సమాన అవకాశాలు కలిపిస్తూ గ్రామ స్థాయి నుంచి పటిష్టమైన ప్రణాళిక రూపొందించు కొని ప్రభుత్వ పరిపాలన వైఫల్యాలను తొలగించాలి.**

మానవుని జీవన విధానాన్ని ఉత్తమంగా, ఉన్నతంగా ఉజ్వలంగా తీర్చిదిద్దేది సామాజిక జీవనంలోని మార్పు. పరివర్తన చెందుతున్న సామాజిక సంబంధాల నమూనాయే సమాజము. సమాజంలో వచ్చే మార్పునే సామాజిక మార్పు అంటారు. అయితే నిరంతరం కూడా సమాజంలో మార్పు వస్తూనే ఉంది.సాంఘీక అవసరాల దృష్ట్యా సమాజ అవసరాల దృష్ట్యా సమాజం వికసిస్తూ పరిపక్వత సాధిస్తూ వస్తుంది. గ్రామీణ సమాజానికి, పట్టణ సమాజానికీ మధ్య కొంత అంతర్యం ఉన్నప్పటికీ క్రమ క్రమంగా కొంత మార్పుకి గురి అవుతూ వస్తున్నాయి. దానికి సాంఘీక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అవసరాలు కారణం అని చెప్పవచ్చు. ఇవి దేశ ప్రగతికి రథ చక్రాల వంటివి.

దేశంలోని జనాభా, వారి విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పౌష్ఠికాహార విధానాలు, నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు, ఆదాయ పంపిణీ, సగటు జీవితకాలం, శిశు మరణాలు, జననాల పెరుగుదల, వరకట్న సమస్య, ప్రాంతీయ అసమానతలు మొదలగునవి సాంఘీక మరియు ఆర్థిక జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి. మనిషి తాను చదివిన దానిని బట్టి తన పరిసరాల నుండి తాను గ్రహించిన దాన్ని బట్టి తన జీవితంలో తాను అనుభవిస్తున్న దానిని బట్టి తనదైన జీవిత విధానాన్ని ఏర్పాటు చేసుకుంటాడు. జ్ఞాని ఐతే సమాజంలో పాతుకొని ఉన్న జీవన ప్రమాణాలతో వాటిని పోల్చి చూసుకొని తనకంటూ కొన్ని జీవన ప్రమాణాలను ఏర్పాటు చేసుకొని సామాజిక మార్పులో భాగస్వామి అవుతాడు.

ఒక దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించాలంటే, సామాజిక మార్పు త్వరితగతిన సాధించాలి. సామాజిక అవసరాలకి ఆర్థిక అవసరాలకి అవినాభావ సంబంధం ఉంటుంది. ఆర్థిక భద్రత లేకుండా సామాజిక భద్రత సాధ్యం కాదు. పరిమాణాత్మక లక్ష్యాలను సాధించడానికి గుణాత్మక లక్ష్యసాధన తగిన విధంగా జరగాలి. వ్యక్తిపరంగా కుటుంబపరంగా సమాజంలోని చిన్న చిన్న మార్పులే ఎంతో సామాజికాభివృద్ధికి దోహదం చేస్తాయి.

**డా. పి. ఓంకార్,** సీనియర్ లెక్చరర్, లాల్‌బహదూర్ కాలేజీ, వరంగల్. e-mail : omkar.eco@gmail.com

అయితే ఇవి సాంఘీక సంబంధాలు ఆర్థిక సంబంధాలపై ఆధారపడి ఉంటాయి. అయితే సామాజికాభివృద్ధి పట్ల మానవ సమాజం అవలంభించే సంప్రదాయాలు, కట్టుబాట్లు, అలవాట్లు, అభిరుచులు, భవిష్యత్ తరాలకి ఆనవాళ్ళు కాబట్టి నేటి సాంఘీక జీవనమే రాబోయే తరాలకి కాబోయే పాఠ్యాంశం కావున, వ్యక్తుల సమాజం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా, పెరుగుతున్న అవసరాల దృష్ట్యా చైతన్య వంతం కావడంలోనే సామాజిక మార్పు బాధ్యత ఉంటుంది.

వ్యక్తి అవసరాలు, కుటుంబ అవసరాలే సమాజ వస్తువు కాబట్టి వ్యక్తిలో కుటుంబాలలో కలిగేటటువంటి నిరంతర సాంఘీక సంబంధాల విశ్లేషణయే సమాజంలో కలిగే సామాజిక మార్పు, ఆర్థికాభివృద్ధి లేకుండా సామాజికాభివృద్ధిని చెప్పలేము. సాంఘీక అభివృద్ధిని సాంఘీక, ప్రాంతీయ, స్త్రీ పురుష, కుల మత, పేద, ధనిక అనే అసమానతలే ప్రభావితం చేస్తాయి. స్వాతంత్ర్యం చేకూరినప్పటి నుండి మనదేశం సాంఘీక పరమైన పెట్టుబడులు పెంచడం ద్వారా సామాజిక పరివర్తన జరిగి సామాజిక రుగ్మతలు తొలగి సమాజం అభివృద్ధి పథం వైపు నడుస్తుంది. ఆ అభివృద్ధి చెందిన సమాజం నుండి విశ్వ కుటుంబ భావన సామూహిక సంక్షేమాభిలాష చేకూరుతాయి. “సమానీవ ఆకూతి – సమాన హృదయానివ : సమానామస్తు వోమనో యథావసుసహాసతి” హృదయాలు ఒకటి కావాలి. ఆలోచనలు ఒకేతాటిపై నడవాలి, అందరం ఒక్కటై మంచి స్నేహితులుగా మెలగాలి. మానవ జాతిలో ఈ ప్రయత్నం అనాధిగా కనిపిస్తూ వస్తున్నది.

వ్యక్తి తన పట్ల తనకు గల కర్తవ్యాలే కాక సమాజం పట్ల కూడా కొన్ని బాధ్యతలుంటాయి. వ్యక్తి ప్రవర్తనను అతడు పెరిగిన పరిసర వాతావరణం చుట్టూ ఉన్న సమాజం అతని గూర్చి ఊహించడానికి దోహదం చేస్తే ఆ వ్యక్తి చేసే పనుల విలువలను ఆ సమాజ ప్రయోజనాలు నిర్ణయిస్తాయి. అయితే సమాజంలో కుటుంబ, బంధుత్వ, ఆర్థిక, రాజకీయ విద్యావిషయక మత విశ్వాసాది అంశాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి పరస్పరం సమన్వయం కలిగి ఉంటాయి. సమాజం ఒక క్రమంలో ఏర్పడాలన్నా, అభివృద్ధి చెందాలన్నా, ఉన్నత ప్రమాణాలతో నిలబడాలన్నా సామాజిక సంబంధాలే ప్రభావితం చేస్తాయి. ఏదో ఒక తప్పు జరిగితే తప్ప అందరూ సామాజిక మార్పుని గురించి ఆలోచించే సందర్భం మారాలి.

**సమ్మిళిత అభివృద్ధి :** సమ్మిళిత అభివృద్ధి సాంఘీక అభివృద్ధికి సంబంధించిన అనేక విషయాలను పరిగణలోకి తీసుకుంటుంది. "Growth with social Justice" సమ్మిళిత వృద్ధి అనేది ఆర్థిక సాంఘీక అవకాశాలు ప్రజలందరికీ సమానంగా పంపిణీ కావాలని సూచిస్తుంది. "Equitable development" అంతే కాకుండా మెరుగైన ఉపాధి అవకాశాలు పెంపొందించడం, పేదరికాన్ని నిర్మూలించడం, ప్రాంతీయ అసమానతలు రూపు మాపి మానవ వనరుల అభివృద్ధిని బలోపేతం చేయడం, వ్యవసాయ పారిశ్రామిక సేవారంగాలు అభివృద్ధి, ఆదాయ అసమానతలు తగ్గించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయడం, ఆర్థిక వృద్ధి ఫలితాలను సమానంగా పంపిణీ చేయడం మెరుగైన ఆరోగ్యం, విజ్ఞానం నైపుణ్యాల ద్వారా మానవుని శక్తి సామర్థ్యాలను సృష్టించడం, ఆయుఃప్రమాణ కాలం పెంచడం, అక్షరస్యాత సాధించడం, విద్య, ఆరోగ్య సౌకర్యాలు సమకూర్చడమే సమ్మిళిత అభివృద్ధి.

సమ్మిళిత వృద్ధి అనే భావన ఆధునికమైనది, విశాలమైనది దీనిని 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో బహుళ ప్రాచుర్యంలోకి తీసుకరావడం జరిగింది. మనలాంటి అభివృద్ధి చెందుతున్న సువిశాల దేశాలకి ఈ భావన ఎంతగానో ఉపకరిస్తుంది. సాంఘీక అభివృద్ధి నివేదికలు, మానవాభివృద్ధి నివేదికలు అన్నియూ ఈ భావనలో అంతర్భాగమే. సామాజిక దృకోణాన్ని ఆర్థిక పరిపక్వతని శీఘ్రతరం చేసేది సమ్మిళిత వృద్ధి. ఇది నెరవేరాలంటే త్వరితగతిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థని పటిష్టపరచాలి, మహిళా సాధికారతని సాధించాలి. అవినీతిని నిర్మూలించాలి. శక్తి వనరుల అవసరాన్ని గుర్తించాలి. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పబడాలి. పోషకాహారలోపాన్ని నియంత్రించి, పట్టణీకరణను సులభతరం చేయాలి. స్త్రీ, పురుష బేధం లేకుండా ఉద్యమ తత్వంలో సమాన అవకాశాలు కల్పించి అభివృద్ధి ఫలప్రద వాతావరణంను సృష్టించాలి. సహజ వనరులని మానవ వనరులతో సమన్వయం చేసి చట్టాలపై ప్రభుత్వ విధానాలపై నమ్మకము కల్పించాలి. అంతే కాకుండా సమ్మిళిత వృద్ధిని సాధించాలంటే అభివృద్ధి కోసం దూరదృష్టితో పనిచేయాలి. విమర్శనాత్మక మార్గ నిర్దేశకత్వంతో మందగమనంగా సాగుతున్న అభివృద్ధిని వేగవంతం చేయడానికి అందరికి సమాన అవకాశాలు కలిపిస్తూ గ్రామ స్థాయి నుంచి పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకొని ప్రభుత్వ పరిపాలన వైఫల్యాలను తొలగిస్తూ, ఆర్థిక కుల లింగ వివక్షతలను తొలగిస్తూ సర్వ సమానత్వాన్ని సాధించడం, ప్రతి భారతీయుడు గౌరవంగా మరియు ఆత్మాభిమానంగా జీవించేందుకు కృషి జరగాలి. మానవ మూలధనాన్ని అగ్ర భాగంలో నిలపాలి. స్వయం సమృద్ధిని, సాంకేతిక పరిజ్ఞాన పురోగతిని సాధించుటకు అవసరమైన విధానాలను రూపొందించి అమలుపరచడం ద్వారా మరియు నియంత్రించడం ద్వారా సమకాలీన సామాజిక

సమస్యలకున్న ఆర్థిక మూలాల్ని శాస్త్రీయంగా పరిశీలించి గతిశీల సమ్మిళిత అభివృద్ధిని నిర్మించాలంటే అభివృద్ధి ఫలితాలకు నోచుకోని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు పనిచేయాలి సామాజిక ఆర్థిక అభివృద్ధిని సాధించడమే సమ్మిళిత అభివృద్ధి లక్ష్యం.

| సంవత్సరం | మానవ అభివృద్ధి సూచిక విలువ |
|---|---|
| 1990 | 0.489 |
| 1995 | 0.511 |
| 2000 | 0.556 |
| 2005 | 0.596 |
| 2007 | 0.612 |
| 2014 | 0.586 |

మానవ అభివృద్ధి సూచికలో అక్షరాస్యత, తలసరి ఆదాయం, ఆయుః ప్రమాణం అని మూడు రకాల భావన కలిపి నిర్ణయిస్తారు. అయితే 2014 మానవ అభివృద్ధి సూచి విలువలో నార్వే మొదటి స్థానం (0.944) ఆస్ట్రేలియా ద్వితీయ స్థానం (0.933) ఉండగా భారతదేశం 135వ స్థానం (0.586) లోను, ప్రపంచ అవినీతి సూచికలో 94వ స్థానంలోను, మేధోసంపత్తి సూచికలో 29వ స్థానంలో ప్రపంచ ఆకలీ సూచికలో 55వ స్థానంలోను ఉంది. మరియు 8.8 మిలియన్స్ జనాభా పట్టణ ప్రాంతంలోని మురికి వాడలలో (Urban Slums) ను 2/3 వంతు జనాభా గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. రంగరాజన్ రిపోర్టు ప్రకారం 29.5శాతం జనాభా పేదరికపు రేఖకు దిగువన ఉండగా, ప్రతి వెయ్యి మంది శిశు జననాలకి 44 శిశు మరణాలు జరుగుతున్నవి. గ్రామీణ ప్రాంతాలలో 46.1శాతం జనాభాకి త్రాగునీరు అందుబాటులో ఉండగా పట్టణ ప్రాంతాలలో 76.8శాతం మాత్రమే ఉంది.

పై అంశాలను గమనించి అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చి చూసినట్లయితే చాలా సామాజికంగా, ఆర్థికంగా ఎంతో పురోగతిని సాధించవలసిన ఆవశ్యకత ఉంది.

సమ్మిళిత అభివృద్ధి అనగా సాంఘీక మరియు ఆర్థికాభివృద్ధి. సాధారణంగా ఆర్థికాభివృద్ధి జరగనిదే సామాజికాభివృద్ధి జరగదు. మనదేశంలో భూమిలేని నిరుపేదలు చిన్న, సన్నకారు రైతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ ట్రైబ్స్ మరియు వెనుకబడిన తరగతులవారు సామాజికంగా ఆర్థికంగా వెనుకబాటుతనంలో ఉన్నారు.

పై బలహీనతలన్నింటికి చికిత్స చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే సామాజిక మార్పుతో పాటు సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రభుత్వం సమ్మిళిత అభివృద్ధి లక్ష్య సాధన కోసం అనేక చర్యలు తీసుకుంటుందనే చెప్పాలి. ఇటీవలి కాలంలో అసంఘటిత కార్మికుల భద్రతా చట్టం, జాతీయ సాంఘీక భద్రతా నిధి ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా ఆమ్‌ఆద్మీ బీమా యోజన, రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన, గ్రామీణ గృహకల్ప ఇందిరా ఆవాస్‌యోజన, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం, గ్రామీణ సానిటేషన్, నిర్మల్ భారత్ అభియాన్, భారత్ నిర్మాణ్ యోజన, జాతీయ ఆరోగ్య మిషన్, మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి కౌన్సిల్ నైపుణ్యాభివృద్ధి పథకం, జాతీయ నైపుణ్యాభివృద్ధి సమన్వయ బోర్డు, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన, సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన పథకాలను రూపొందించి తద్వారా సామాజికాభివృద్ధిని, సమ్మిళితాభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. గ్రామీణ అవస్థాపన సౌకర్యాలు కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ అవస్థాపన సౌకర్యాలు కల్పించడం ద్వారా పట్టణ ప్రాంతాలలోనూ ఆదాయ అసమానతలు, ప్రాంతీయ అసమానతలు, సామాజిక అంతరాలు, రుగ్మతలు తగ్గి సామాజిక మార్పు సమ్మిళిత భావన సాధ్యం అవుతుంది.

**ముగింపు**

చాలా ఇతర దేశాలు మనకన్నా తక్కువ వృద్ధి రేట్లు ఉన్నప్పటికీ సాంఘీకాభివృద్ధి విషయంలో మంచి ప్రగతిని సాధించాయి. సాంఘీక, ఆర్థిక అభివృద్ధుల మధ్య ప్రాథమికంగా ఎలాంటి వైరుధ్యాలు లేవు. కాబట్టి ఆర్థిక వృద్ధి సాంఘీక అభివృద్ధి రెండూ ఒకేసారి జరగాలని ఈరెండింటి పరస్పర చర్యల ప్రయోజనకరమైన సంయోగాన్ని కలిపి అన్వేషించాలి. ఏ అభివృద్ధి వ్యూహమైనా రెండు నేత్రాల లాంటిదే దేనిని విస్మరించినా ఆ అభివృద్ధి నిలవ జాలదు. కాబట్టి మనదేశంలో సాంఘీకపరమైన పెట్టుబడులు పెరగడం ద్వారా సాంఘీక అవస్థాపన సౌకర్యాలు సామాజిక వికాసం కల్పన జరిగి చైతన్యం చేకూరి అవి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తాయి. ■

| సంవత్సరం | స్త్రీ పురుష నిష్పత్తి | గ్రామీణ జనాభా | ఆయుఃప్రమాణం | మహిళ అక్షరాస్యత |
|---|---|---|---|---|
| 1951 | 946 | 82.7 | 32.1 | 8.86 |
| 1961 | 941 | 82.0 | 41.3 | 15.35 |
| 1971 | 930 | 80.0 | 45.6 | 21.97 |
| 1981 | 934 | 76.7 | 56.0 | 29.76 |
| 1991 | 927 | 74.3 | 63.5 | 39.29 |
| 2001 | 933 | 72.2 | 64.9 | 53.63 |
| 2011 | 943 | 68.8 | 66.4 | 65.46 |

*24వ పేజీ తరువాయి...*

**సాధికారతకు డిజిటల్ సాంకేతికత దన్ను**

కోసం ఆ సంస్థ ఎంపిక చేసిన 12 సాధికారక సాంకేతికతలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. జీవితం, పనిని అంకాత్మకత (డిజిటైజ్) చేసేవి; 2. చురుకైన భౌతిక వ్యవస్థలు (స్మార్ట్ ఫిజికల్ సిస్టమ్స్); 3. పునరాలోచించగల శక్తి (రీ థింకింగ్ ఎనర్జీ) గలవి. వీటిలో భాగంగా ఉన్న నాలుగు సాంకేతికతలు భారత దేశ పరిస్థితులకు తగినవి:– డిజిటల్ చెల్లింపులు, తనిఖీలకు వీలైన డిజిటల్ గుర్తింపు, వివేచనపూర్వక (ఇంటెలిజెంట్) రవాణా–పంపిణీ, ఆధునిక భౌగోళిక సమాచార వ్యవస్థ (జిఐఎస్). ఈ నాలుగు సాంకేతికతలు రాబోయే దశాబ్దంలో వేగంగా ప్రజా జీవనంలో మమేకమయ్యే అవకాశాలున్నాయి. అత్యాధునిక రోబోటిక్స్, స్వయంచోదిత వాహనాలు, త్రిపరిమాణ ముద్రణ (త్రీడీ ప్రింటింగ్), అత్యాధునిక సామగ్రి (అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్) వంటి మరికొన్ని సాంకేతికతలు కూడా భారత్‌కు అవసరమైనవే.

మొత్తంమీద ఈ 12 సాధికార సాంకేతికతలు సామాజిక, ఆర్థిక విలువల సృష్టికి దారితీసి, మన దేశం 2025నాటికి మెరుగైన పాలన, మరింత సామాజిక సార్వజనీనత, వేగవంతమైన ఆర్థిక వృద్ధి వంటి లక్ష్యాలను సాధించడంలో దోహదపడగలవని ఆశించవచ్చు. ముందుగా 'డిజిటల్ ఇండియా కార్యక్రమం' గురించి చర్చిద్దాం. ఆ తర్వాత భారత ఆర్థిక వ్యవస్థలోని ఐదు రంగాలపై డిజిటలైజేషన్ ప్రభావంమీద దృష్టి సారిద్దాం. డిజిటల్ భారత దేశం–సాంకేతికత వినియోగ ప్రయత్నం

ప్రజలకు ప్రయోజనం కల్పించడం ద్వారా దేశం ఎదుర్కొంటున్న కొన్ని సవాళ్లను అధిగమించే ప్రయత్నంలో భాగంగానే భారత ప్రభుత్వం డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజానీకం డిజిటల్ పరిజ్ఞానవంతులైతే అంతులేని అవకాశాలను అందిపుచ్చుకోవడంలో సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోగలరు. అంటే డిజిటల్ ఇండియా ఆవిష్కారం దిశగా మార్గసూచిని ఈ కార్యక్రమం రూపొంది స్తుంది. మనకు జాతీయ రహదారులు ఎంత ముఖ్యమో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ హైవేలు కూడా అంతే ముఖ్యమని మన రాజకీయ నాయకులు స్పష్టం చేశారు. తమ అంతిమ లక్ష్యం మెరుగైన సేవలందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడమేనన్న అవగాహన మన నేతలకు ఉంది. అలాగే ఇందుకు కీలక దోహదకారి, డిజిటల్ ఇండియాకు పునాది వేసేది దేశవ్యాప్త సాంకేతిక పరిజ్ఞాన నెట్‌వర్క్ విస్తరణేననీ వారికి తెలుసు. దేశంలోని ప్రతి వ్యక్తికీ ఒక సదుపాయంగా డిజిటల్ మౌలిక సౌకర్యాలను డిజిటల్ ఇండియా కార్యక్రమం కల్పిస్తుంది. పాలనతోపాటు కోరిన సేవలను అందించడంద్వారా పౌరులకు డిజిటల్ సాధికారతను కట్టబెడుతుంది. ఈ మేరకు వృద్ధి దిశగా ఈ పథకం తొమ్మిది మూలస్తంభాలను గుర్తించింది. వీటిలో కీలకమైనదిగా ప్రభుత్వం దృష్టి సారించిన అంశం బ్రాడ్‌బ్యాండ్ హైవేల అభివృద్ధి. ఇది 2016 డిసెంబర్ నాటికి 2.5 లక్షల గ్రామ పంచాయతీలకు విస్తరించాలి. అలాగే కొత్తగా నిర్మించే భవనాల్లో దీనికి తగిన సమాచార మౌలిక సదుపాయాల కల్పనను తప్పనిసరి చేయనుంది. ఈ విధంగా పట్టణ ప్రాంతాల్లోకి బ్రాడ్‌బ్యాండ్ మరింతగా చొచ్చుకుపోయేలా చూడాలని పట్టుదలతో ఉంది. బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం ఎంతగా చొచ్చుకుపోతే అంతగా సాంకేతిక పరిజ్ఞానాధారిత సేవలు దేశంలోని మారుమూల ప్రాంతాలకూ అందించే వీలుంటుంది. దీంతోపాటు సార్వజనీన మొబైల్ అనుసంధానంపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. ఈ మేరకు 2018నాటికల్లా 40 వేలకుపైగా గ్రామాలు మొబైల్ సాంకేతికత పరిధిలోకి వచ్చే అవకాశాలున్నాయి. ఒక్కమాటలో చెబితే అంకాత్మీకరణ (డిజిటలైజేషన్) 19వ శతాబ్దంనాటి యంత్రీకరణ, విద్యుచ్ఛక్తి ఆవిష్కరణతో సరిపోల్చదగిన ఓ కొత్త ఆవిష్కరణ కెరటం. సాంకేతిక అభివృద్ధి పరిణామశీలమైనదికాగా, సామాజిక మార్పుపై దాని ప్రభావం మాత్రం విప్లవాత్మకమైనది.

**వ్యవసాయం – గ్రామీణాభివృద్ధి**

దేశ ఆర్థిక వ్యవస్థలోని నిర్దిష్ట రంగాల్లో డిజిటల్ సాంకేతికతను అనువర్తించడంపై ఇప్పుడు చర్చిద్దాం... దేశం ఎదుర్కొంటున్న పేదరికం, సమ్మిళిత వృద్ధి, ఆహారభద్రత సమస్యలను పరిశీలించాలంటే వ్యవసాయ రంగం, దానిచుట్టూ అల్లుకున్న పర్యావరణ వ్యవస్థను మొదట అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఏదో రకమైన ఏకైక నమూనాను అభివృద్ధి చేయడంద్వారా ఈ సమస్యలకు వాస్తవ పరిష్కారం లభిస్తుందని భావిస్తే సరిపోదు. ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజానీకానికి చక్కటి జీవనోపాధి, వాస్తవ ఆహార భద్రత కల్పించి, పేదరికాన్ని నిర్మూలించాలంటే అక్కడ లభ్యమయ్యే వనరుల ఆధారంగా అనేక వినూత్న నమూనాలను పరిగణనలోకి తీసుకోవాలి. భారత వ్యవసాయ రంగం పరిస్థితి 1950ల నుంచి కొంత మెరుగ్గానే ఉంది. జనాభా పెరుగుదల వేగంతో పోలిస్తే ఆహార ఉత్పాదకత వేగమే ఎక్కువని చెప్పవచ్చు. హరిత విప్లవం (వ్యవసాయం), శ్వేత విప్లవం (పాడి పరిశ్రమ), నీలి విప్లవం (మత్స్య రంగం) వంటివి భారత వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ విజయవంతం కావడానికి తోడ్పడ్డాయి. దేశం 1950 నుంచి ఆహారధాన్యాల ఉత్పత్తిని ఐదురెట్లు, పాడి ఉత్పత్తిని ఏడు రెట్లు పెంచుకోగలిగింది. అదే సమయంలో రైతుల ఆత్మహత్యలు, ఆర్థిక దోపిడీపై వారి ఆక్రోశం గురించి కూడా మనం వింటున్నాం. విధానాల్లో పొంతన లేకపోవడమే ఈ సమస్యకు కారణంగా నిపుణులు నిర్వచిస్తున్నారు. లోగడ భారత వ్యవసాయ విధానం ఆహారభద్రత సమస్యపైనే అధికంగా దృష్టి పెట్టింది. అధిక విలువగల వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ద్రవ్యోల్బణాధిక్యతను గుర్తించడంలో ఈ విధానం విఫలమైంది.

ప్రజలకూ అధిక పౌష్టికతతో కూడిన ఆహారం లభించడం లేదు. ఆహారధాన్యాలతో పోలిస్తే అధిక విలువగల ఉత్పత్తులు త్వరగా పాడవుతాయి కాబట్టి, వాటిని వేగంగా సరఫరా చేసే మార్గాలు అవసరం. ఇక వ్యవసాయ-మూల్య శ్రేణి రైతులతో మొదలై దళారులు, గిడ్డంగులు, ఆహారశుద్ధి పరిశ్రమదారులు, చిల్లర వ్యాపారులు, చివరగా వినియోగదారుల వద్ద ఆగుతుంది. దీన్ని పూర్తిస్థాయిలో ఆకళింపు చేసుకోవాల్సిన అవసరముంది. తగిన విధానమేదో ఆ తర్వాతే నిర్ణయించాలి. ప్రభుత్వం, ఇతర పెట్టుబడిదారులు, వ్యాపారులు భాగస్వాములుగా జతకూడినప్పుడు ఈ శ్రేణి మొత్తం 'వ్యవసాయిక పర్యావరణ వ్యవస్థ' అవుతుంది. ఈ వ్యవస్థ మనుగడకు శ్రేణిలోని ప్రతి భాగస్వామి తనవంతు పాత్ర పోషించాల్సి ఉంటుంది. సదరు వ్యవసాయ-మూల్య శ్రేణిని మరింత సమర్థం, స్పర్ధాత్మకం చేయడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తోడ్పడుతుంది.

మెకెన్సీ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం, సంకర-జన్యు ఉత్పరివర్తిత పంటలు, కచ్చితమైన వ్యవసాయ పద్ధతులు, (పంటల సాగుపై రైతుకు భూమి, వాతావరణం, నీరు గురించి సెన్సర్లు, భౌగోళిక సమాచార వ్యవస్థ గణాంక తోడ్పాటు) మొబైల్ ఇంటర్నెట్ ఆధారిత వ్యవసాయ విస్తరణ చర్యలు, విపణి సమాచార సేవలు వంటివన్నీ అమలులోకి రావాలి. తద్వారా 2025 నాటికి సాధించే అదనపు విలువలో సగానికిపైగా ఏటా 45 బిలియన్ల నుంచి 80 బిలియన్ డాలర్ల వంతున సమకూరుతుంది. పంట చేతికందిన తర్వాత కలిగే నష్టనివారణ దిశగా నిల్వ, పంపిణీ వ్యవస్థల మెరుగుదల, ప్రజా పంపిణీ వ్యవస్థలో లొసుగుల నివారణ సంస్కరణలు కలగలసి ఏటా 32 మిలియన్ డాలర్ల వంతున పొదుపుతో మిగిలిన అదనపు విలువను సమకూరుస్తాయి. ఈ మెరుగుదల చర్యలవల్ల దేశంలోని 10 కోట్ల మంది రైతుల ఆదాయం పెరగడంతోపాటు 30 నుంచి 40 కోట్లమంది వినియోగదారులకు మెరుగైన పౌష్టికత అందుతుంది. రైతులకు పంట బీమా కల్పించడంలోనూ సాంకేతికత వినియోగం ఎంతో ప్రభావశీలంగా ఉంటుంది. ప్రస్తుతం వాడుకలో ఉన్న పంటకోత పరీక్షవంటి పద్ధతులతో పోలిస్తే అన్ని వాతావరణ కేంద్రాలద్వారా పంట నష్టం అంచనా, ఉపగ్రహ-మానవరహిత విహంగ చిత్రీకరణతో మొబైల్ ఆధారిత సమాచార సరఫరా వంటివి మొత్తం వ్యవస్థకు పటిష్ఠ శాస్త్రీయతనివ్వడంతోపాటు అవినీతిని అదుపు చేయవచ్చు.

వివిధ సేవలు అందించడంద్వారా గ్రామీణ పౌరుల సాధికారతను డిజిటల్ ఇండియా వేదిక లక్షిస్తోంది. మెరుగైన పాలన, భూమి రికార్డులు, ఉద్యోగావకాశాలు, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, వ్యక్తిగత-ప్రభుత్వ పత్రాల డిజిటైజేషన్‌ద్వారా భద్రత వంటి సేవలద్వారా దేశంలోని అత్యధిక జనాభాకు సేవలు అందాలన్నది ప్రభుత్వ దీక్ష. దీనివల్ల వర్ధమాన వ్యవస్థాపకులకు అవకాశాలు విరివిగా దక్కుతాయి. దీంతోపాటు ఇప్పటికే కొనసాగుతున్న వ్యాపారాలద్వారా గ్రామీణ విపణికి మునుపెన్నడూ లేని రీతిలో సేవలు విస్తరించే వీలు కలుగుతుంది.

**ఉత్పత్తి రంగ పర్యావరణ వ్యవస్థ**

రానున్న ఐదేళ్లలో పెద్ద సంఖ్యలో యువత దేశ కార్మికశక్తిలోకి ప్రవేశించనున్నట్లు వివిధ సంస్థలతోపాటు ఆర్థికవేత్తలు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఉత్పత్తిరంగం-దాని పర్యావరణంపై భారత్ దృష్టి సారించాల్సి ఉంది. ఒక కంపెనీ- వివిధ సరఫరాదారులు, పెట్టుబడిదారులు, వినియోగదారులతో కూడిన పర్యావరణం వంటి పాత నమూనా నుంచి ప్రపంచ ఉత్పత్తి రంగం కొత్త దిశగా అడుగులు వేస్తోంది. ఈ పరివర్తనకు కారణం డిజిటలైజేషనే. కనుక భారత కంపెనీలు, విధాన రూపకర్తలు ఈ వాస్తవం నుంచి వేగంగా నేర్చుకోవాల్సి ఉంది. యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించాలన్నా, విపణిలో సమర్థంగా పోటీ పడాలన్నా ఇదెంతో అవసరం. ఆధునిక సాంకేతికత ఇందుకు తోడ్పడుతుంది. ఇది గ్రహించిన భారత పారిశ్రామికులు కొందరు దీన్ని స్వీకరించడంలో వేగంగా ముందడుగు వేస్తుండటం కనిపిస్తోంది. నేటి పరివర్తిత డిజిటల్ వాణిజ్య పర్యావరణం పరిశ్రమల పనితీరు మార్పును కోరుతోంది. అన్ని పరిశ్రమలలోనూ ఇప్పుడు మూల్యశ్రేణి (వాల్యూ చెయిన్)ని విడగొట్టి, తిరిగి ఏకంచేస్తూ సరికొత్తగా తీర్చిదిద్దుకుంటుండటం కనిపిస్తోంది. ప్రస్తుత మూల్యశ్రేణులను విడగొట్టడం, ఇతర వనరుల నుంచి విలువను జోడించి కొత్త శ్రేణిని రూపొందించడం, ఇతర పరిశ్రమల మూల్యశ్రేణులను కలుపుకోవడం వంటి వినూత్న పద్ధతులద్వారా సరికొత్త మూల్యశ్రేణి వనరులను సృష్టించుకోవడానికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఇటువంటి ఉత్పత్తిరంగ పర్యావరణ వ్యవస్థకు తగిన విధానాన్ని రూపొందించడం ఇప్పుడిక ప్రభుత్వం చేయాల్సిన పని. ఈ రెండింటి సమ్మేళనంతో పరిశ్రమలు విశ్వవిపణిలో గట్టి పోటీ ఇవ్వడంతోపాటు అత్యధిక ఉపాధి అవకాశాల సృష్టికి మార్గం ఏర్పడుతుంది.

ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న, మధ్యతరహా సంస్థలను భారీ సంస్థలతో అనుసంధానించడంపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాల్సి ఉంది. ఉత్పత్తి రంగ పర్యావరణ వ్యవస్థ భావనను ప్రోత్సహించడం వల్ల అనుసంధానంలోని లోటుపాట్లను గుర్తించి, పరిష్కారానికి మద్దతునిచ్చే వీలు కలుగుతుంది. అలాగే పెట్టుబడి, ముడిసరుకులు, భూమి, వినియోగదారుల విపణితో సంధానం తదితరాల్లోని సమస్యలనూ పరిష్కరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) చట్టాన్ని ఆమోదించనుండటం ప్రధానాంశం కానుంది. భారత పారిశ్రామిక, వాణిజ్య రంగాలు సమస్యలను అధిగమించి పోటీపడగలిగేందుకు ఇది దోహదపడుతుంది. ఈ దిశగా సాగే కృషికీ ఆధునిక సాంకేతికత అందివస్తుంది. దీంతోపాటు ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల రంగానికి ఇవ్వాల్సినంత ప్రాముఖ్యం, ప్రోత్సాహం ఇవ్వడంద్వారా ఆ ఉత్పత్తుల దిగుమతులను సున్నా స్థాయికి తేవాలన్నది డిజిటల్ ఇండియా కార్యక్రమ

లక్ష్యం. భారత ఉత్పత్తి రంగ సామర్థ్యాన్ని ఉత్తేజితం చేసి, దేశాన్ని ఉత్పత్తి కేంద్రంగా మార్చడానికి ఇదెంతో అవసరం. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంసిద్ధ కార్మికశక్తిని సృష్టించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ మేరకు రాబోయే ఐదేళ్లలో చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి యువతకు శిక్షణ ఇవ్వనుంది.

**విద్య-నైపుణ్య నిర్మాణం**

మన విద్యావ్యవస్థలో నాణ్యత సమస్యలు, అభ్యాస సంక్షోభాలు భారీగానే ఉన్నాయి. పాఠశాల విద్యాభ్యాస ఫలితాలు బలహీనంగా ఉండటం, ఉన్నత విద్యార్హతలున్నా ఉద్యోగిత తక్కువగా ఉండటం, వృత్తివిద్యా శిక్షణపరంగా లోటుపాట్లు వగైరాలున్నాయి. ఈ పరిస్థితినుంచి గట్టెక్కించి భారత విద్యావ్యవస్థను పునరుత్తేజితం చేయడానికి డిజిటలైజేషన్ ఎనలేని అవకాశాలు అందిస్తుంది. శిక్షకులు, గురువులు అందుబాటులో ఉండటం, సకాలంలో ఉపయుక్త సమాచారం ఇవ్వడం వంటి కొత్త అనుకూల, సహాభ్యాస రూపాలను వినూత్న డిజిటల్ పరిజ్ఞానాలు సృష్టించాయి. ఇక ఇప్పుడు ప్రభుత్వం డిజిటల్ ఇండియా ప్రేరణతో దేశవ్యాప్తంగా ఒక సమర్థ వాతావరణాన్ని సృష్టిస్తే విద్యావ్యవస్థలో పరివర్తన సులభతరమవుతుంది. విద్యార్థుల అభ్యాసనను మెరుగుపరచడం, శిక్షకుల గురువుల సామర్థ్యాన్ని పెంచడం, మెరుగైన పాలనను అందించడంలో కొత్త సాంకేతికతను సరైన ఆలోచనతో, సవ్యంగా అమలుచేయగలగాలి. మన విస్తృత, సంక్లిష్ట పాఠశాల-ఉన్నత విద్యాసంస్థల యంత్రాంగంతో సాంకేతికతను జోడించడంలో సమన్వయంతో కూడిన విధాన లక్ష్యంతో సాగాల్సిన అవసరం ఉంది. అవేమిటంటే...

తొలి ప్రాధాన్యాంశం... విద్యార్థుల వ్యక్తిగత అభ్యాసం కోసం సూచనోపకరణాల సృష్టి. డిజిటల్ పాఠ్య పుస్తకాలు, యానిమేషన్, వీడియోల వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాల రూపకల్పన ఇందులో భాగం. అభ్యాసాన్ని వినోద క్రీడలా మార్చడం, పరస్పర అభ్యసనను ప్రోత్సహించడం వంటి విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస మార్గాల సృష్టిలో కొత్త సాంకేతికత ఎంతగానో ప్రయోజనకరం. వారికది అనేక అభ్యాసపూర్వక అవకాశాలు కల్పిస్తుంది. మన దేశంలో ఇటువంటి చొరవకు ఖాన్ అకాడమీ, మైండ్స్పార్క్ వేదిక విజయవంతమైన ఉదాహరణలు. దేశంలోని వైవిధ్యభరిత భాషలు, రాష్ట్ర స్థాయి పాఠ్యప్రణాళికలకు తగిన అభ్యాసన ఉపకరణాలను మనం రూపొందించుకోవచ్చు.

రెండోది... సామర్థ్య సంధానిత ఉపాధ్యాయ శిక్షణ కోసం సాంకేతిక సమగ్రత కార్యక్రమాల అభివృద్ధి. ఇలాంటి కార్యక్రమాలద్వారా ఉపాధ్యాయ విద్య కోసం నమూనాల పునరావిష్కరణకు సాంకేతికత వీలు కల్పిస్తుంది. సహచరులతో సంధానం దిశగా ఉపాధ్యాయులకు సహాయపడుతుంది. దూరానగల నిపుణుల నుంచి శిక్షణ పొందేందుకు దోహదపడుతుంది. గుజరాత్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర వంటి కొన్ని రాష్ట్రాల్లో వాట్సాప్‌లాంటి కొత్త సాంకేతికతను వినియోగించే బృందాలు విజ్ఞానం, ఆలోచనలను ఇచ్చి పుచ్చుకున్నాయి. ఇక కర్ణాటక సార్వత్రిక విద్యావనరుల వేదిక డిజిటల్ విషయ సృష్టి దిశగా ఉపాధ్యాయులకు వీలు కల్పిస్తోంది. ఇటువంటి సాంకేతికతతో రూపొందిన సూచనాత్మక వీడియోలు, ఆన్‌లైన్ శిక్షణ, సహాయుధ్యాయుల మద్దతు వంటి వివిధ నమూనాలు కూడా ఉన్నాయి. పెద్ద సంఖ్యలోగల సార్వత్రిక ఆన్‌లైన్ కోర్సులను అభ్యాసంలో భాగం చేస్తే విద్యార్థులకు ఉత్తమ నాణ్యతగల కోర్సులు అందుబాటులో ఉంటాయి. నర్సింగ్ వంటి కోర్సులకు విద్యాభ్యాసన (సిమ్యులేషన్ లెర్నింగ్) కూడా ప్రత్యక్ష శిక్షణకు మరింత వెసులుబాటు కల్పిస్తుంది.

మూడోది... బలమైన పరిపాలన కోసం సమాచార సేకరణ, విశ్లేషణ. శక్తిమంతమైన సమాచార నిర్వహణ వ్యవస్థల సాయంతో అన్ని విద్యాసంస్థలు విద్యార్థుల వ్యక్తిగత ప్రతిభ సమాచారం నమోదు, నిర్వహణ, అనుసరణ, విశ్లేషణలను చేపట్టవచ్చు. సంస్థపరమైనవే కాకుండా బోధకులు-తరగతి గది నిర్దేశిత లక్ష్యాల సాధనకూ ఈ సమాచారాన్ని వినియోగించుకోవచ్చు. కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిసా రాష్ట్రాలు ఇటువంటి పరిష్కారాలను అమలు చేస్తున్నాయి.

**ఆరోగ్య సేవలు అందించడం**

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం భారత్‌లో ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వైద్యులు, నర్సులపరంగా జనాభా నిష్పత్తితో పోల్చితే అవసరమైనదానిలో 50 శాతమే ఉన్నారు. అంతేగాక ఉన్నవాటినీ గరిష్ఠ ఆరోగ్య ఫలితాలిచ్చే విధంగా చేయలేని పరిస్థితి. దీన్ని చక్కదిద్ది ప్రజారోగ్య సేవలు, సుదూర ఆరోగ్య సేవలు (మొబైల్ ఇంటర్నెట్‌ద్వారా నిపుణులతో సంప్రదింపులు) సమర్థంగా అందించాలంటే పాత వ్యవస్థలను విచ్ఛిన్నంచేసే ఆధునిక సాంకేతికతల ప్రయోగంతో సమూల రూపాంతరీకరణకు కృషి చేయడమే మార్గం. కనీస నైపుణ్యంగల ఆరోగ్య సిబ్బంది కూడా స్మార్ట్ ఫోన్లతో పనిచేసే తక్కువ ఖరీదు వైద్య పరీక్షల పరికరాలు, డిజిటల్ ఉపకరణాల సాయంతో ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించవచ్చు. ఉదాహరణకు స్మార్ట్‌ఫోనును అందుబాటులో ఉండే కంటిపరీక్ష పరికరంగా కూడా వాడుకోవచ్చు. 'నేత్రాజీ' (చీవీటీఖ+) అనే పరికరాన్ని స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానించి అందులోని సాఫ్ట్‌వేర్, ప్రాథమిక నేత్ర సంబంధ సాంకేతికత సహాయంతో కేవలం రూ.300 పరిమిత ఖర్చుతో దృష్టి లోపాలను తెలుసుకోవచ్చు. దీనికన్నా అదనపు స్థాయి సేవ అవసరమైనప్పుడు సుదూరంలో ఉన్న నిపుణులకు సదరు సమాచారాన్ని వెంటనే పంపి వారి సలహా తీసుకోవచ్చు. అయితే, మనమంతా ఒక నెట్‌వర్క్‌లో సంధానితులమై ఉన్నప్పుడు మాత్రమే సాధ్యం. కాబట్టే సురక్షితమైన, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తూ నాణ్యత-భద్రత ప్రమాణాలను అంచనా వేసే వీలు కల్పించే దిశగా డిజిటైజేషన్ దృష్టి సారించింది.

**ఎలక్ట్రానిక్ పాలన**

మొత్తంమీద డిజిటల్ ఇండియా కార్యక్రమ లక్ష్యం దేశాన్ని డిజిటల్ సాధికార సమాజంగా రూపాంతరీకరించి, 'భవిష్యత్ విజ్ఞానం' కోసం సిద్ధం చేయడమేనన్నది స్పష్టమైంది. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ పాలన, అనుసంధాన ప్రణాళిక, పథకాలు... అన్నీ కలగలసినదిగా డిజిటల్ ఇండియా కార్యక్రమం కనిపిస్తోంది. ఉదాహరణకు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ళ ద్వారా 2.5లక్షల పంచాయతీలను బ్రాడ్‌బ్యాండ్‌తో అనుసంధానించే పథకాన్ని డిజిటల్ ఇండియా కిందకు చేర్చి దానికి 'భారత్–నెట్'గా కొత్త పేరు పెట్టారు. స్వార్థం కోసం ఇతరులను పావులుగా వాడుకోవడం, అవినీతి, దళారులు, జాప్యపు జాడ్యం (రెడ్ టేపిజం) తదితర పొరలన్నిటినీ నాశనం చేసి, ప్రభుత్వాన్ని, ప్రజలను చేరువ చేయడమే ఎలక్ట్రానిక్ పాలన లేదా డిజిటల్ సాధికారతలోని ప్రాథమిక ఆలోచన. ఎలక్ట్రానిక్ పాలనకు 1986లోనే లాంఛనంగా బీజం పడింది. అప్పట్లో న్యూఢిల్లీలో తొట్టతొలి కంప్యూటరీకరించిన రైల్వే ప్రయాణికుల రిజర్వేషన్ వ్యవస్థ ప్రారంభమైంది. అసమర్థత, అవినీతి, జాప్యం తదితరాలకు ముగింపు పలుకుతూ దేశీయంగా రూపొందించి, అభివృద్ధిపరచి, అమలు చేసిన ఈ సాంకేతిక పరిజ్ఞాన పథకం ఒక ప్రజా సేవను అందించగల కంప్యూటర్ సాంకేతికతకు తొలి నిదర్శనం. ఇక కర్ణాటకలో 'భూమి' పథకం కింద భూమి రికార్డుల కంప్యూటరీకరణ అత్యున్నత విజయం సాధించిన ఎలక్ట్రానిక్ పాలనకు మరో ఉదాహరణ. ఇంటర్నెట్, బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ సాంకేతికత అందుబాటుతో ఈ పథకాలన్నీ మరింత విస్తరించి ఇతర అంశాల్లోనేగాక ఇతర రాష్ట్రాలకూ ఎలక్ట్రానిక్ పాలన నమూనాలుగా నిలిచాయి. ఇతర దేశాల్లాగా ప్రభుత్వాన్ని మరింత ప్రభావవంతం, ప్రతిస్పందనాత్మకంగా పౌరులకు చేరువ చేయడంలో ఎదురయ్యే సవాళ్లతో భారత్ పెనగులాడుతోంది. ఒక అంచనా ప్రకారం ప్రాథమిక సేవలమీద ప్రభుత్వం పెడుతున్న వ్యయంలో 50 శాతందాకా ప్రజలకు వాస్తవ లబ్ధి చేకూర్చడం లేదు. మరోవైపు పెట్టుబడులకు, వృద్ధికి అనేకానేక చిక్కుముడులతో కూడిన గజిబిజి ప్రభుత్వ ప్రక్రియలు ఆటంకంగా నిలుస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ప్రభుత్వ సేవల ఆర్థిక ప్రభావం పోటీతత్వాన్ని పెంపొందించి, వ్యాపారహిత సానుకూలతను సృష్టిస్తుంది.

**ఉపసంహారం**

దేశం సమ్మిళిత వృద్ధిని సాధించడంలో ఆధునిక సాంకేతికతల పాత్రను పరిశీలించడమే ఈ వ్యాసం లక్ష్యం. డిజిటల్ సాంకేతికతలు, ఆ దిశగా ప్రవేశపెట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం పాత్రను నేనిక్కడ విశ్లేషించాను. ఇందులో వ్యవసాయం, ఉత్పత్తి, విద్య, ఆరోగ్య సంరక్షణ, ప్రభుత్వ సేవల రంగాలను స్పృశించాను. ఈ విశ్లేషణను బట్టి సరికొత్త డిజిటల్ సాంకేతికతలు ఈ ఐదు రంగాలలో సమూల రూపాంతరీకరణకు తోడ్పడతాయన్నది స్పష్టమైంది. ఈ రంగాలలోని బలహీనతలు, లోటుపాట్లను సాంకేతికత పరివర్తనద్వారా అధిగమించవచ్చు. ఈ పరిజ్ఞానం వ్యవసాయ రంగాన్ని సమూలంగా మార్చి గ్రామీణ ప్రాంతాల జీవనోపాధిని, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. ఉత్పత్తి రంగం మరింత పోటీ తత్వాన్ని సంతరించుకుని, తన పరిమాణాన్ని పెంచుకుంటూ మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. విద్యలో ప్రమాణాలు, అభ్యాసన సమస్యలను డిజిటల్ సాంకేతికత పరిష్కరించగలదు. ఆరోగ్య సదుపాయాలు దేశంలోని మారుమూల ప్రాంతాలకు చేరువ కావడమేగాక చౌకగా అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ సేవలందించే ప్రక్రియ గణనీయంగా మెరుగుపడుతుంది. సంక్షిప్తంగా చెబితే... సుస్థిర పాలన, సార్వజనీన–అందుబాటు ఆరోగ్య సంరక్షణ, పౌర సేవలు, విద్యసహా సమ్మిళిత వృద్ధి, గణనీయ ఆర్థిక ప్రగతి సాధనలో సాంకేతికత కచ్చితంగా దోహదపడతాయి.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంద్వారా పూర్తి లబ్ధి పొందాలంటే డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కోసం భౌతిక మౌలిక సదుపాయాల కల్పన తప్పనిసరి. అలాగే సాంకేతికత స్వీకారానికి ఎదురయ్యే అవరోధాలను తొలగిస్తూ సమర్థ విధానాలు అమలు చేయాలి. నిబంధనలు, ప్రమాణాల పర్యవేక్షణ, సాంకేతికత వల్ల సంకల్పితంగానో, అసంకల్పితంగానో ఎదురయ్యే దుష్ప్రభావాల నియంత్రణ అవశ్యం. ఉత్తేజిత, వినూత్న పర్యావరణ వ్యవస్థను సృష్టించడం కూడా ఎంతో అవసరం. మన దేశం బహుభాషల నిలయం కాబట్టి సమాచార విస్తరణ, విజ్ఞానం, అవకాశాలకు తగిన బహుళ భాషా సామర్థ్యాలను కూడా పెంపొందించాల్సి ఉంది. సమర్థ ప్రజా పంపిణీ వ్యవస్థ, పని యాంత్రీకరణ, పట్టణ–గ్రామీణ జీవన పర్యావరణ రూపాంతరీకరణ లేదా మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలవంటివి ఏదైనా కావచ్చు... వీటన్నిటిలో పాలనను సరళీకరించే విధంగా సంప్రదాయ, ఆధునిక వ్యవస్థల ఏకీకరణ కూడా కావాల్సిందే. ఇక్కడొక వాస్తవాన్ని ప్రస్తావిస్తున్నాను... పాశ్చాత్య దేశాల్లో డిజిటల్ సాంకేతిక స్వీకరణవల్ల సామర్థ్యం, ఉత్పాదకత పెరిగి, ప్రజలకు ఉద్యోగ అవకాశాలు తగ్గాయి. అయితే, మన దేశంలో డిజిటల్ సాంకేతికత మధ్యకాలికంగా మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని అంచనా. ఈ కీలకాంశంపై ప్రత్యేక శ్రద్ధతో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంది. ■

# స్వతంత్ర సంగ్రామంలో మహిళామణులు

బాలురతో పోల్చినపుడు బాలికల సంఖ్య తగ్గుతుండడాన్ని మనదేశంలో మొదటిసారిగా రెండు దశాబ్దాల క్రితం అనగా 1991 జనాభా లెక్కలలో గుర్తించారు. 7 సంవత్సరాలలోపు పిల్లల జనాభాను ప్రత్యేకంగా గణిస్తే అదీ అక్షరాస్యత కోసం అందులో ప్రతీ వెయ్యి మంది బాలురులకు 945 మంది బాలికలున్నట్లు సమాచారం.

ప్రాచీన కాలంలో మహిళా రాజ్య పరిపాలనలో భాగస్వామ్యం వహించింది. పురాణ ఇతిహాసాలలో మహిళల పరిపాలన, రాజ్యపాలనలో సహకారం కనిపించింది. వేదకాలంలో విద్యావేత్తలుగా ఎన్నో చర్చలలో, ప్రసంగాలలో పాల్గొన్నారు. మెగస్తనీస్ రచనలలో పాండ్య రాజ్యంలో మహిళా పాలకులు ఉన్నారని పేర్కొన్నారు. శాతవాహన రాజ్యంలో రాణి 'నాగనీక' తన కుమారులకు పరిపాలనాదక్షురాలిగా ఉన్నది గుప్తుల కాలంలో మొదటి చంద్రగుప్త అర్ధాంగి కుమారదేవి రాజ్యపాలనకు గుర్తుగా కొన్ని నాణెములు వారి బొమ్మలతో విడుదల చేశారు. చాళిక్యుల కాలంలో విజయభట్టారిక చంద్రాదిత్యరాణిగా, రాణిహోదాలో పాలన చేసింది.

9వ శతాబ్దంలో త్రిభువన మహాదేవి-1 (సిద్ధగౌరి అనికూడా అంటారు). ఒరిస్సాలోని కారావంశపు రాణి, త్రిభువన మహాదేవి-11, గౌరిమహాదేవి, దండిమహాదేవి మొదలగు వారు రాజ్యాలను పరిపాలించారు.

రాజ పుత్రులలో 1139 నాటి పరిస్థితులు గమనిస్తే మేవాడ్ రాజు 'సమరాసి' మరణానంతరం కుమారదేవి పరిపాలించింది.

కర్ణాటక ప్రాంతంలో ఎంతోమంది రాణులు యుద్ధాలు చేసి అసువులు బాసారు. జవహరదేవి, కొల్హాపూర్ రాష్ట్ర స్థాపకురాలు తారాబాయి రాణులుగా తమ సైన్యాన్ని నడిపించారు.

కాశ్మీర్ రాణి రజియా, ఢిల్లీరాణి చాంధ్‌సుల్తానా, రాణిదుర్గావతి, నూర్జహాన్, జహన్‌ఆరా, జేబున్నీసా, బేగమ్ హజరత్ మహల్, ఝాన్సీలక్ష్మీబాయి మొదలైన వారు ధైర్యసాహసాలు గల వనితలుగా పేరొందారు.

**భారత స్వాతంత్రోద్యమంలో మహిళలు**

మహాత్మాగాంధీ స్వాతంత్ర్య పోరాటంలో పదుల సంఖ్యలో మహిళలు ప్రవేశించి వందల, వేల సంఖ్యగా పెరిగారు. ప్రతి ఉద్యమంలో స్త్రీలు ప్రవేశించారు.

ఉప్పు సత్యాగ్రహంలో ప్రధానంగా పాల్గొన్న మహిళలు ధారాసన, శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతి అరెస్ట్ అయినారు. ముంబాయిలోని ప్రముఖసేనలో కిసాన్ ధుమర్‌కర్, కమలాదేవి చటోపాధ్యాయ, బాలికలైన రామేశ్వరమ్మ (మద్రాస్ నుండి), ఇందిరాగాంధి అలహాబాద్ నుండి పాల్గొన్నారు. జయశ్రీ రాజాజీ, హంసమెహతా, పెరిస్‌కాప్టెన్, జోషిబెన్, లీలావతిమున్షి, మనిబెన్ పటేల్, మహత్ర

**సుసర్ల మాధవి,** ఫ్రీలాన్సర్.

సిస్టర్స్ మొదలైన వారు ఉద్యమంలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళా ప్రవేశం విదేశీ స్త్రీవాదులైన అనిబీసెంట్, మార్గరెట్ కజిన్స్‌రాకతో మరింత ఎక్కువైంది. ఒకవైపు స్వతంత్ర్య పోరాటం, మరొకవైపు నాటి సమాజ దురాచారాలను రూపుమాపే సంఘసంస్కరణ ఉద్యమం, సంఘ సంస్కరణ ఉద్యమాన్ని భారతీరాయ్ ఆధ్వర్యంలో ఎక్కువ మంది మహిళలు నడిపించారు. నాటి దురాచారాలైన, సతి, బాల్యవివాహాలు, కన్యాశుల్కం, బాల వితంతువులు, దేవదాశి వ్యవస్థ మొదలైన వాటి నిర్మూలన ధ్యేయంగా సంఘసంస్కరణ ఉద్యమాలు నడిపించారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఉత్సాహంగా నిలిచిన మొదటి వనితగా సరోజినినాయుడును పేర్కొనవచ్చు. వారితోపాటు ఎంతోమంది మహిళలు భారతదేశంలోని ఎన్నో ప్రాంతాలనుండి ముందుకు వచ్చారు. వారిలో ప్రముఖులు సరళాదేవి చౌదరాణి, సరళారాయ్, లేడి అబలబోస్, విద్యాగౌరి, నీలకాంత, శారదబెన్ మెహతా, బేగమ్ హమిద్ అలి, సిస్టర్ సుబ్బలక్ష్మి, ముత్తులక్ష్మి రెడ్డి మొదలైన వారు మద్రాస్ నుండి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ నుండి దిగుమర్తి జానకమ్మ, చుక్కమ్మ, వాసిరెడ్డి హనుమాయమ్మ, కన్నెగర్తి నాగరత్నమ్మ, దుగ్గిరాల కమలాంబ, దాసరాయ్ కృష్ణవేణమ్మ, ఆరికపూడి మాణిక్యాంబ, సుగుణ, మహాలక్ష్మమ్మ, వల్లభనేని మహాలక్ష్మమ్మ, కంబంపాటి మాణిక్యాంబ, భారతి దేవిరంగ, మాగంటి అన్నపూర్ణమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, వేదాంతం కమలాదేవి, దిగుమర్తి సుగుణమ్మ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, మాణిక్యాంబ, పొనక కనకమ్మ, ఓరుగంటి మహాలక్ష్మమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, దర్శి సుందరమ్మ, డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ మొదలైనవారు సుప్రసిద్దులు.

మహారాష్ట్ర నుండి రమాబాయి సరస్వతి, రమాబాయి రనడే, కహీబాయ్ కనికర్, మాలతీబాయ్ బెడెకర్, సీతాసేన్ మొదలైనవారు. అస్సాం నుండి పుష్పలతదాస్, అన్నప్రభబారువ, సుధారతదత్త, చంద్రప్రభ, కుమారి కమల లత, ప్రీతిలత, బీనాదాస్, మల్లీశ్వరి. బెంగాల్, యూ.పి. నుండి బసంతదేవి, వద్మానని అంబాల్, శకుంతలదేవి, విజయలక్ష్మి పండిట్, సుహాసిని, మృదుల సారాబాయి, పండిత రమాబాయి, సుచేతకృపలా, కృష్ణ హత్తిసింగ్ మొదలైనవారు ఉన్నారు.

**నేటి మహిళల స్థితి**

నాడు అన్ని సమస్యలు, మూఢాచారాలు ఉన్నా, విద్య, ఆర్థిక స్థితి లేకున్న మహిళలు ధైర్యంగా సమాజంలోకి వచ్చి సంస్కరణలతో మార్పుచెంది, స్వతంత్ర్యపోరాటంలో పాలుపంచుకున్నారు. అంతధైర్యం ఉన్న స్త్రీలు నేడు ఎన్నో విచిత్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆసమస్యలు ఏవిధంగా పరిష్కరించుకోవాలనే అంశాన్ని ప్రక్కన పెట్టి మహిళలనే సమాజంలోకి రానీయకుండా చేస్తున్నారు.

బాలికల నిష్పత్తిని చూస్తే అర్థమవుతుంది. భారతదేశంలో ఆడపిల్లలను కనడం పట్ల ఉన్న వివక్షత, అయిష్టత బాలురతో పోల్చినపుడు బాలికల సంఖ్య తగ్గుతుండాన్ని మనదేశంలో మొదటిసారిగా రెండు దశాబ్దాల క్రితం అనగా 1991 జనాభా లెక్కలలో గుర్తించారు. 7 సంవత్సరాలలోపు పిల్లల జనాభాను ప్రత్యేకంగా గణిస్తే అదీ అక్షరాస్యత కోసం అందులో ప్రతీ వెయ్యి మంది బాలురుకు 945 మంది బాలికలున్నట్లు సమాచారం. 2001 జనగణనలో ఇది మరింత తగ్గిపోతుంది. బాలురకు 927 బాలికలున్నట్లు నమోదైంది. ముఖ్యంగా వాయువ్య భారతంలో ఈనిష్పత్తి ఆందోళనకరమైన స్థాయిలో, 850 కంటే తక్కువగా నమోదైంది. అన్ని జిల్లాలోను బాలల లైంగిక నిష్పత్తి 850 కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్ (తెలంగాణతో సహా), దాద్రానగర్, హవేలి, డామన్ దయ్యూ, గోవా, కేరళ, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, ఒరిస్సా, పుదుచ్చేరి, సిక్కిం, త్రిపుర. 850 కంటే తక్కువ గల ప్రాంతాలు: పంజాబ్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ, ఛండీగర్ మొదలైనవి. ఈతగ్గుదల అనేది ధనిక బీద రాష్ట్రాలలో ఒకే రకంగా ఉంది. హర్యానా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ప్రాధమికంగా లైంగిక ఎంపికతో కూడిన అబార్షన్ల ద్వారా తమ ప్రాంతాలలో లైంగిక నిష్పత్తిని నియంత్రిస్తుంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో ఆడశిశువులను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం, మెరుగైన పునరుత్పత్తి వైద్యవిధానాల ద్వారా పురుష పిండాలను జాగ్రత్తగా చూసుకోవడం ఇలాంటి విషయాలతో లింగవివక్షత అర్థమవుతోంది.

లింగనిర్ధారణ పరీక్షలు విస్తృతంగా లభ్యమవుతుండడంతో అనేక మంది భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిని నియంత్రించడానికి ప్రీనేటల్ డయాగ్నస్టిక్ రెగ్యులేషన్ అండ్ (ప్రివెన్షన్ ఆఫ్ యూజ్) చట్టాన్ని 1994లో అమలులోకి తెచ్చి గర్భస్థ శిశువు లింగనిర్ధారణ వెల్లడించడాన్ని నిషేధించింది. ఈచట్టాన్ని 2003లో సవరించి మరింత కఠినం చేశారు. ఈచట్టం కఠినంగా అమలు చేస్తున్నా, 'సేవ్ ది గర్ల్ చైల్డ్' ప్రచారాన్ని విస్తృతంగా దేశమంతటా నిర్వహిస్తున్నా చైల్డ్ లింగనిర్ధారణ నిష్పత్తిలో ఇప్పటికీ మార్పురావటం లేదని గుర్తించి, ఆడపిల్లలను చిన్నచూపు చూసే దురాచారానికి కారణమైన సాంస్కృతిక, సాంఘిక అంశాలను గుర్తించి, ఈ దురాచారాలను అరికట్టేందుకు ప్రయత్నించాలి. ■

# అభివృద్ధి మార్గ సూచి

**ప్రధాన మంత్రి కౌషల్ వికాస్ యోజన :** నైపుణ్య విద్యను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం చేపడుతున్న ప్రధాన కార్యక్రమాలల్లో "ప్రధాన మంత్రి కౌషల్ వికాస్ యోజన" (పిఎంకెవివై) ప్రముఖమైంది.నైపుణ్య ప్రమాణీకరణ, ప్రయోజన పథకం ద్వారా భారతీయ యువతకు శిక్షణనిచ్చి వారి ఉద్యోగతిత స్థాయిని పెంపొందించడం జరుగుతుంది. ప్రమాణిత శిక్షణ సంస్థల్లో చేరిన వారికి డిబిటి ద్వారా శిక్షణ భృతిని కూడా అందించడం జరుగుతుంది. ఈ పథకం ద్వారా 24లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పథకం జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్(ఎన్ఎస్‌డిసి) ద్వారా అమలవుతుంది. అన్ని శిక్షణలు, ప్రమాణీకాలు లక్షిత రంగాల్లో నైపుణ్యాభివృద్ధి కృషి జరుగుతోంది.

**లక్ష్యాలు :** ⇨ దేశంలో ప్రస్తుతం ఉన్న కార్మిక ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడం, శిక్షణా ప్రమాణికతను వృద్ధి చేయడం. ⇨ నైపుణ్య ప్రమాణీకత, నగదు ప్రోత్సాహం అందించడం ద్వారా యువతకు నైపుణ్య శిక్షణవైపు ఆకర్షించడం. నైపుణ్య శిక్షణకు ఒక ప్రమాణిక రిజిష్టరీ ఏర్పాటు. ⇨ అధికృత సంస్థల్లో శిక్షణ పొందేవారికి రూ.8 వేల వరకూ నగదు ప్రోత్సాహం అందించడం.

**కీలక అంశాలు**

⇨ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణా ప్రమాణాల పెంపు (జాతీయ వృత్తి ప్రమాణాలు - ఎన్ఓఎస్, ప్రత్యేక ఉద్యోగాలకు ప్రమాణిత-యోగ్యతను నిర్ణయించడం. ⇨ఎన్ఎస్‌డిసిలో నమోదుకు ముందు సంస్థలు ప్రతిపాదిక ప్రమాణీకాలు పాటించడం. ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలు, భాగస్వాములు, ఎన్ఎస్‌డిసి రూపొందించిన నియమనిబంధలను పాటించడం. ⇨ పాఠ్య ప్రణాళికలో సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ, వ్యక్తిగత అలంకరణ, ప్రవర్తన మార్పు, శుభ్రత, ఉత్తమ పనితీరు, ప్రవర్తనపై శిక్షణనివ్వడంపై దృష్టిసారించడం. ⇨ నగదు ప్రోత్సాహం-వివిధ వృత్తుల్లో శిక్షణకు నగదు ప్రోత్సాహం అందించడం, ఉత్పత్తి, నిర్మాణ, ప్లంబింగ్ రంగాల్లో అత్యధిక ప్రోత్సాహం అందించడం. ⇨దీనిపై అవగాహన కల్పించడానికి స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగం, ప్రభుత్వాలు, అలాగే పార్లమెంట్ సభ్యుల సహకారం. ⇨థర్డ్ పార్టీ ద్వారా అంతర్జాతీయ, జాతీయ స్థాయి ప్రమాణాలతో నైపుణ్య శిక్షణ పరిశీలన. పోటీకి అనుగుణంగా నైపుణ్యం పెంపొందించుకున్న శిక్షణార్థులకు నగదు ప్రోత్సాహం. దీని ద్వారా అసంఘటిత కార్మికుల నైపుణ్యం వృద్ధి చెందడమే కాకుండా, వారి నైపుణ్యం వృద్ధి చెందుతుంది.

**లబ్ధిదారుల అర్హతలు**

ఎ) ఒక గుర్తింపు పొందిన సంస్థలో, సంబంధిత రంగంలో నైపుణ్య విద్యను అభ్యసిస్తున్న శిక్షణార్థులు. బి) అధీకృత ఏజెన్సీ ద్వారా పథకం ప్రారంభమైన ఏడాదికాలంలో గుర్తింబడిన శిక్షణార్థులు సి) పథక కాలంలో ఒకే ఒక సారి నగదు ప్రోత్సాహం పొందడానికి అర్హులు.

**నేషనల్ కెరీర్ సర్వీస్ :** యువతకు ఉపాధి అవకాశాలను చూపించి, ఉద్యోగార్థులు, యాజమాన్యాల నమోదుకు నేషనల్ కెరీర్ సర్వీస్ ప్రారంభించారు. ఈ ఉద్యోగాల అనుసంధాన సేవలద్వారా వివిధ నైపుణ్య శిక్షణ కోర్సు, ఇంటర్న్‌షిప్, ఉద్యోగ సహా సమాచారం పొందవచ్చు. ఈ పోర్టల్ ద్వారా ఈ క్రింద సమాచారం పొందవచ్చు. ⇨ ఉద్యోగార్థులు ఉపాధి సంబంధిత అవసరాలకోసం తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ⇨ సంస్థలు తమ ఖాళీ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చవచ్చు. ⇨ కంప్యూటర్ ఆధారిత, క్లౌడ్ అధారిత వ్యవస్థలో స్వచలిత దరఖాస్తు విధానం. ⇨ ఆన్‌లైన్ ద్వారా ఉపాధి సలహాలు, సంప్రదింపులు. ⇨ సిఎస్‌సి, ఈ-కియోస్క్‌లాంటి బహుళ విధానాలతో ఉపాధి సంబంధిత సేవలు. ⇨ఉద్యోగ ప్రకటనలపై ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్, ఈమెయిల్ మరియు ఐవిఆర్ఎస్ ద్వారా సమాచారం అందజేత. ⇨ ఉద్యోగార్థుల నమోదుకోసం బహుళ భాష కాల్‌సెంటర్. ⇨ రాష్ట్రప్రభుత్వాలు, వివిధ మంత్రిత్వ శాఖలు, ఉపాధి కల్పన ఎక్స్ఛేంజీల మధ్య సమాచార మార్పిడి. ⇨ స్మార్ట్‌ఫోన్, ల్యాప్ టాప్ ద్వారా కూడా పోర్టల్‌ను వీక్షించవచ్చు.

Publishing date 6th August 2015, Posted on 7- 8 August 2015
Yojana (Telugu) August 2015 RNI Regd. No. 37729/80 Regd. No. H/HD-663/2015-17

# విజ్ఞాన ప్రదాయిని యోజన మాస పత్రికకు చందాదారునిగా చేరండి.




వివరాలకు
**ఎడిటర్,**
**యోజన** (తెలుగు)
10-2-1, ఎఫ్.డి.సి. కాంప్లెక్స్
మహావీర్ హాస్పిటల్ ఎదురుగా
ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్ - 500 028.
ఫోన్ : 23310162, 23315288
e-mail : yojana_telugu@yahoo.co.in

**చందా వివరాలు**

1 సంవత్సరానికి - రూ. 100
2 సంవత్సరాలకు - రూ. 180
3 సంవత్సరాలకు - రూ. 250

ప్రచురణల విభాగం విక్రయ కేంద్రం చిరునామా
**పబ్లికేషన్ డివిజన్ సేల్స్ ఎంపోరియం**
ఫస్ట్ ఫ్లోర్, బ్లాక్ - 4, గృహకల్ప కాంప్లెక్స్
ఎం.జె. రోడ్, నాంపల్లి, హైదరాబాద్ -1
ఫోన్ నెం. : 040 - 24605383

Printed and Published by Mrs. Sadhana Rout, Additional Director General & Head on behalf of Publications Division, Ministry of I & B, Government of India and Printed at Micro Offset Printers, 11-6-868, Red Hills, Lak di ka pool, Hyderabad - 500 004. Ph. 040 - 66750291 and Published at Yojana (Telugu) 10-2-1, F.D.C. Complex, A.C. Guards, Hyderabad - 500 028. Senior Editor : **Vijayakumar Vedagiri,** Tel : 23315288